
# కథామంజరి

## పది కథల సమాహారం



మార్చి 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి


**మార్చి 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 3

# రంజాన్ శుభాకాంక్షలు





# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i
విశిష్ట అతిథి ... ... ... ... ... ... ii
కథా మార్గదర్శి ... ... ... ... ... ... iv
కథా పరిచయం ... ... ... ... ... ... vi


## కథలు


లేమిని మించని పాపం ... పి. వి. ఆర్. శివకుమార్ ... ... 1
నిరసన ... తులసి బాలకృష్ణ ... ... ... 6
నెలగంట నవ్వింది ... వేలూరి ప్రమీలా శర్మ ... ... 11
జీ(వి)తం ... ఓట్ర ప్రకాష్ రావు... ... ... 16
ఇంతకీ మీరేవంటారు "జెన్ జీ" ... అంగర శ్రీనివాస రవిశేఖర్ ... 22
ప్రారబ్ధం ... కొయిలాడ రామమోహనరావు ... 27
బంగారు కిరీటం ... తేజశ్రీ ... ... ... ... 32
జ్ఞానం పంచుకోవాలి ... కంచనపల్లి వేంకట కృష్ణారావు ... 34
నిర్మోహదర్పణం ... శ్రీమతి జలంధర ... ... ... 37
మురికి కాలువ - మనిషి మనసు ... కీ. శే. మాడపాటి హనుమంతరావు ... 45


Cover Page Credits : Mr Chris Czermak, Manchester UK



# కథాకీయం

ఇంకా తెలుగు కథ బ్రతికి బట్ట కడుతున్నదంటే.. అప్రమత్తంగా ఉండే పాఠకులే కారణం!

కథ చదివి, మంచిచెడ్డలు విశ్లేషించేవారు కొద్దిమంది ఉంటారు. చదివి.. ఆ మంచిచెడులను తమలో దాచుకునేవారు మరి కొంతమంది ఉంటారు. వీరిలో కథ చదివి, 'ఇది ఫలానా కథకి కాపీ' అని సంపాదకులకు తెలియచేసే పాఠకులూ ఉన్నారు. మనుషుల్లో... ముఖ్యంగా రచయితలలో నైతికత లోపించిందని చింతించేది ఈ పాఠకులే.. పైన చెప్పిన మూడు వర్గాల పాఠకుల్లో, వీరే గొప్పవారు అని చెప్పాలి. రచయిత(త్రి)ల పరువు ప్రతిష్ఠలకు భంగం కలగకుండా, లేదా స్నేహపూర్వక వాతావరణం చెడిపోకుండా చూడ్డానికి.. ఆ పాఠకులు సంపాదకులకు ఏదో విధంగా తెలియచేస్తారు. సరే.. ఆ విషయాన్ని ఆయా రచయిత(త్రి)కి తెలియచేస్తే.. 'అబ్బే! అసలు ఆ కథ నేను చూడనేలేదు, ఆ రచయిత పేరు కూడా వినలేదు' అంటూ ఖండిస్తారు. ఇద్దరు రచయితలకు ఒకే కథావస్తువు ఆలోచనల్లోకి రావడం సహజమే.. కాని వారి శైలి, కథనం, సంభాషణలు.. ఖచ్చితంగా వేరు వేరుగా ఉంటాయి! అయితే ఈసారి సంక్రాంతి కథల పోటీలో బహుమతి వచ్చిన ఒక కథ.. మరో పత్రికలో అప్పటికే ముద్రించబడిందని తెలియచేసారు. సరే ఆ కథను తొలగించాం! ఇప్పుడు బహుమతి పొంది.. ఫిబ్రవరి 2026 సంచికలో ప్రచురితమైన మరో కథ.. ఓ అనువాద కథ అని, అప్పటికే వేరెవరో చేసిన అనువాదం మరో పత్రికలో 2022లోనే ప్రచురితమైందనీ పాఠకులు తెలియచేయడం.. మరోసారి మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తెలుగుకథ మనుగడకు వచ్చే ముప్పు కంటే.. రచయితలకు ఉండవలసిన నైతికత లోపిస్తోందనే భయం ఆవహిస్తోంది. ఎవరో ఒకరో ఇద్దరో చేసే ఈ పనుల వలన.. యావత్ రచయితల జాతి మీద నమ్మకం, విశ్వాసం, గౌరవం కూడా పోయే పరిస్థితి వస్తుంది.

కథలతో పాటు పంపే హామీపత్రంలో పొందుపరిచే విషయాలన్నీ గాలికి వదిలేస్తున్నారు. పేరు గురించో, బహుమతి గురించో.. ఇలా అక్షరచోర్యం పెద్దలే చేస్తే, వచ్చే తరం వారికి ఎలాంటి సందేశం వెళ్తుందో... పాఠకులు, సాహితీవేత్తలే కాదు.. ప్రతీ మనిషీ ఆలోచించాలి. ఇప్పటికే సమాజంలో.. ఉండవలసిన నైతిక విలువలు పతనమయి పోతున్నాయి, మాతృభాష మరుగున పడిపోతోంది, సాహిత్యాన్ని మూటగట్టి కేజీల లెక్కను అమ్మేస్తున్నారు. ఈ గ్రంథచౌర్యం వంద సంవత్సరాల క్రితం కూడా ఉండేది. అప్పట్లో ఆ విషయాలు బాహాటంగా రచయితల పేరుతోనే విమర్శలు, విశ్లేషణలు వచ్చాయి. కానీ అవి రాష్ట్రం దాటి వెళ్లలేదు. ఇప్పుడు.. సాహిత్యం, సముద్రాలు దాటి దేశదేశాలా వ్యాపించింది. అంటే.. మనం తప్పు చేస్తే, అది ప్రపంచంలో ఉన్న అందరికీ తెలుస్తుంది.

ఇటువంటి స్థితిగతుల మధ్య.. ఈ అనంత విశ్వంలో.. అక్షరచౌర్యాన్ని కనుగొనటం, అరికట్టడం.. ఏ కొద్దిమందో చేయలేరు. వాస్తవానికి మానవ సాధ్యం కూడా కాదు.

ఎవరు చేయగలరంటే...

అక్షరాన్ని ఆరాధించే... రచయితలే తమ చిత్తశుద్ధిని, నిజాయితీని నిలబెట్టుకోవాలి!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

## శ్రీమతి జలంధర

సాహిత్యం మీద మక్కువ, కథలు వ్రాయాలనే అభిలాష, రాయగల భాషా పరిజ్ఞానం... ఇవన్నీ ఉంటే, జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా, ఏ రంగంలో ఉన్నా, ఆ రంగంలో ఉండే పని ఒత్తిడితో సమయం చిక్కకపోయినా.. కవితో, కథో మస్తిష్కంలో గూడు కట్టుకున్నప్పుడు.. అది అక్షరరూపంలో పురుడు పోసుకుని జనిస్తుంది. వర్తమానంలో.. ముఖ్యంగా రాజకీయ, సినీ రంగాల్లో పనిచేసేవారిలో సాహితీవేత్తలు కనబడరు కాని, నిన్న, మొన్నటి తరాల వాళ్ళలో కొద్దిమంది రచయితలను గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఊహకు కూడా అందరు. ఆ తరాలలో రాజకీయాల్లో ఉన్నవాళ్ళ, దగ్గర్నుంచి కూలిపనులు చేసుకునే వారి వరకు.. కథలు వ్రాసేవారూ, కవిత్వం చెప్పేవారూ, పద్యరచన చేసేవారూ.. ఇలా సాహితీప్రక్రియల్లో ఆరితేరినవారు కనబడేవారు. అటు రాజకీయ నాయకుల్లో, ఇటు సినిమారంగంలో ఉండేవాళ్ళలో మంచి కథకులు ఉండేవారు. కవిత్వం రాసేవారూ ఉండేవారు. అదిగో ఆ కోవకి చెందినవారే.. ప్రముఖ కథా, నవలా రచయిత్రి శ్రీమతి జలంధర. ఈవిడ ప్రముఖ తెలుగు సినిమా నటుడు, విలక్షణమైన నటనా చాతుర్యంతో, తనకున్న ప్రతిభతో ఆనాటి హేమాహేమీల నడుమ మంచి నటుడుగా పేరు తెచ్చుకుని, తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందిన నిన్నటితరం గొప్ప నటుడు కీ.శే. చంద్రమోహన్ గారి సతీమణి! సహజంగానే సినిమా వారు, వారి కుటుంబ సభ్యుల జీవనశైలి వేరుగా ఉంటుంది. ఆలోచనలు వేరుగా ఉంటాయి. సామాన్య జీవితాలలో తొంగిచూడ్డానికి గానీ, పరిశీలన చేయడానికి అవకాశాలు ఉండవు. కొంచెం సగటు మనుషుల జీవనాల కంటే పైమెట్టు మీదే వారి జీవితాలు ఉంటాయి. మరి.. ఇలాంటి వారికి కథలు, నవలలు వ్రాయడానికి సమయం ఎక్కడ చిక్కుతుంది, సమాజం మీద గాని, వారి సమస్యల మీద గాని అవగాహన ఉండడానికి అవకాశాలు ఉండవని అనుకుంటాం! కాని ఇది తప్పు అని ఋజువు చేసే అతికొద్ది మంది సినీ కుటుంబాలలో అరుదైన వారు శ్రీమతి జలంధర గారు! నిజానికి జలంధరగారు.. తన వివాహానికి ముందే రచయిత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తన పద్నాలుగవ ఏటే, స్కూలు మాగజైన్ లకి కథలు వ్రాయడం మొదలెట్టారు. పదిహేడవ ఏట వ్రాసిన కథ "నా కథ", ఆంధ్రప్రభలో ప్రచురింపబడింది. అప్పట్లో శ్రీ విద్వాన్ విశ్వం గారు ఆ పత్రిక సంపాదకులు. ఆయన్ని మెప్పించిన కథంటే.. జలంధర గారి కలం ఎంత పదునో వేరే చెప్పవలసిన అవసరం లేదు.

సరిగ్గా మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఓ నెల రోజుల ముందే చెన్నై లో జన్మించిన జలంధరగారి తండ్రిగారు డా. గాలి బాలసుందరరావు గారు.. మంచి రచయిత, కళాకారుడు కూడా! ఆ రోజుల్లో ఎంతో పెద్ద రచయితలు, కళాకారులు, జర్నలిస్టుల సమావేశాలు ఇష్టాగోష్టులు.. వీరి ఇంట్లోనే నిర్వహించేవారుట. ఆ వాతావరణం కొంత స్ఫూర్తిని ఇస్తే, మరో వైపు జలంధరగారి మేనత్త, ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి తెన్నేటి హేమలత (లత) గారితో ఉన్న సాంగత్యం.. జలంధర గారికి మరింత స్ఫూర్తినిచ్చి, రచనారంగం వైపు అడుగులు వేయటానికి దోహదపడింది. శాస్త్రీయ దృక్పథం, జ్యోతిష్యం, మంత్రశాస్త్రం మొదలగు విషయాల మీద తండ్రి నిర్వహించే చర్చలు, ఇంట్లో బామ్మల సనాతన పద్ధతిల మధ్య పెంపకం... వీటి ప్రభావంతో జలంధరగారిలో ఒక పాజిటివ్ దృక్పథం అలవాటు పడి, రచనలు చేయడానికి గట్టి పునాదులు పడ్డాయి.

ఆ పునాదులతో జలంధరగారు.. గడిచిన ఏభై కాలంలో నూరుకి పైగా కథలు, నాలుగు నవలలు, మరెన్నో నవలికలు, వ్యాసాలు, ఇరవైకి పైగా రేడియో నాటికలు వ్రాసారు. 2013లో ప్రథమ ముద్రణ లో విడుదలైన.. వీరి నవల "పున్నాగ పూలు".. ఇప్పటికీ ఎనిమిది ముద్రణలు పూర్తి చేసుకోవడం.. ఆ నవల ప్రాచుర్యాన్ని తెలియచేస్తుంది. "ఆ నవల చదివి ప్రభావితులై, జీవితాలను సరిదిద్దుకున్నామని..." అంటూ ఎందరో పాఠకులు స్పందించారంటే, జలంధరగారి రచనల గొప్పతనం గురించి వేరే చెప్పక్కర్లేదు. "సాహితీ వనంలో సజీవ స్త్రీ మూర్తులు" పేరిట.. తెలుగు సాహిత్యంలో ఉన్న ఓ ఇరవై విశిష్టమైన స్త్రీ పాత్రల గురించి జలంధరగారి విశ్లేషణలు.. చాలామంది సాహిత్య పరిశోధనలు చేసే విద్యార్థులకు మార్గదర్శకాలు నిలిచిపోయాయి!

ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న జలంధరగారు.. ఎంతో సౌమ్యులు, నిరాడంబరంగా ఉంటారు. చంద్రమోహన్ గారితో వివాహం అయ్యేనాటికే జలంధరగారు మంచి రచయిత్రిగా గుర్తింపు వచ్చినా.. వివాహం తర్వాత జీవనశైలిలో మార్పు వచ్చినా సరే.. తన కలాన్ని ఆపలేదు. సమయం చిక్కడం లేదు, సినిమా వాళ్ళ జీవితంలో పడి సాహిత్యాభిలాష పక్కకి వెళ్ళిపోయిందనే మాట ఆమె నుంచి వినబడలేదు. ఆ రోజుల్లో పండగలకి వచ్చే ప్రత్యేక సంచికల కోసం సంపాదకుల అభ్యర్థన మేరకు కథలు వ్రాసి పంపేవారు. రేడియో వారి కోసం గంట నిడివి గల నాటికలు వ్రాసేవారు. ఏది వ్రాసినా.. తన సిద్ధాంతాలు, నమ్మకాలకు లోబడే వ్రాసారు. ఆంధ్రభూమి వారపత్రికలో "మైత్రి కౌన్సిలింగ్" శీర్షిక పేరిట.. ఎంతో మంది జీవితాలను చక్కదిద్దారు. ఈ రోజుకీ.. దివంగతులైన భర్త చంద్రమోహన్ గారి సంస్మరణలో వృద్ధులకు, దిక్కులేని స్త్రీలకి వైద్య సదుపాయాలు అందిస్తున్నారు.

అడిగిన వెంటనే.. కథామంజరి ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసిందినందులకు శ్రీమతి జలంధర చంద్రమోహన్ గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. వారి కలం నుంచి మరిన్ని రచనలు తెలుగునాట విరబూయాలని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. మాడపాటి హనుమంతరావు

రాజకీయనాయకుల్లో భాషాపండితులు, సాహితీవేత్తలు, సంగీత కళాకారులు ఉండేవారని అంటే.. ఈ తరం వారు ఆశ్చర్యపోతారు. కాని మొన్నటి తరం వరకు తెలుగు సాహితీవేత్తలలో.. రాజకీయాల్లో తలమునకలైన వారు కూడా ఉండేవారు. తెలుగు నాట కూడా కవులు, భాషా పండితులు, కథా రచయితలు.. ఇలా వివిధ సాహితీ ప్రక్రియలలో ఆరితేరినవారు రాజకీయాల్లో కూడా ఉండేవారు. అలాంటి ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి కీ.శే. మాడపాటి హనుమంతరావు గారు. ఆయనని ఇరవయ్యవ శతాబ్దంలో మొదటి తరం కథా రచయితగా చెప్పుకోవచ్చు. ఎప్పుడో.. నూటపాతిక సంవత్సరాల క్రితం.. తెలంగాణ ప్రాంతంలో ఆంధ్రోద్యమాన్ని ప్రారంభించి.. అందరి చేత "ఆంధ్ర పితామహ" అనిపించుకుని, నిజాం సామ్రాజ్యంలో తెలుగు భాషకు జీవం పోసి, తెలుగు వారి రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక జీవనాలకి ఊపిరిపోసి నిలబెట్టారు. ఆ రోజుల్లోనే గ్రంథాలయ ఉద్యమం నుంచి మహిళా ప్రగతి వంటి అనేక ఉద్యమాలను ముందుండి నడిపించారు.

హనుమంతరావుగారు వ్రాసిన కథలు పదమూడే! ఆ కథల్లో పది కథలతో 'మల్లికా గుచ్ఛం' అనే సంపుటి పుస్తకంగా రూపు దిద్దుకుంది. ఇవి కాకుండా చాలా వ్యాసాలు వ్రాశారు. అలాగే "తెలంగాణ ఆంధ్రోద్యమం" అనే గ్రంథం హనుమంతరావు గారికి పేరు తెచ్చిపెట్టింది. 1912 లో అప్పటి రైతుల జీవితాల మీద వ్రాసిన ఆయన మొదటి కథ "ఎవరికి?" ... చాలా ప్రాచుర్యం పొందింది. మొదట్లో కాస్త గ్రాంథిక భాష కనబడినా .. తర్వాతి కాలంలో అసలు సిసలైన వ్యవహారిక తెలుగులో కథలు వ్రాసారు. 1969లో కూడా... అంటే ఆయన ఎనభై నాలుగో ఏట కథ వ్రాసారు. ఆ కథ పేరు "ఆకలికి అర్థం". ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించారు. సమకాలీన పరిస్థితులను సమూలంగా గమనిస్తూ, అందులో తన గుండెకి తాకే విషయాలను కథావస్తువుగా తీసుకుని, తనదైన శైలిలో కథలు వ్రాసారు. ఉద్యమాల ద్వారానే కాకుండా, తన రచనలతో కూడా యువతను ప్రోత్సహించే వారు. మరో వైపు రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ.. హైదరాబాదు నగరానికి మొదటి మేయర్‌గా పని చేసారు. తర్వాతి కాలంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా అడుగు పెట్టి, తొలి అధ్యక్షుడుగా కూడా వ్యవహరించారు.

1885 జనవరి 23 తేదిన కృష్ణాజిల్లాలో జన్మించిన హనుమంతరావుగారి చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో, నల్లగొండలో ఉన్న మేనమామ దగ్గరికి వెళ్ళిపోయారు. మెట్రిక్యులేషన్ పాస్ అయిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరి, తర్వాత ప్రైవేటుగా లా చదివి, ఉద్యోగానికి రాజీనామా చేసి లాయర్‌గా ప్రాక్టీసు మొదలుపెట్టారు. ఆ సమయంలోనే ఉద్యమాలలో చేరి, వాటిని ముందుండి నడిపించారు. దరిమిలా.. రాజకీయాల వైపు అడుగులు వేసి, క్రియాశీలక కార్యకలాపాలలో పాల్గొనడం ఆరంభించారు.


ఇలా ఇతరత్రా తలమునకలై ఉన్నా సరే, హనుమంతరావు గారు పద్యరచన, వ్యాసాలు వ్రాయడం, అనువాదాలు చేయడం చేస్తూండేవారు. ఆయన వ్రాసిన కథల్లో.. "హృదయ శల్యము, రాణీసారంధ్రా, ముసలిదాని యుసురు, నేనే, న్యాయమా, ఎవరిది తప్పు.." వంటి కథలు బాగా ప్రాచుర్యం సాధించాయి. హనుమంతరావు గారి రచనలలో ఎక్కువ శాతం మరో భాషా కథల అనువాదాలే, గానీ ఆ కథల్లో ప్రత్యేకత ఉండేది. ఆధునిక తెలుగు ఉపయోగిస్తూ నూతన రీతిలో కథలని సమాజానికి, సహజ వాతావరణానికి చేరువయ్యేటట్టు ఆవిష్కరించారు! అలాగే మన ప్రాచీన గ్రంథ ప్రచురణల కోసమని సొంత డబ్బులతో "ఆంధ్ర సారస్వత నిక్షేపము" అనే ట్రస్టుని ఏర్పాటు చేసారు. దాని ద్వారా ఎన్నో గ్రంథాలను ప్రచురించారు.

తెలుగు కథకుల్లో ఓ అరుదైన ఆణిముత్యంగా చెప్పుకోవలసిన కీ.శే. మాడపాటి హనుమంతరావు గారు.. 1970 నవంబరు 11 వ తేదిన దివంగతులు అయ్యారు. వారి సాహిత్యకృషి స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులు అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

---

## కథా పుస్తక పరిచయం




### గాంధీ చిన్న కథలు

ఆచార్య వి. బాలమోహన్ దాస్, మాజీ వైస్ చాన్సలర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గాంధీజీ జీవితంలో జరిగిన చిన్న సంఘటనలను, విషయాలను, విశేషాలను కథా వస్తువుగా తీసుకుని ఇప్పటి వరకు 200 కథలు వ్రాసారు. మొదటి 100 కథలతో క్రిందటి సంవత్సరంలో ఓ సంపుటి వచ్చింది. జనవరి 2026 లో రు.150 ల వెలతో విడుదలైన మరో 100 కథలతో వెలువడిన ఈ సంపుటి కోసం..

గాంధీ సెంటర్,
డా. ఎల్. బుల్లయ్య కాలేజీ క్యాంపస్,
**విశాఖపట్నం – 530013**

✆ 98480 10187

✉ *vbmdas@rediffmail.com*



# కథా పరిచయం

## కీ. శే. వి.వి.బి. రామారావు గారి కథ : ది లాస్ట్ కేస్!

డా వాడపల్లి విజయభాస్కర రామారావు గారు, అదే, నాకు తెలిసిన వివిబి రామారావు గారు.. మేము ఎం.ఆర్. కాలేజీ, విజయనగరంలో ఇంటర్మీడియెట్ చదువుకొనేటప్పుడు మాకు ఇంగ్లీషు లెక్చరరుగా వుండేవారు. అది సుమారు యాభై ఏళ్ళ పైమాట! అప్పట్లో ఆయన మాకు లెక్చరరుగానే తెలుసు. 88వ ఏట.. అంటే ఈ సంవత్సరం ఫిబ్రవరి ఒకటో తారీఖున ఆయన ఈ ప్రపంచాన్ని విడిచి వెళ్ళిపోయిన తరవాత తెలిసింది ఆయన చేసిన సాహిత్యసేవ గురించి. ఆయన చేసిన అనువాదాలు అటు ఆంగ్లంలోనూ, ఇటు తెలుగులోనూ కూడా ఎన్నో, ఎన్నెన్నో! ఇంగ్లీషులో సుమారు పది పుస్తకాలు ప్రచురించారు, అనువాదాలు, మూలాలతో కలిపి. అలాగే తెలుగులో వచ్చిన పుస్తకాలు మరో పదిహేడు. ఇవి కాక దుర్గా సప్తశతి, శివపురాణం లాంటి గ్రంధాలను కూడా ఆయన ఇంగ్లీషులోకి అనువదించారు. అంతే కాదు. ఆయన రాసిన వ్యాసాలు ఎన్నో ఉన్నాయి. తన జీవితకాలంలో ఒక సాహితీ విమర్శకుడిగా, ఒక అనువాదకుడిగా, కవిగా, కథ మరియు నవలా రచయితగా ఎడతెరిపి లేకుండా రచనలు సాగించిన రామారావుగారికి ఆయనకు రావలసిన గుర్తింపు రాలేదనే చెప్పాలి.

ఆయన రాసిన కథలను పరిశీలిస్తే, ఆయనకి డాక్టరు వృత్తిపై ఒక ప్రత్యేకమైన అభిమానం, ఎంతో ఉత్సుకతతో డాక్టర్ల జీవితాల గురించి, మెడికల్ పదజాలాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం కూడా చాలా చేసినట్లు తెలుస్తుంది. ఇప్పుడు పరిచయం చేయబడుతున్న 'ది లాస్ట్ కేస్' అనే కథ ఇందుకు ఒక ఉదాహరణ.

కరుణ అనబడే డాక్టర్ కరుణాకరరావు, డాక్టర్ విశ్వేశ్వరరావు, బాల్య మిత్రులు, కలిసి చదువుకున్నారు, హాస్టల్ మేట్స్. విశాఖపట్నంలో కరుణ సర్జన్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. విస్సు అని పిలవబడే విశ్వేశ్వరరావు.. తన తండ్రి ప్రాక్టీస్ చేసే చిన్న ఊళ్లోనే ఉంటూ, ఆ ప్రాక్టీస్‌ని ముందుకు తీసుకెళ్తున్నాడు. ఇద్దరి ప్రాక్టీసులలో ఒకరికొకరు సలహాలిచ్చుకుంటూ, అవసరమైతే పేషెంట్లను రిఫర్ చేస్తూ, తమ స్నేహాన్ని ఎప్పటిలాగే కొనసాగిస్తున్నారు.

ప్రాక్టీస్ చాలా జోరుగా సాగుతూ, తనకంటూ కొంచెమైనా తీరిక లేక, విశ్వేశ్వరరావు ఆరోగ్యం కొంచెం దెబ్బతింటున్నట్లయింది. అందుకే అతను కరుణకు ఒక నోట్ పంపాడు. తను ఫలానా గురువారం వస్తానని, తమ ప్రొఫెసర్ సూర్యనారాయణ, జి ఎం గారితో అప్పాయింట్మెంట్ తీసుకోమని! కరుణ ఆ రోజు తన ప్రాక్టీసుని పక్కకి పెట్టి, ప్రొఫెసరుగారికి కాల్ చేస్తాడు.

సూర్యనారాయణ గారు రిటైర్ అయి పాతికేళ్ళయింది. ఆయన ప్రొఫెషనల్ ఎథిక్స్ విషయంలో చాలా స్ట్రిక్ట్. ఎన్నో ఏళ్ళ తరవాత కూడా ఆయన జ్ఞాపకశక్తి ఇసుమంతైనా తగ్గలేదు. కరుణ విస్సు గురించి ఎత్తంగానే "అవును, విశ్వేశ్వరరావు,

1952 బాచ్, మీ క్లాస్‌మేట్, ఆ షార్ట్ కేన్ కొలైటీస్‌ను అపెండిసైటిస్ అన్నాడుగా!” అంటూ గుర్తు చేసి, గురువారం కలవడానికి ఒప్పుకున్నారు.

విశ్వేశ్వరరావు వచ్చాడు అనుకున్నట్లుగానే. తన ఆరోగ్యం బావుండటం లేదని, బీపీ, షుగరు, అన్నీ ఉన్నాయని, కరుణ హాస్పిటల్‌లో అన్నీ ఉన్నా, తనకు జి ఎం దగ్గరే చూపించుకోవాలని ఉందని చెప్తాడు. ఇద్దరూ గుర్తు తెచ్చుకున్నారు మాటల్లో. సూర్యనారాయణ గారిది హార్ట్ ఆఫ్ గోల్డ్. ఒకసారి క్లాసులో వెనక బెంచీలో అవధాని నిద్ర పోతుంటే, ఆ గురక శబ్దం విని, ఆయన “హు ఈజ్ గర్లింగ్... లుక్ అవుట్... హే హాజ్ కంజెషన్ ఇన్ ద లంగ్” అంటూ స్టెత్‌తో పరీక్ష చేసి, లెఫ్ట్ లంగ్‌లో కేవిటీ ఉందని వెంటనే వార్డుకి పంపించేశారు. అదీ ఆయన పద్ధతి.

సూర్యనారాయణగారు ఇద్దరినీ సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించారు. కరుణ వచ్చిన పని చెప్పాడు. విశ్వేశ్వరరావుకి బీపీ కొలిచి, లంగ్స్ పరీక్ష చేశారు. కరుణను కూడా చూడమని పురమాయించారు. కరుణ స్టెత్ మెళ్ళో వేసుకుంటే మందలించారు. విస్సుకి కార్డియాక్ కాన్షస్ అవద్దని, అంతా బాగానే ఉందని చెప్తారు.

అయితే మధ్య మధ్యలో గొంతు పూడుకుపోయినట్లయి సద్దుకుంటూంటారు సూర్యనారాయణగారు. ఆయనకు ఒంట్లో సరిగ్గా లేదని గ్రహిస్తారు ఇద్దరు స్నేహితులు. సూర్యనారాయణగారి భార్య మల్లికమ్మగారి ఆతిథ్యంలో మాట్లాడుకుంటూ భోజనం చేస్తారిద్దరూ. ప్రొఫెసరుగారు మాత్రం గొంతు బాలేదని లిక్విడ్ డయట్ ఫాలో అవుతానని భోజనానికి కూర్చోరు. మాటల సందర్భంలో ప్రొఫెసరుగారి అనారోగ్యం గురించి చెబుతుంది మల్లికమ్మగారు. ఎంత చెప్పినా వినరని, అస్సలు చెక్ చేయించుకోరని!

మూడు రోజుల తరువాత తెలుస్తుంది ప్రొఫెసరుగారు ఇక లేరని! కరుణ విశ్వేశ్వరరావుకి ఉత్తరం రాస్తాడు. ముందు గురువారం విస్సుని చూసిన కేసు.. ఆయన చూసిన చివరి కేసని, శుక్రవారానికి ఆయన పిల్లలిద్దరినీ ఇంటికి రమ్మని పిలిచారనీ, అదే రోజు మల్లికమ్మగారు, పిల్లలూ కూర్చుని మాట్లాడుతూనే ఉండంగా ఆయన సునాయాసంగా ప్రాణం విడవడం జరిగిందని! ఇంకోటి.. కరుణ, విశ్వేశ్వరరావు విషయంలో ప్రొఫెసరు గారితో ఫోన్‌లో మాట్లాడుతూన్నప్పుడు “డోంట్ మిస్ దిస్ థర్స్ డే” అన్న మాటలు జ్ఞాపకానికొస్తాయి కరుణకి. ఆయన విషయంలో జరిగిన అద్భుతం, ఆయన తన చరమఘట్టాన్ని అంత ఖచ్చితంగా అంచనా వేసుకోగలగటం! అంత విశిష్టమైన వ్యక్తిని కోల్పోయామని బాధపడతాడు కరుణ విస్సుకి రాసిన ఉత్తరంలో.

ఈ కథ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక డిసెంబరు 2, 1975 సంచికలో అంటే సుమారుగా 50 సంవత్సరాల క్రితం ప్రచురితమైంది.

ప్రొఫెసరు గారి గురించి చెప్పడానికి రచయిత కొన్ని ఉదాహరణలు పాత్రలతో చెప్పిస్తారు. అవి ఆయనకున్న మెడికల్ పరిజ్ఞానం, సమయస్ఫూర్తి, ఒక స్టూడెంటు తప్పు చేస్తున్నా, క్షమించి వదిలేయగల పరిపక్వత, పేషెంట్లను సాంప్రదాయేతర విధంగా ట్రీట్ చేసి, పేషెంటుకి మానసిక ధైర్యాన్నివడం ద్వారా (మందుల వల్ల కాదు) మరి యే డాక్టరు తీసివేయలేని అతని రుగ్మతను పారద్రోలడం లాంటివి ఆ ప్రొఫెసరు గారి వ్యక్తిత్వాన్ని సూచిస్తాయి.

ఇలాంటి ప్రొఫెసరుగారు, రచయిత ఆలోచనలో, తనని తనే ట్రీట్ చేసుకున్న (సునాయాసంగా ఈ ప్రపంచాన్ని విడిచి వెళ్ళేటట్టు చేసుకోవడమే) బహుశా చివరి కేసు ఆయనదే కదా!

***పరిచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్***

కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
శ్రీ విశ్వావసు నామ వత్సర సంక్రాంతి - 2026

# లేమిని మించని పాపం


## పి. వి. ఆర్. శివకుమార్

✆ 9594996990


***"అంతా సవ్యంగానే జరిగిందా?" అడిగిందామె, "మీరు వెళ్ళినప్పటి నుంచీ నాకు భయంగానే ఉంది. మీ ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే ఉంది. ఇంకెప్పుడూ ఇటువంటి పనికి వెళ్ళకండీ. పాపం వస్తుందేమో కూడా!"***

***"లేమిని మించిన పాపం లేదు సరళా!" వణుకుతున్న గొంతుతో అన్నాడు దిశాపతి.***

'ఆపదలో ఆదుకునేవాడే నిజమైన స్నేహితుడు'

నిన్న రాత్రినుంచీ ఆ వాక్యం మనసులో తచ్చాడుతూ నిద్రకు దూరం చేసింది దిశాపతిని.

నిద్ర లేని కళ్ళముందు 'మహేశ్వర్' అనే పేరు కదలాడుతూనే ఉంది. భయపెడుతూనే ఉంది.

తెల్లవారి ఆలస్యంగా నిద్ర లేచాడు. తొమ్మిది గంటలయ్యే వరకూ ముళ్ళమీద కూర్చున్నట్టు గడిపాడు.

సరళ కాఫీ తెచ్చి ఇచ్చింది. పాలు తక్కువా, నీళ్ళు ఎక్కువగా ఉన్న ఆ కషాయం వేడిగా మాత్రం ఉంది.

"నువ్వు త్రాగావా?" ఆమె జవాబు చెప్పలేదు. అతడు ఆశించనూ లేదు.

ఒక సంచిలో ధోవతి పెట్టుకుని, చెప్పులు వేసుకుంటుంటే సరళ అడిగింది,

"వెళ్తున్నారా?" జవాబేమీ చెప్పకుండా బయటపడ్డాడు.

"జాగ్రత్త." అంటుంటే ఆమె గొంతు వణికింది. కళ్ళలో నీళ్ళు త్రిప్పుకుని ఊరుకుంది.

అరగంట సేపు నడిచి, సందులు చూసుకుంటూ, చివరికి ఆ యింటి ముందుకి వచ్చి ఆగాడు. వాకిటి ముందు కట్టి ఉన్న ఆ వినైల్ బ్యానర్ మళ్ళీ ఒకసారి చదివాడు. – హెడ్డింగ్ కింద పెద్ద ఫోటో. ఫోటో క్రింద వివరాలు.



"దశదిన కర్మ"
కీర్తిశేషులు. హంగు మహేశ్వర్
[జననం: 18.9.88 – శివ సాయుజ్యం: 11.07.25]




'చిన్న వయసులోనే పోయాడు. దాదాపు తన వయసే.'

దిశాపతికి తన భార్య, పిల్లలు గుర్తుకి వచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'తను ఉన్నప్పుడే కుటుంబం పరిస్థితి ఇలా ఉంది. తనూ ఇలాగే అకాలంలో పోతే?!'

వెన్నులో నుంచి భయం జరజరా ప్రాకింది.

'లోపలికి వెళ్దాం' అనుకున్నాడు. కానీ వెంటనే వెళ్ళలేకపోయాడు. లోపల కనబడుతున్న మనుషులని బయటినుంచే చూస్తూ, కాసేపు వాకిలికి ఒక వారగా నిలబడిపోయాడు.

ఆ పక్కనే నిలబడి ధూమపానం చేస్తూ మాట్లాడుకుంటున్నవారి మాటలు చెవుల్లో పడుతున్నాయి.

"కొత్తగా వచ్చాడు విశాఖపట్నం నుంచి! మూడు నెలలు కూడా కాలేదు... బదిలీ మీద వచ్చి! చాలా మంచివాడు. 'తానొక అధికారి' అన్నదర్పం లేదు. ఈ కొద్ది రోజుల్లోనే ఉద్యోగుల సమస్యలని అర్థం చేసుకున్నాడు. పరిష్కారాలకి పైవాళ్ళతో మాట్లాడటం, ప్రణాళికలు వేయటం కూడా మొదలుపెట్టాడు. ఇంతలో ఇలా... అందుకే గాబోలు అంటారు... మంచివాళ్ళని దేవుడు త్వరగా తీసుకుపోతాడని!"

"ఒక్క చెడు అలవాటు కూడా లేదు, మరి హఠాత్తుగా ఆ గుండె పోటు ఎలా వచ్చిందో!" మాట్లాడుకుంటూనే వాళ్ళు లోపలికి వెళ్ళిపోయారు.

మహేశ్వర్ గురించి వాళ్ళు చెప్పుకున్న మాటలు వింటుంటే దిశాపతికి, అంతవరకు తనలో నిండిన కంగారుకి, తెలియని ఆందోళనకి ఉపశమనం కలిగినట్లయింది.

అక్కడ వాతావరణంలో పూర్తిగా విషాదం అలుముకుని ఉంది.

‘వృద్ధుల చావు పెళ్ళితో సమానం’ అని నానుడి ఉంది. జీవితం సంపూర్ణంగా అనుభవించి, బాధ్యతలన్నీ తీర్చేసుకుని, ఈ లోకం నుంచి నిష్క్రమించటం... ఆత్మీయులని అది ఒక వెలితిగా బాధిస్తుంది గానీ, సమాజానికి మాత్రం సహజ పరిణామంగానే అనిపిస్తుంది.

అయితే, నలభై ఏళ్ళు కూడా నిండని వ్యక్తికి జీవితం మీద చాలా ఆశలు ఉంటాయి. తీరని కలలు ఉంటాయి. తీర్చుకోవలసిన బాధ్యతలు ఉంటాయి. అతడిమీద ఆధారపడిన కుటుంబం ఉంటుంది. అటువంటి వయసులో తనువు చాలించటం భార్యాబిడ్డల బతుకులని తలక్రిందులు చేస్తుంది. అయినవాళ్ళని అతలాకుతలం చేస్తుంది. పరిచయస్తులందరినీ ఆ విషాదం ‘ఒక నిముషం సేపు ఆగి, భవిష్యత్తు గురించి ఆలోచించుకో’మని హెచ్చరిస్తుంది.

తప్పదన్నట్టు నెమ్మదిగా కదిలి ఆ విషాదవాతావరణంలోకి అడుగు పెడుతుంటే, దిశాపతి కాళ్ళు వణికాయి.

ఆ ఆవరణలో పొందికగా కట్టిన డాబా ఇల్లు. ముందు ఖాళీజాగా, వెనుక విశాలమైన పెరడు! ముందున్న జాగాలో వేసిన తాడిపత్రి పందిరి క్రింద కొన్ని కుర్చీలు వేసి ఉన్నాయి. ఏడెనిమిది మంది ఆ కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కొందరు ఆడవాళ్ళు హడావిడిగా అటూ, ఇటూ తిరుగుతున్నారు.

అంతలో లోపలినుంచి వచ్చిన పసివాడు దిశాపతి కళ్ళలో పడ్డాడు. పదేళ్ళలోపు వయసున్న ఆ కుర్రవాడికి శిరోముండనం చేసి ఉంది. వెనుకగా చిన్నపిలక. తెల్లటి రంగులో ఉన్న ఆ పసివాడి శిరోభాగం లేత పచ్చరంగులో బోసిపోయి కనిపిస్తోంది. ఆ ముఖంలో బేలతనంతో కూడిన దైన్యం తాండవిస్తోంది.

దిశాపతి నెమ్మదిగా ఆ పసివాడి దగ్గరకు నడిచాడు. రెండు చేతులతోనూ వాడిని దగ్గరకు తీసుకుంటుంటే, అతడి చేతులు వణికాయి. కళ్ళ నుండి రెండు నీటిబొట్లు జారి పసివాడి తలమీద పడ్డాయి. వాడిని అలాగే పట్టుకుని, ఒక కుర్చీలో కూలబడ్డాడు.

“నీ పేరు?”

“బాచి... భాస్కర్.” వాడి గొంతులోనూ తడి! జవాబు చెప్తూనే, దిశాపతి మొహంలోకి అయోమయంగా చూసాడు.

ప్రక్కనున్నవాళ్ళు దిశాపతికేసి ప్రశ్నార్థకంగా చూశారు. దిశాపతి క్షణం పాటు ఏమీ మాట్లాడలేదు. కొద్దిసేపటి తరవాత బాచి తలమీద చేయి వేసి, నిమురుతూ గొణుక్కున్నట్టుగా అన్నాడు... “ఇంతప్పటి స్నేహం. చిన్నప్పుడే దూరమైపోయాం! ఎప్పుడన్నా ఓ ఫోన్ పలకరింపు. ఓ కుశలప్రశ్న. అయితేనేం, మనసులో మాత్రం నిలిచే ఉన్నాడు. ఎలా మర్చిపోతాను? బడి రోజుల్లో, నాకు పుస్తకాలు కొనుక్కునే స్తోమత కూడా లేని సందర్భాలలో చాలా సాయం చేసేవాడు. బడి దాటుతూనే ఊరు దాటేయవలసిన అవసరం వచ్చింది. బతుకుతెరువు వెతుక్కుంటూ దుబాయ్ వెళ్ళిపోయాక, సంబంధం తెగినట్లే అయిపోయింది. ఎవరం ఎక్కడున్నామో కూడా తెలియని పరిస్థితి! తెలియకుండా ఉండిపోతేనే బాగుండేది! బాగానే ఉన్నాడన్న భ్రమలోనే ఉండిపోయేవాడిని. వారం రోజుల క్రితమే సెలవు మీద వచ్చాను. మహేశ్వర్ ఈ ఊళ్ళో ఉన్నాడని తెలియదు. ఈ ఉదయం వేళ ఇటుగా వెళ్తుంటే, అశనిపాతంలా ఈ ఇంటి ముందు బ్యానర్! ఫొటోలోంచే పిలిచి పలకరించాడు. పేరు చూస్తూనే తెలిసింది, ఇంత ఘోరం జరిగిందని. ఏం తొందర వచ్చిందని?” దుఃఖం తన్నుకు వచ్చినట్టు

మాటలు ఆపేసి, రెండు చేతులతోనూ ముఖం కప్పుకున్నాడు దిశాపతి.

వాళ్ళు అతడికేసి సానుభూతిగా చూశారు. పసివాడు నెమ్మదిగా కదిలి లోపలికి వెళ్ళిపోయాడు.

అయిదు నిముషాల తరవాత ఒక ట్రేలో కాఫీ గ్లాసులు పెట్టుకుని వచ్చిన యువతి దిశాపతికి దగ్గరకు కూడా వచ్చింది. చేతిరుమాలుతో ముఖాన్ని గట్టిగా తుడుచుకుని, గ్లాసు అందుకుని, కాఫీ చప్పరిస్తూ కూర్చున్నాడతను.

అంతలో క్రతువు జరిపే బ్రాహ్మణులు రావటంతో వాతావరణంలో కదలిక మొదలయింది.

బాచీ వెనకే నిలబడి, ఒక్కోసారి అతడి చెయ్యి పట్టుకుని, అతడి మేనమామ కాబోలు, తంతు నడిపిస్తున్నాడు.

బిక్కమొహం వేసుకుని అన్నీ చేస్తున్నాడు బాచీ, అప్పుడప్పుడు కళ్ళు తుడుచుకుంటూ.

ఒంటిగంట కావస్తుండగా ఆరోజు కార్యక్రమం పూర్తయింది.

“ఇంటిపేరు గలవారు తిలోదకాలు విడవటానికి రండి.” పిల్చాడు పురోహితుడు. అప్పటికే స్నానాలు చేసి వచ్చి సిద్ధంగా ఉన్నవాళ్ళు, అయిదారుగురు ముందుకు వచ్చి, ఆయన చెప్తుంటే తిలోదకాలు వదిలారు.

“బంధువులు, స్నేహితులు ఎవరన్నా ధర్మోదకాలు ఇచ్చేవాళ్ళు ఉంటే, రావచ్చును.” చెప్పాడు పురోహితుడు.

దిశాపతి తన సంచిలో నుంచి పంచె తీసి, కట్టుకున్నాడు. మిగతావారిలాగే, బావి దగ్గర స్నానం చేసి, తడి ధోవతి కట్టుకుని, తడితుండు పైన వేసుకుని బంధువులతో పాటు ధర్మోదకాలు వదలటానికి సిద్ధమై వచ్చాడు.

“ధర్మోదకాలు అనేవి మన సంప్రదాయంలో ఒక ముఖ్యమైన ఆచారం. మరణించిన వారి ఆత్మకు శాంతి కలగడానికి, మరియు వారిని పితృలోకానికి చేర్చడానికి, ధర్మోదకాలు వదులుతారు. తిలోదకాలకి తిలలతో నీళ్ళు వదులుతాం. ధర్మోదకాలు తెల్లటి బియ్యమే అక్షతలుగా నీటితో తర్పణం ఇస్తాం. ఈ ఆచారం పితృదేవతల పట్ల మనకు ఉన్న గౌరవం మరియు కృతజ్ఞతను వ్యక్తం చేయడానికి కూడా ఒక మార్గం. అందుకే, ధర్మోదకాలు ఇవ్వటానికి జన్మ బాంధవ్యమే అక్కరలేదు. స్నేహితులు, సాటి మనుషులు ఎవరైనా ఇవ్వవచ్చు. అలా ఇస్తే, ఒక సత్కార్యం చేసి, మనం పుణ్యం సంపాదించుకోవటమే కాక, తృప్తి చెందిన పితృదేవతలు ఇచ్చే ఆశీర్వాదాలు... మనకి ఎంతో మేలు చేస్తాయని పెద్దలు చెబుతారు.” వివరణ ఇస్తూ, వారి చేత ధర్మోదకాలు ఇప్పించాడు పురోహితుడు.

కార్యక్రమం పూర్తి అయినాక, ఎవరితోనూ మాట్లాడకుండా, విచారమైన ముఖంతో ఒక పక్కగా కూర్చున్నాడు దిశాపతి.

కాసేపటిలో భోజనాలు వడ్డించారు. పంక్తిలో చివరగా కూర్చున్నాడు దిశాపతి. భోజనం చేశాక, లేచి వెళ్ళి పందిట్లో నిలబడ్డాడు. ఒకొక్కరే చేతులు కడుగుకు వచ్చి, కుర్చీలలో కూర్చుంటున్నారు.

బాచికి మేనమమలాగా అనిపించిన వ్యక్తి దగ్గరకు వెళ్ళి చెప్పాడు, “ఇటువంటి సమయంలో ‘వెళ్తున్నాను’ అని చెప్పకూడదు.”

అతడు మౌనంగా తలాడించి, నెమ్మదిగా అడిగాడు,

“ఇంత గుర్తుపెట్టుకుని వచ్చారు. మా అక్కను చూసి వెళ్తారా?”

"వద్దు. ఈ పరిస్థితిలో ఆమెను పలకరించలేను. మళ్ళీ వస్తాను, మా ఆవిడతో!" ఆ మాట అని, రెండడుగులు వేసాక, మళ్ళీ వెనక్కు తిరిగివచ్చి, అన్నాడు, "మా ఆవిడకూ, పిల్లలకూ నా స్నేహితుడి ప్రసాదం పెట్టాలి. పితృశేషం గొప్ప ప్రసాదం. కొద్దిగా పొట్లం కట్టి ఇవ్వటం కుదురుతుందా?"

"అయ్యో, తప్పకుండా." అని, అతడు లోపలికి వెళ్ళాడు. మందంగా ఉన్న ఒక కాగితపు సంచితో తిరిగి వచ్చాడు.

"గారెలు, అరిసెలు కాక, అన్నం, కూరలు కూడా కట్టించాను. తీసుకువెళ్ళండి. భోజనఫలం దక్కుతుంది."

"చాలా మంచిది. మహేశ్వర్ సంతోషిస్తాడు." రెండు చేతులతో దణ్ణం పెట్టి, బరువుగా ఉన్న ఆ సంచిని అందుకుని బయటకు నడిచాడు దిశాపతి.

తిరిగి వెళ్తుంటే, అడుగు చురుగ్గా పడింది. ఇరవై నిమిషాల్లో ఇల్లు చేరుకుని, భార్య చేతికి సంచీ అందించాడు.

"అంతా సవ్యంగానే జరిగిందా?" అడిగిందామె, "మీరు వెళ్ళినప్పటి నుంచీ నాకు భయంగానే ఉంది. మీ ఆరోగ్యమూ అంతంతమాత్రంగానే ఉంది. ఇంకెప్పుడూ ఇటువంటి పనికి వెళ్ళకండీ. పాపం వస్తుందేమో కూడా!"

"లేమిని మించిన పాపం లేదు సరళా!" వణుకుతున్న గొంతుతో అన్నాడు దిశాపతి.

"మీరు అన్నం తినండి. నేను కాసేపు పడుకుంటాను. బాగా అలసటగా ఉంది."

★★★

"ఎవర్రా అతను? నాకేదో అనుమానంగా ఉంది. నిజంగా మీ బావకి స్నేహితుడేనా? స్నేహితుడైతే మన ఎవ్వరికీ అంతమాత్రం తెలియకుండా ఉంటాడా? పైగా, అప్పటికప్పుడు బోర్డు చూసి, విషయం తెలుసుకుని వచ్చానన్నాడే, అలాగైతే, చేతిలో సంచీ, సంచిలో ధోవతీ ఎక్కడ నుంచి వస్తాయి?" సంచి అందించి సాగనంపుతున్న వ్యక్తిని నిలదీసాడు, అతడి పెద్దనాన్న.

"ముందు అనుమానం లేకపోయినా, ఎవరినీ పలకరించకుండా దూరం దూరంగా మెసలుతున్న అతడి వాలకం నాకూ అనుమానమే కలిగించింది. అయితే, నేను ఒకటే అనుకున్నాను. ఎవడో కటిక పేదవాడు. భోజనానికి కక్కుర్తి పడ్డాడు. స్నేహితుడిని అంటూ వచ్చి, ధర్మోదకాలు వదిలాడు. ఏనాటి ఋణానుబంధమో, ఒకపూట భోజనం కోసం, పైకి పోయిన మనిషితో క్రిందనుండే స్నేహం కలుపుకున్నాడు. అతడిని నిలదీసి అవమానిస్తే, మనకు మిగిలేదేమీ లేదు. నమ్మినట్టు వదిలేస్తే ఒక పేదకుటుంబానికి అన్నం పెట్టామని బావగారి ఆత్మకి శాంతి కలుగుతుంది!' అనిపించి, అడిగినదాని కన్నా ఎక్కువగానే కట్టి ఇచ్చి, సాగనంపాను." చెప్పాడతడు విచారంగా నవ్వుతూ.




# నిరసన

**తులసి బాలకృష్ణ**
✆ 8790115544

***'మేడమ్! దేశానికి మిలటరీ, సమాజానికి పోలీస్ ఎలాగో, సినిమాలకి సెన్సారింగ్ అలాంటిది. అది ఓ రక్షణ కవచం. అంతటి శక్తివంతమైంది కూడా! సమాజానికి సినిమాల ద్వారా చేతనైతే మంచిని చెప్పాలి... కాకుంటే వినోదాన్ని పంచాలి... అంతేగాని చెడుని నూరిపోసే అధికారం ఏమాత్రం లేదని నిష్కర్షగా చెప్పి, నిర్దాక్షిణ్యంగా ఖండించవలసిన శక్తి గల వ్యవస్థ సెన్సార్ డిపార్ట్‌మెంట్‌ది. ఆ ధైర్యం లేని వ్యక్తులు అందులో ఉండడానికి అనర్హులు.***

భర్త రాజారావు ప్రవర్తన నిన్నటి నుంచీ చాలా వింతగా అనిపిస్తోంది ప్రవల్లికకి. ఎదురు పడితే మొహం తిప్పుకుని వెళ్ళిపోతున్నాడు. పలకరిస్తే జవాబు ఇవ్వడం లేదు.

"ఏమిటండీ! ఎందుకీ మౌనం?" — నో రెస్పాన్స్!


"మీరిలా ఉంటే పిల్లలు కూడా నిన్నట్నుంచీ ఉదాసీనంగా ఉండి, నా దగ్గరకి చనువుగా రావడం లేదు. ప్లీజ్... కారణం చెప్పండీ" — నో రెస్పాన్స్!

'డాడీ అలా ఎందుకు ఉన్నారూ?' అని పిల్లల్ని అడిగితే, పసివాళ్లు... వాళ్ళూ తెల్ల మొహాలేసుకుని చూస్తున్నారు గాని, ఏమీ చెప్పలేక పోతున్నారు.

ఎప్పుడూ తనతోనో, పిల్లలతోనే గలగలా మాటాడుతూ సందడిగా గడిపే మనిషి, ఇలా మౌనంగా ఉండడం... ఇంటిలో ఎన్నడూ ఎరుగని నిశ్శబ్దం తాండవిస్తూండడం... భరించలేక ఏడుపొచ్చినంత పనవుతోంది ప్రవల్లికకి! 'తన భర్త రాజారావేనా ఇలా ప్రవర్తిస్తున్నదీ?'

సెల్‌ఫోన్ పదే పదే మ్రోగుతూన్నా తీయబుద్ధి కావడం లేదు. తనకు తెలుసు... తనని అభినందించడానికి మిత్రులు, అభిమానులూ చేస్తూన్న కాల్స్ అవి! కొందరు భవిష్యత్తులో లాభం పొందడానికి ఇప్పుడు అభినందనలతో ముంచెత్తుతూ, స్తోత్ర పాఠాలు వల్లించడానికీ చేస్తూన్న కాల్స్ అవి! ఇంట్లో పరిస్థితి ఇలా ఉంటే, తను బయట వాళ్లతో ఎలా ఆనందాన్ని పంచుకోగలదు?

నెల్లాళ్ళ క్రితం తనకు రవీంద్రభారతిలో జరిగిన సన్మానం తాలూకు దృశ్యాలన్నీ గుర్తుకు వస్తూన్నాయి. ఆ సభలో రాజారావు ఎంత ఆనందంగా హుషారుగా ప్రవర్తించాడు! 'నా భార్య అని చెప్పడం కాదుగానీ... ఇప్పుడు లభించిన ఈ విలువయిన



కొత్త బాధ్యతకి ఆమె నూటికి నూరు పాళ్ళూ అర్హురాలని గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పగలను' అని అన్నాడు కూడా కదా... తన ఉపన్యాసంలో!

తను నవలలు రాసి పేరు తెచ్చుకుంటూంటే, ఎంతో ప్రోత్సహిస్తూ వచ్చాడు ఇన్నాళ్ళూ! సభలకు వివిధ అంశాల మీద ఉపన్యసించడానికి తనకి ఆహ్వానాలు వస్తే... తనకు తెలియని ఎన్ని పాయింట్లని చెప్పి, సిద్ధం చేసి పంపించేవాడు. ఈ కొత్త బాధ్యత కూడా తనని వరించి వచ్చిందని తెలియగానే ఎంతో ఆనందించాడు! మరిదేవిటీ... తన బాధ్యత నిర్వహణ ప్రారంభదశలోనే ఇలా మౌనంగా... కారణం చెప్పకుండా... తను బాధతో గిలగిలలాడేలాగా... మై గాడ్... ఇట్స్ అన్బేరబుల్ రియల్లీ!

## నిరసన

ఇంక ఆగలేక పోయింది ప్రవల్లిక. పిల్లలు స్కూలుకి వెళ్లిపోయాక, డ్రాయింగ్‌రూములో ఉన్న భర్త దగ్గరకు విసవిసా వెళ్ళింది. తను వస్తూన్న అలికిడి అయినా, అతగాడు తన వైపు ఒక చూపయినా చూడకుండా, మౌనంగా పేపర్ వైపు చూస్తూన్నాడు.

అతని ఎదురుగా మోకాళ్ళ మీద కూలబడి, "చెప్పండి. ఎందుకు మీరు ఇలా నాతో మాటాడకుండా ఇంతటి భయంకర నిశ్శబ్దాన్ని పాటిస్తూన్నారు? కారణం చెప్పకుండా ఇలా ఇబ్బంది పెట్టడానికి మించిన దారుణమైన ప్రవర్తనకి మించినది మరోటి ఉండదు. చెప్పండీ..." అంది పేపర్ లాగి పారేస్తూ పెద్ద గొంతుతో. ఆమె గొంతులో ఉక్రోషం, అసహనం కూడా ధ్వనించాయి.

జవాబు చెప్పలేదు రాజారావు. మౌనంగానే లేచి వెళ్ళిపోబోయాడు.

అతని జబ్బలు పట్టుకుని ఆపేసిన ప్రవల్లిక... అదుపు తప్పిన ఆవేశంలో, "నాకర్థమయ్యింది. నన్ను వరించి వచ్చిన ఈ కొత్తస్థానం అందరి ప్రశంసలనూ అందుకుంటూంటే మీకు అసూయగా ఉంది కదూ... పైకి అందరి వద్దా ఆనందంగా ఉందంటూ నటించారు కదూ?" అనేసింది.

అంతే! లేచి వెళ్లిపోబోయిన వాడల్లా అశక్తుడిలా కూలబడిపోయి, తన కళ్ళలోకి తీవ్రంగా అతను చూసిన చూపుకి ఒక్కసారిగా చంచలించి పోయి, ఆవేశంలో తను అలా నోరు జారినందుకు అపరాధభావంతో కుంచించుకు పోయింది ప్రవల్లిక.

ప్రయత్న పూర్వకంగా లేచి మౌనంగానే లోపలి గదుల్లోకి వెళ్ళిపోయాడు రాజారావు.

భారంగా గడిచింది రోజంతా.

మర్నాడు... స్పీడ్ పోస్ట్‌లో వచ్చిన కవర్ అందుకుని, ఫ్రమ్ అడ్రస్ చూసి, ఉలిక్కి పడింది ప్రవల్లిక. తన ఇంటి అడ్రెస్సే! తన భర్త నుంచే! అసలే రెండు రోజులుగా భయంకర మౌనం పాటిస్తూన్నాడు. ఇప్పుడు... తన ఇంటిలోనే ఉన్న మనిషికే పోస్ట్‌లో... ఈ కవరు?!

దడదడలాడే గుండెలతో కవరు చించి, చదవసాగింది.

'మేడం ప్రవల్లిక గారూ! ఫస్ట్ ఆఫ్ ఆల్ మిమ్మల్ని వరించి వచ్చిన కొత్త బాధ్యతలకు మీకు హార్టీ కంగ్రాట్యులేషన్స్. ఎంతోమంది పాఠకుల హృదయాలను రంజింపజేసి, సత్ప్రవర్తనా సూత్రాలని ఓ ప్రవచనంలా కాకుండా కథలోని పాత్రలకు సంబంధించిన సంఘటనల ద్వారానే మెదడులో నాటుకునేలా చెప్పగల రచనాశక్తి గల మీకు, ఈ కొత్త అసైన్మెంట్ నూటికి నూరు పాళ్ళూ తగినది. ఈ వార్త వినగానే ఎంతో ఆనందించిన మీ అభిమానుల్లో నేనూ ఒకడిని.

ఆరోజు రవీంద్రభారతిలో మీకు జరిగిన సత్కారంలో స్పందిస్తూ పెద్దలన్నట్లు, 'ఇది ఒక పవిత్రమైన బాధ్యత'... అక్షరాలా నిజం అది! ఎందరో మీకు లభించిన అవకాశం కోసం సంపాదించడానికి అనేక విధాలుగా తంటాలు పడతారని నాకు తెలుసు. అయితే మీకు సమాజానికి మంచి చేసే ఆ అవకాశం తనంత తానుగా వరించి వచ్చింది. ఇతర సామాన్యులలాగా

మీరు కూడా ఈ అవకాశాన్ని ఓ 'భుజకీర్తి'గా భావించి గర్వపడి ఆనందించరని, నూటికి నూరు పాళ్ళూ నమ్మినవాళ్ళలో నేను ప్రథముడిని!

కాని, సారీ టు సే... చాలా పొరబడ్డాను. చాలా అంటే చాలా! భరించలేనంతగా నా నమ్మకం నన్ను దెబ్బతీసింది. ఒక బాధ్యత గల స్త్రీ... అందులోనూ ఇద్దరు బిడ్డల తల్లయిన ఓ సంప్రదాయపు కుటుంబానికి చెందిన ఇల్లాలు... మరీ ముఖ్యంగా పది మందినీ ప్రభావితం చేయగల సత్తా ఉన్న రచయిత్రి అయివుండీ కూడా, ఇతరుల కంటే ఏమాత్రం భిన్నంగా ప్రవర్తించక పోవడాన్ని తీవ్రంగా గర్హిస్తున్నాను నేను!'

ప్రవల్లిక చేతులు వణికాయి. ఉత్తరం మీద నుంచి దృష్టిని ఓ క్షణం ప్రక్కకు తిప్పి, గట్టిగా నిశ్వసించి, తిరిగి గుండెల నిండా గాలి పీల్చుకుని, మళ్ళీ చదవసాగింది.

'యస్. సినిమాలకు సెన్సార్ మెంబర్‌గా ఉండడమనేది ఓ పవిత్ర 'బాధ్యత'. భుజకీర్తి ఏమాత్రం కాదు! అనేక మంది యువతీ యువకులు సినిమాలలోని డైలాగుల వలన, పాటల వలన, నృత్యాల వలన, సంఘటనల వలన ప్రభావితులవుతారు అని మానసిక నిపుణులు, సమాజహితం కోరే పెద్దలు పదేపదే చెప్తూతున్న మాటల్లో ఏమాత్రం అవాస్తవంలేదు. ఓ మంచిని గాని, సత్సంప్రదాయాన్ని గాని, చెడుని గాని చెప్పడానికి అనేక సంవత్సరాలుగా సినిమా అనేది ఓ అత్యంత శక్తి వంతమైన ప్రచార సాధనం.'

ఉత్తరాన్ని క్రిందకు దించి, ఊపిరి అందాక మళ్ళీ చదవసాగింది.

'తన సినిమా మొదటిరోజునే కుటుంబ సమేతంగా చూడమని కోరుతూ ఆ నిర్మాత మీకు కాంప్లిమెంటరీ పాసెస్ పంపిస్తే, 'వేరే పనులతో బిజీగా ఉన్నానం'టూ మీరు తిరస్కరించి బయటకు వెళ్ళిపోయాక, 'కనీసం మీరయినా మీ పిల్లలతో చూడండి సార్' అంటూ అతగాడు నాకు ఫోనులో బ్రతిమిలాడుతూ చెప్పితే... మీరు ఓ సభ్యురాలిగా సెన్సార్ చేసిన ఆ సినిమాని... మీకు తెలియకుండానే పిల్లలతో సహా చూసి వచ్చి, మిమ్మల్ని అభినందనలతో ముంచెత్తుదామని వెళ్లాను. కాని... రెండున్నర గంటల సినిమాలో మొదటి అర్ధగంట చూసేసరికే తల తిరిగిపోయింది. ఆ సినిమా అసలు సెన్సార్ చేయబడినదేనా అనిపించింది. బూతు డైలాగులు, బూతు పాటలు. రక్తాలు చిందిస్తూ చితక కొట్టేసుకోవడాలూ... ఒకటా... మనసు వికారంతో చికాకుకు గురి కావడానికీ, మెదడు మొద్దు బారిపోవడానికీ ఇంకేం కావాలి? హాలులోని కుర్రకారు ఆ బూతు మాటలకి, డాన్సులకీ రెచ్చిపోయి, లేచి బూతు ఊపులతో డాన్సులు చేస్తూంటే... పిల్లలిద్దరూ ఆ డైలాగులకి అర్థమేవిటి అని అమాయకంగా అడుగుతూంటే, ప్రాణం పోయినంత పనై, వెంటనే లేచి, పిల్లలతో సహా ఇంటికి వచ్చేసాను. ఇటువంటి దారుణ ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందనే కదా నేనెన్నడూ పిల్లలకు ఇప్పుడొస్తూన్న సినిమాలు చూపించక పోయినదీ! కానీ ఇప్పుడు ఏమాత్రం ఊహించని పరిస్థితిని ఎదుర్కొన్నాను.'

చదవడం ఆపి, రెండు చేతులతో తల పట్టుకుంది ప్రవల్లిక. ఓ రెండు నిముషాలు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరిగా అనిపిస్తూన్న బాధని అనుభవించి, తిరిగి చదవడం ప్రారంభించింది.

'మేడమ్! దేశానికి మిలటరీ, సమాజానికి పోలీస్ ఎలాగో, సినిమాలకి సెన్సారింగ్ అలాంటిది. అది ఓ రక్షణ కవచం. అంతటి శక్తివంతమైంది కూడా! సమాజానికి సినిమాల ద్వారా చేతనయితే మంచిని చెప్పాలీ... కాకుంటే వినోదాన్ని

పంచాలి... అంతేగాని చెదుని నూరిపోసే అధికారం ఏమాత్రం లేదని నిష్కర్షగా చెప్పి, నిర్దాక్షిణ్యంగా ఖండించవలసిన శక్తి గల వ్యవస్థ సెన్సార్ డిపార్ట్ మెంట్ ది. ఆ ధైర్యం లేని వ్యక్తులు అందులో ఉండడానికి అనర్హులు. ఏ కారణంగానైనా అలా ఖచ్చితంగా ప్రవర్తించే వీలు అక్కడ లేకపోతే 'గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ' అన్నట్లుగా నిరసనగా బయటకు వచ్చేయడం కనీసధర్మం! ఆలోచించుకోండి. ఒక్క వారం రోజులు సమయం! ఈ వారం లోపల మీరు మీ సెన్సార్ మెంబర్షిప్‌కి రాజీనామా ఇవ్వకపోతే, విడాకులకు సిద్ధంగా ఉండవలసి రావచ్చు – ఇట్లు, మీ అభిమాని... మనసా నిరసనతో... రాజారావు.'

వెన్నులో విద్యుత్తు పాకినట్లయి, తల దిమ్మెక్కిపోయింది ప్రవల్లికకి.

చలనం లేకుండా ఓ అయిదు నిముషాలు అలా కూర్చునేసరికి, క్రమేపీ మనసుకి స్థిమితం చిక్కి, కళ్ళ ముందు ఇన్నాళ్ళూ తను ఎంతో గౌరవాభిమానాలతో ప్రేమించిన భర్త, అల్లారుముద్దుగా పెంచుకుంటూన్న బిడ్డలూ కనిపించి, జ్ఞానోదయమై, మాయగా కమ్మిన మైకం దిగి, కళ్ళవెంట నీళ్ళు కారసాగాయి. 'ఇటువంటి సినిమాలు ఓ పది చూస్తే తన పిల్లలవంటి పసివాళ్ళు భవిష్యత్తులో నిష్ప్రయోజకులుగా మారే ప్రమాదం చాలా ఉంది. నిజమే. తనకి దక్కిన అవకాశాన్ని తను ఓ గురుతర బాధ్యతగా కాకుండా భుజకీర్తిగా భావించబట్టే, ఇతర మెంబర్లలాగే తను కూడా అశ్రద్ధని చూపించింది. అక్కడి సీనియర్ మెంబర్లు 'మనం చూసీ చూడనట్లు పోవాలంతే' అన్న సూచనలకి బాధ్యతని విస్మరించి తల ఒగ్గింది. కాని, అనేకమంది యువతీయువకుల భవిష్యత్తుని చెడగొట్టే ఓ దుర్మార్గపు ప్రయత్నానికి కనీసం నిరసన కూడా తెలియజేయలేక పోయింది. తనని ఎంతో ప్రేమించే భర్త తన ప్రవర్తనకి నిరసనగా మాట్లాడడం లేదూ... మారకపోతే చివరకు తనని వదులుకోవడానికైనా సిద్ధమని తెలియజేస్తూన్నాడే... అలాంటిది బాధ్యతని విస్మరించవలసి వస్తూన్నందుకు నిరసనగా... తను తనకి లభించిన ఓ నిష్ప్రయోజనకరమైన అవకాశాన్ని వదులుకోలేదూ?!' కళ్ళు తుడుచుకు లేచింది ప్రవల్లిక. కంప్యూటర్ ముందు కూర్చుంది.

బాధ్యతా రహితంగా జరుగుతూన్న కార్యాలకు అంగీకారాన్ని తెలిపే పని తన వల్ల కాదని నిరసనని తెలియజేస్తూ టైపు చేసి, సెన్సార్ బోర్డ్ పెద్దలకు పంపించిన తన రాజీనామా తాలూకు కాపీని... బయటకు వెళ్ళిన భర్త ఇంటికి చేరే సమయానికి అతనికి ఎదురేగి ఆనందంగా చూపించడానికి... గుమ్మం వద్దే సిద్ధంగా ఉంది ప్రవల్లిక.

ఆమె మనసు ఇప్పుడు చాలా ప్రశాంతంగా ఉంది. ఆకాశం వైపు చూస్తూ డ్రైనేజ్ పిట్‌లో అడుగు వేయబోతూ, నిభాయించుకుని బ్రతికి బట్ట కట్టినంత ఆనందంగా ఉంది.

కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
శ్రీ విశ్వావసు నామ వత్సర సంక్రాంతి - 2026

# నెలగంట నవ్వింది

**వేలూరి ప్రమీలా శర్మ**

✆ 9492535415

***మెడలో పూలదండలతో నిండుగా ఉన్న ఆ పడుచుజంటను చూసి అక్కడున్న ప్రతీ ఒక్కరూ ముచ్చటపడ్డారు. అందమైన పాలరాతి బొమ్మలా ఉన్న మలేషియా నవవధువు జహ్రా, బంతిపూల రంగు అద్దాలచీరలో, పూర్తి సాంప్రదాయ వస్త్రధారణలో పట్టుచీరలపై నడిచి వస్తుంటే తృప్తిగా తలాడించింది గాయత్రి. తల్లి చెప్పినట్టుగానే... మన దేశ సాంప్రదాయాన్ని గౌరవిస్తూ కొడుకు చెయ్యి పట్టుకుని వచ్చిన కొత్తకోడలిని మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు రామరాజు.***

సూర్యోదయం వేళ పక్షుల కిలకిలా రావాలతో ఊరు మేల్కొంటోంది. హేమంత ఋతు ఉషోదయ కాంతిలో మంచుతడి ఆరని మట్టిరోడ్డుపై పంచకళ్యాణిలా పరిగెడుతోంది... నల్లని పొడవాటి కుచ్చుతోకను హుషారుగా కదుపుతూ, బలిష్ఠంగా ఉన్న మోతి, బగ్గిలో లేత గులాబీరంగు అద్దాల పరదాలో సిగ్గుదొంతరల నడుమ ఒదిగి కూర్చున్న గాయత్రి భుజం చుట్టూ చెయ్యివేసి, దగ్గరగా జరిగి కూర్చున్నాడు ఆమె భర్త. ఆ స్పర్శకు వేడెక్కిన ఆమె ఊపిరి ఆవిరి మేఘమై, పలచబడుతున్న మంచుతెరల మధ్య గాలిలో తేలియాడింది. ఆమె చెక్కిళ్ళలోని ఎరుపుదనపు మెరుపుకు మంకెనపూలు చాటుగా నవ్వుకున్నాయి.

విష్ణుమూర్తిని కీర్తిస్తూ ఇంటి ముంగిళ్ళలో నెలగంట ముగ్గులు పెడుతున్న పల్లెపడుచులు... జమీందారుగారి కొత్తకోడలు ఎలా ఉంటుందోనన్న ఆత్రుతతో పరదాల వెనకున్న పెళ్ళికూతురి వైపు వంగివంగి చూస్తున్నారు. మార్గశిరమాసంలో అత్తవారింట అడుగు పెట్టించి, పుష్యంలో పెద్దపండుగకు వియ్యాలవారిని తమ ఇంటికి రమ్మని పిలవడానికి సారె చలిమిళ్ళతో కూతురు వెనకే తాము కూడా ఆ ఊరికి చేరారు నరసింహరాజు దంపతులు.

మావిడాకు తోరణాలతో కళకళలాడుతున్న కేతకీమహల్ సింహద్వారం పైభాగంలో అమర్చబడిన అర్ధచంద్రాకారపు గుర్రపునాడాకు పసుపు పూసి, కుంకుమబొట్లు ఉంచడాన్ని ఆసక్తిగా గమనించింది గాయత్రి. పౌర్ణమి రోజున శుభలక్ష్మిలా ఆ ఇంట అడుగుపెట్టిన నవవధువు గాయత్రికి, ఊరి వాతావరణం చాలా కొత్తగా అనిపించింది. కొద్ది రోజులలోనే ఆత్మీయ పలకరింపులతో ఆమె కూడా ఆ ఊరి జమీందారుగారి కోడలుగా అందరి మన్ననలూ పొందింది.

అత్తవారింట అడుగు పెట్టేనాటికి ఆమె వయసు పద్దెనిమిది సంవత్సరాలు! ఎక్కడో చిన్న కుగ్రామంలో పుట్టి పెరిగిన, దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన గాయత్రిని, ఏరి కోరి పెళ్ళి చేసుకున్నాడు జమీందారుగారి వారసుడు. ఐశ్వర్యంతో

పాటు రాజభోగాలూ ఆమె హుందాతనాన్ని మరింత పెంచాయి. వెన్నెల కాంతితో పోటీపడే శరీరవర్ణంతో, ఆరు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా అదే హుందాతనంతో ఆ మహల్ లోనే ఆనందంగా తన శేషజీవితాన్ని గడుపుతోంది గాయత్రి.

కాలక్రమంలో ఎన్నో మార్పులు... తరం మారింది. గుర్రపు బగ్గీల స్థానంలో మోటారు కార్లు అందుబాటులోకి వచ్చాయి. గాయత్రి ఏకైక సంతానం రామరాజు! తన తండ్రి మాదిరిగానే వంశ ప్రతిష్ట నిలబెడుతూ, దాన ధర్మాలతో ఊరివారికి అండగా నిలుస్తూ వచ్చాడు. ఊరిబిడ్డలు కొందరు పై చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్ళడం, కొలువుల్లో కుదురుకుని క్రమక్రమంగా పల్లె వైపు రావడం తగ్గించేసారు. కానీ అక్కడి ప్రకృతిని ఆరాధించే వెనకతరం వారు మాత్రం ఊరిలోనే సొంతంగా పంటలు పండిస్తూ నేలతల్లిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.




జమీందారు వంశంలోని మూడవతరం వారసుడు కృష్ణమరాజు! పై చదువుల కోసం విదేశాలకు వెళతానని పట్టుబట్టినప్పుడు, మొదట్లో గాయత్రి కొంచెం కలవరపడింది. కానీ స్థిమితంగా కూచుని ఆలోచించాక... అందుకు అంగీకరించింది. రామరాజుకి కూడా నచ్చజెప్పి ఒప్పించింది.

రెండేళ్ళు గడిచేసరికి కృష్ణమరాజు పెద్ద కంపెనీలో ఉద్యోగం సంపాదించగలిగాడు. చదువుకి తగ్గ ఉద్యోగం దొరికినందుకు అందరూ సంతోషించారు. ఉద్యోగంలో చేరే ముందు స్వదేశానికి వచ్చి నెల రోజులుండి కుటుంబ సభ్యులందరితో సంతోషంగా గడిపాడు కృష్ణమరాజు. ఆ నెలరోజులూ గాయత్రి తన మనుమడికి ఇష్టమైనవన్నీ వండించి పెట్టింది. తిరిగి వెళుతుంటే బెంగతో ఆమె కన్నీళ్ళు పెట్టుకుంటుంటే... "నేను ఎంత దూరాన ఉన్నా, మన కుటుంబాన్ని మర్చిపోను. రెండు మూడేళ్ళ తర్వాత మన దేశానికి తిరిగి వచ్చేస్తాను. బెంగపడకు నానమ్మా!" అంటూ ఆమెను గట్టిగా హత్తుకుని చేత్తో కళ్ళు తుడిచాడు.

ఏడాది గడిచేసరికి పదోన్నతి పొందినట్టు సంతోషకరమైన వార్త చెప్పాడు కృష్ణమరాజు. మరో రెండేళ్ళు గడిచేసరికి ఇంకా ఉన్నత స్థానంలోకి ఎదిగాడు.

"అమ్మా! నీ మనుమడు దూరదేశాల్లో చదువు కోసం వెళతానన్నప్పుడు నేను వద్దన్నా, వినకుండా 'బిడ్డల నిర్ణయాన్ని మనం గౌరవించాలి' అంటూ వాడిని వెళ్ళనిచ్చావు. ఇప్పుడు చూడు... అక్కడే స్థిరపడతానంటున్నాడు" అని తన కొడుకు రామరాజు బాధపడుతున్నప్పుడు, సమాధానం ఏం చెప్పాలో తెలియక కాసేపు మౌనం వహించింది గాయత్రి.

"మన చుట్టూ మన అనుకున్న ఊరివాళ్ళు ఇంతమంది ఉన్నప్పుడు భయం దేనికి? ఉండనివ్వు. అక్కడే శాశ్వతంగా ఉండిపోడు కదా! నాలుగేళ్ళు గడిస్తే ఉన్న ఊరి మీదా, కన్నవారి మమకారాల మీదా మనసు మళ్ళక పోదు. చదివిన చదువుకి తగ్గ ఉద్యోగం దొరికిందని, వాడు ఆనందపడుతుంటే మనమెందుకు అడ్డు చెప్పడం? ఎదిగే మొక్కకి చుట్టూ రక్షణ కంచె వేయడం అవసరమే కానీ, ఎదుగుదల ఆగిపోయేలా దానిని కత్తిరించడం సబబు కాదు. అంతా భగవంతుడి నిర్ణయం మేరకే జరుగుతుంది. మనం నిమిత్తమాత్రులం!" అంటూ కొడుకుని ఊరడించింది.

రెండేళ్ళు తిరిగేసరికి, హఠాత్తుగా ఆ ఇంటికోడలు మరణించడంతో ఒక్కసారిగా వారి జీవితాల్లో చీకట్లు అలముకున్నట్టయింది. 'మనుషులు కరువైన కేతకీమహల్లో కేవలం తన కొడుకూ, తాను మాత్రమే ఉండడమా?' అనుకున్నప్పుడు గాయత్రి మనసు చిన్నబోయింది. అయినా గతించిన వారి జ్ఞాపకాలతో, ఆ భవంతి పూర్వ వైభవాన్ని కోల్పోకుండా, అలాగే నిలిచి ఉంది. జమీందారు వంశంలోని వారిలో గోడపై చిత్తరువులుగా మారినవారితో పాటు, నెలవంక ఆకారంలోని గాయత్రి కాలినాడా కూడా మెరుపు కోల్పోకుండా, ఇంకా ఆ సింహద్వారం పైభాగంలో అలాగే అలంకారంగా వేలాడుతోంది.

'తమ వంశాన్ని నిలబెట్టే వారసుణ్ణిచ్చే మరో శుభలక్ష్మి మెట్టెల సవ్వడి కేతకీమహల్‌లో ఎప్పుడు వినిపిస్తుందా' అని ఆశగా ఎదురు చూస్తోంది గాయత్రి.

★★★

భోజనం చెయ్యడానికి రామరాజుని కూడా కిందకి రమ్మని పిలిచి, వేడివేడిగా పదార్థాలు వడ్డిస్తున్న కుక్‌ని ఒక్కనిముషం ఆగమని సైగ చేసింది గాయత్రి. మేడమీద గదిలో ఎవరితోనో ఫోన్ మాట్లాడుతున్న రామరాజు... అస్థిమితంగా అటూ ఇటూ తిరుగుతున్న అడుగుల చప్పుడు కిందికి వినిపిస్తోంది. తన భర్త, మామగార్ల ఫోటోల ముందు నుంచుని, కళ్ళు మూసుకొని 'ఈ ఇంట్లో ఏ సమస్యా రాకుండా చూడమని' దణ్ణం పెట్టుకుంది. అలా వారిని తలచుకున్నప్పుడు ఆమెకి ధైర్యంగా అనిపిస్తుంది. మరో అయిదు నిముషాల్లో రామరాజు కిందికి వచ్చాడు.

"ఏమైంది రామా! అటువైపు ఎవరు? ఏదో అసహనంగా ఉన్నట్టు కనిపిస్తున్నావు. ఏమైంది?" వెండిగ్లాసులో చల్లని నీళ్ళు పోసి చేతికి అందిస్తూ అడిగింది గాయత్రి.

"చూసావా అమ్మా! నీ మనుమడు ఎంత ఎదిగిపోయాడో! మనల్ని విడిచి దూరంగా వెళ్ళినాడే, వాడు మనకు దూరమైపోయాడు. ఇప్పుడు పెళ్ళివిషయంలో కూడా మనల్ని సంప్రదించాల్సిన అవసరం లేకుండానే నిర్ణయం తీసుకున్నాడు. తనతో కలిసి పనిచేస్తున్న మలేషియా పిల్లని పెళ్ళి చేసుకుంటానంటూ పిడుగులాంటి వార్త చెప్పాడు. ఇది వినడానికా ఇన్నాళ్లూ మనం ఎదురుచూసింది? ఎక్కడో పుట్టి పెరిగిన పిల్ల... మన కట్టుబాట్లలో ఇమడగలదా? కుటుంబం అంటే వాళ్ళిద్దరే కాదు కదా! ముందూ, వెనుక తరాల గురించి కూడా ఆలోచించాలి కదా! మన కృష్ణమరాజు ఇలాంటి నిర్ణయం తీసుకుంటాడని నేను ఏనాడు ఊహించలేదు!" తన కొడుకు నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా సమర్థించలేక, మనసులోని బాధను వెళ్ళగక్కుతున్న రామరాజు మాటలకు కాస్సేపు మౌనం వహించింది గాయత్రి.

"మీ తాతగారు నరసింహరాజు గారు ఎప్పుడూ అంటూ ఉండేవారు, 'పరిస్థితులకు అనుగుణంగా మనం మారాలి తప్ప, మనకు అనుకూలంగా పరిస్థితులను మార్చాలని అనుకోకూడదు' అని! సాధారణ కుటుంబంలో పుట్టిన నేను, జమీందారుల వంశంలో అడుగుపెట్టినప్పుడు, అలవాటులేని కట్టుబాట్లూ, ఆచారవ్యవహారాలకు తలవంచి ధైర్యంగా నిలబడ్డాను. పెద్దగా చదువుకోని నేను, ఇక్కడి పరిస్థితులను వెంటనే అర్థం చేసుకోగలిగాను. పెద్దతరం వారి ఆశీస్సులతో, జీవితం సుఖంగా గడపలేదా? ఈతరం పిల్లలు బాగా చదువుకున్నవారు. ఎక్కడ ఎలా సర్దుకుపోవాలో వాళ్ళకీ అవగాహన ఉండే ఉంటుంది. లేకపోతే ఇంత ధైర్యంగా ఇలాంటి నిర్ణయం తీసుకోరు కదా! మనం కాదన్నా కృష్ణమరాజు ఆ పిల్లనే పెళ్ళి చేసుకుంటే చూస్తూ ఊరుకోవడం తప్ప ఏమీ చెయ్యలేం!" తన భర్త తనకు చెయ్యి అందించి, ఈ కుటుంబంలోకి ఆహ్వానించిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ చెప్పింది గాయత్రి.

"అలాగని మన ఆచారవ్యవహారాలూ, కట్టుబాట్లని గాలికి వదిలేస్తుంటే, కాదని వారించకుండా ఎలా ఉండగలం? ఊర్లో నలుగురూ మనగురించి మాట్లాడుకుంటుంటే, మన వంశప్రతిష్ట ఏం కావాలి? స్వాగతించలేని ఇలాంటి నిర్ణయాలను ఎలా సమర్థించగలం?" భోజనం పూర్తిచేసి, పడక్కుర్చీలో వెనక్కు వాలి కూర్చున్న తల్లికి, దగ్గరగా కుర్చీని జరుపుకుంటూ భారమైన మనసుతో గట్టిగా నిట్టూర్చాడు రామరాజు.

"చూడు రామా! ఈ ఊరిలో ఇంతకు ముందు మట్టిరోడ్లు మాత్రమే ఉండేవి. ఇప్పుడవి తారురోడ్లుగా మారాయి. ఒకప్పుడున్న మండువా లోగిళ్ళ స్థానంలో పెద్దపెద్ద మేడలు వెలిసాయి. సైకిలు తప్ప ఇతర వాహనం ఎరగని వారు కూడా నేడు విమానాల్లో ప్రయాణించగలుగుతున్నారు. ఇదంతా బిడ్డలు ఎదిగాక సంతరించుకున్న మార్పు కాదంటావా? ప్రపంచం వేగంగా మారుతున్నప్పుడు మనం కూడా మార్పుని అంగీకరించాలి. ఆ అమ్మాయి మన దేశస్థురాలు కాదనేగా మన అభ్యంతరం. ఏమో మన సంస్కృతి పట్ల ఆకర్షితురాలై, మన కృష్ణమరాజుని పెళ్ళి చేసుకోవాలనుకుంటోందేమో... మన సాంప్రదాయాన్ని గౌరవించేవారిని మనం అంగీకరించగలగాలి. చూద్దాం. ఈ మార్గశిరంలో ఆమెని కొత్తకోడలిగా ఈ కేతకీమహల్‌లో అడుగు పెట్టిస్తానంటున్నాడుగా... వచ్చాక మన పద్ధతుల గురించి విడమర్చి చెప్పి చూద్దాం!" అంటున్న తల్లి మాటలకి కొంత ఊరట చెందాడు రామరాజు.

★★★

ఉదయాన్నే తలారా స్నానం చేసి, కాస్సేపు దేవుడిమందిరంలో ధ్యానంలో కూర్చుంది గాయత్రి. తన కొడుక్కి నచ్చచెప్పిందే కానీ, కొత్తకోడలిని కంటితో చూసే దాకా... మన సాంప్రదాయాలను గౌరవిస్తుందో లేదోనని మనసులో కొద్దిపాటి ఆందోళనతో ఎదురు చూస్తోంది. పచ్చని తోరణాలూ, పూలదండలతో కేతకీమహల్ అందంగా అలంకరించబడింది. కొబ్బరాకు పందిళ్ళ కింద ఎఱ్ఱని తివాచీలు పరచబడ్డాయి. వాటిపై ఏడు పట్టుచీరలు పరిచి, పరిమళ ద్రవ్యాలతో, పసుపు అక్షతలతో ఘనమైన ఏర్పాట్లతో ఎదురుచూస్తున్నారు గాయత్రీ, ఆమె ఏకైక సంతానమైన రామరాజు.

మహల్ ముందుకి వచ్చి ఆగిన తెల్లని పొడవాటి కారులోంచి ముందుగా కృష్ణమరాజు కిందకి దిగాడు. ఆ వెనుకనే భర్త చెయ్యి పట్టుకుని నవవధువు జహ్రా కూడా ఆ ఊరి నేలపై అడుగుపెట్టింది. మెడలో పూలదండలతో నిండుగా ఉన్న ఆ పడుచుజంటను చూసి అక్కడున్న ప్రతీ ఒక్కరూ ముచ్చటపడ్డారు. అందమైన పాలరాతి బొమ్మలా ఉన్న మలేషియా నవవధువు జహ్రా, బంతిపూల రంగు అద్దాల చీరలో, పూర్తి సాంప్రదాయ వస్త్రధారణలో పట్టుచీరలపై నడిచి వస్తుంటే తృప్తిగా తలాడించింది గాయత్రి. తల్లి చెప్పినట్టుగానే... మన దేశ సాంప్రదాయాన్ని గౌరవిస్తూ కొడుకు చెయ్యి పట్టుకుని వచ్చిన కొత్తకోడలిని మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు రామరాజు.

మహల్ మొదటి అంతస్తులోని పడకగదిలో నవవధువుకు తమ జమీందారీ వంశస్థుల ఫోటోలను చూపిస్తున్నాడు కృష్ణమరాజు. తాతగారి చెయ్యి పట్టుకుని గుఱ్ఱపుబగ్గీ నుంచి దిగుతున్న నానమ్మ ఫోటోను చూపించినప్పుడు, నవవధువు అలంకరణలో ఉన్న నానమ్మ అందాన్ని, జహ్రా కళ్ళార్పకుండా గమనించడం చూసి, చిన్నగా నవ్వుకున్నాడు కృష్ణమరాజు. బీరువాలోంచి తల్లి పట్టుచీరలు తెచ్చి జహ్రా ముందుంచి, నచ్చినవి తీసుకోమన్నట్టు కళ్ళతో సైగ చేసాడు. భారతీయ సంప్రదాయం పట్ల మక్కువ పెంచుకున్న ఆమెకు, ఆ చీరలు ఎంతగానో నచ్చాయి. అద్దం ముందు నిలబడి ఒక్కో చీరనూ భుజాల మీదుగా వేసుకుని చూసి మురిసిపోయింది. తనకు లభించిన మొదటికానుకగా ఆ పట్టుచీరల్ని అపురూపంగా పెట్టెలో దాచుకుంది. ఎఱ్ఱని అంచున్న బంగారురంగు చీరపై నిండుగా ఉన్న బుటీని చేత్తో తడిమి చూసుకుని, 'రేపు ఈ చీర కట్టుకోనా?' అన్నట్టు ఆమె భావాన్ని భర్త చెవి వద్ద గుసగుసగా చెప్పింది. బహుమతిగా ఆమె చెక్కిలిని ముద్దాడుతూ దగ్గరకు తీసుకున్నాడు కృష్ణమరాజు.

సూర్యోదయానికి ముందే లేచి తలస్నానం చేసి, నుదుట కుంకుమ దిద్దుకుని, బంగారు జరీచీర కట్టుకుని, వాకిట్లో ముగ్గు పెట్టడానికి ఆసక్తిని కనబరుస్తున్న జహ్రా చేతికి, వరిపిండి కలిపిన ముగ్గుపొడిని అందించింది గాయత్రి.

భవంతి ముందర కళ్ళాపి చల్లిన మట్టినేలపై, తాను ఇంతకుముందు యూట్యూబ్‌లో చూసి నేర్చుకున్న చుక్కలముగ్గును పొందికగా వేసింది జహ్రా. ఆ పక్కనే గీతలతో 'నెలగంట' పెట్టడం చూసి ఆశ్చర్యపోయింది గాయత్రి. గోరింట పండిన ఎఱ్ఱని అరచేతులు అలవోకగా ముగ్గు వెయ్యడం... ఒక విదేశస్థురాలు మన సంప్రదాయాన్ని గౌరవించడమే కాకుండా, పాటించడం చూసి సంతోషంతో గాయత్రి కళ్ళు చెమర్చాయి. తమ అంచనాకు మించిన పద్ధతైన కోడల్ని వంశానికి చేర్చిన కృష్ణమరాజు వైపు మెచ్చుకోలుగా చూసింది. జహ్రాను ప్రేమగా దగ్గరకు తీసుకుంటున్న నానమ్మను కృష్ణమరాజు తన మొబైల్ కెమెరాలో బంధించడం చూసి నెలగంట గుంభనంగా నవ్వింది.

# జీ(వి)తం

ఓట్ర ప్రకాష్ రావు
✆ 9787446026

*జగత్ ఇంకా నన్ను ప్రేమిస్తున్నాడా... నా జీవితంలో ప్రవేశించడాని కోసం నాకు ఉద్యోగం ఇస్తాడా... ఉద్యోగం దొరికినా... నేను ఏదో సమస్యలో చిక్కుకొంటున్నానేమో అన్న భావన నాలో ప్రవేశించింది. ఉద్యోగం దొరికినా, దొరకకపోయినా మీ తల్లితండ్రులు కుదిర్చే సంబంధం చేసుకో అన్నాడుగా... అంటే ఈ ఉద్యోగంలో నన్ను సెలెక్ట్ చెయ్యడన్న అర్థమా?*

జగత్ కోసం ఎదురు చూస్తూ పార్కులో గడ్డిపై కూర్చున్నాను.

"ఆకాంక్షా! ఏమిటి ఆలోచనలో ఉన్నట్లున్నావు?" అంటూ వచ్చిన జగత్ నా బుగ్గ గిల్లాడు.

"నీ గురించే! అంత చదువు చదివి ఆ హైస్కూల్ నందు లెక్కల మాస్టారు ఉద్యోగంలో ఎందుకు చేరావు?" ఆశ్చర్యంతో అడిగాను

"ఆకాంక్షా! మా ఇంట్లో నేనొక్కడినే కొడుకుని! ఖర్చులకు ఎంతడిగినా ఇస్తారు, కానీ పాకెట్ మనీ కోసం అయినా ఏదో ఒక చిన్న ఉద్యోగం చేద్దామన్న ఆలోచన ఉదయమే కలిగింది. ఆ బడిలో లెక్కల మాస్టారు ఉద్యోగం ఖాళీ ఉందని ఎప్పుడో తెలుసు! ఈరోజు సరదాగా వెళ్లాను. ఇంటర్వ్యూ జరిపిన వెంటనే తొమ్మిదవ తరగతికి వెళ్లామన్నారు. అంతా కలలో జరిగినట్టు ఆశ్చర్యంగా ఉంది." అన్నాడు జగత్

"నాకేమో కొడితే ఏనుగు కుంభస్థలమునే కొట్టాలన్నట్లు, మంచి జీతం ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను!" అన్నాను.

"అలా కాఫీ హోటలులో ఏదైనా టిఫిన్ తిని వద్దాం."

"ఈ రోజే మొదటిజీతం తీసినట్లు చెబుతున్నావు" అన్నాను.

"స్కూల్ యజమాన్యం ఈవేళ అందరికీ బోనస్ అంటూ కొంత సొమ్ము ఇచ్చారు. అందరికీ ఇస్తున్నప్పుడు మిమ్మల్ని ఒట్టి చేతులతో పంపడానికి ఇష్టం లేదంటూ... నాకు రావలసిన నెల జీతంలో సగం జీతం ఈ రోజే ఇస్తున్నానంటూ ఇచ్చారు. చాలా మంచి మనిషిలాగుంది."



“మంచిమనిషైతే ఈ బడిలోనే పెర్మనెంటుగా ఉంటావా?” అన్నాను.

“నా అందమైన ఆకాంక్షను పెళ్ళి చేసుకొనడం కోసమైనా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దొరికేలా ప్రయత్నిస్తాను.” అంటూ లేచి నిలబడి, నా చేయి పట్టుకొని లేపాడు.

“నీకు మాత్రమే కాదు, మనిద్దరికీ ఉద్యోగం దొరికితేనే పెండ్లి!” అన్నాను.

ఇద్దరం అక్కడున్న ఒక హోటెలుకు వెళ్ళి, కొద్దిగా టిఫిన్ తిని, ఆ తరువాత ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళాము.

★★★

కాలచక్రం ఒక సంవత్సరం పాటు తిరిగింది. ఎంత ప్రయత్నించినా నేనాశించిన ఉద్యోగం దొరకలేదు.

ఆ సాయంత్రం మేమిద్దరం పార్కులో కలుసుకొన్నాము.

“చాలా మంచి సంబంధాలు వస్తున్నాయి అంటూ మా అమ్మానాన్నలు ఒకటే గొడవ! సాఫ్ట్‌వేర్ నందు పోటీ ఎక్కువ అయింది. ప్రస్తుతానికి ఈ లెక్కల మాస్టారు ఉద్యోగం చాలని చెబుతున్నారు!”

“మీరేమని సమాధానం ఇచ్చారు?” అంటూ ప్రశ్నించాను.

”మౌనంగా వచ్చేసాను. నీవు ఊ అంటే ఒక నెలలో పెండ్లి జరిగేలా చేస్తాను. ప్రేమవివాహానికి మా ఇంట్లో అడ్డు చెప్పరు. నిన్ను చూసారంటే సంతోషంతో అంగీకరిస్తారు.”

“మన పెండ్లి అంటూ జరిగితే మనం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ అయింతరువాతనే!” అన్నాను

“ఆకాంక్షా! నాకూ అప్పుడప్పుడు నాపై నమ్మకం తగ్గిపోతోంది. ఇక్కడ బడిలో మాస్టర్లకు ఇచ్చే జీతాలు జీవితానికి పరవాలేదనిపిస్తోంది. మన జీవితానికి ఆ జీతం చాలనిపిస్తోంది. ఉద్యోగ ప్రయత్నానికి పెళ్ళి అడ్డం రాదుగా! పెళ్ళి తరువాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ప్రయత్నిద్దాం.”

“మనిద్దరికీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దొరికిన తరువాత పెండ్లి విషయం మాట్లాడు. మా ఇంటిలోనూ నాకూ పెళ్ళి సంబంధాలు వస్తున్నట్లు చెపితే, ‘మంచి ఉద్యోగం దొరికాకనే పెళ్ళి చేసుకొంటాను’ అంటూ బల్ల గుద్దినట్లు చెప్పాను.” స్థిరంగా అన్నాను.

ఆ తరువాత నన్ను ఎలాగైనా అంగీకరింపజేయాలని ఎన్నో చెప్పాడు. నేను అంగీకరించక పోవడంతో నిరుత్సాహపడ్డాడు.

★★★

ఆరునెలల తరువాత ఉదయాన్నే మెసేజ్ చూసి ఉలిక్కిపడ్డాను. మరలా పెళ్ళి తలనొప్పి ప్రారంభమైంది అనుకొన్నాను. బెంగళూరులో ఒక మంచి కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దొరికిన సంగతి జగత్ మెసేజ్ పెట్టాడు.

జగత్ అంత పెద్ద ఉద్యోగంలో చేరుతున్నాడన్న సంతోషం నాలో కలగడంలేదు. ఎందుకంటే తనతో పాటు నాకూ దొరికుంటే ఎగిరి గెంతేసేదాన్ని! ఆ రోజంతా బాగా అలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ సాయంత్రమే కలిసాను.

“ఆకాంక్షా, ఉద్యోగంలో చేరడానికి ముందే పెళ్ళి చేస్తామంటున్నారు. ఇప్పుడైనా నీవు అంగీకరిస్తే మనం పెళ్ళి చేసుకొందాం.” అన్నాడు

“సారీ జగత్, నేను ఉద్యోగంలో చేరేంతవరకు నేను పెళ్ళి చేసుకోవాలని అనుకోవడం లేదు!”

“ఉద్యోగం పురుష లక్షణం అన్నట్లు నాకూ ఒక ఉద్యోగం దొరికిందిగా! “

“అది ఆ కాలం! ఇప్పుడు ఉద్యోగం జంట లక్షణం. భార్యాభర్తలు పనిలోనికి వెళ్తేనే జీవితం, ఆనందం! నీ జీతంతో నా జీతం కలిస్తే మరింత గొప్ప జీవితం. నేను ఎదురుచూసే జీవితం అదే!” అన్నాను.

“మా ఇంట్లో పెండ్లి విషయంలో ఒత్తిడి ఎక్కువయింది!”

“నేను బాగా ఆలోచించే చెబుతున్నాను. నీవు మీ ఇంట్లో చూసే వారిని పెళ్ళిచేసుకో! నీవు ఇంతకాలం ఎదురుచూసింది చాలా గొప్ప సంగతి!” అన్నాను

జగత్ కళ్ళు చెమ్మగిల్లడం గమనించాను.

"ఆకాంక్షా, నేను నిన్ను ఎంతగా..."

"నేనూ నిన్ను ఎంతగానో... అయినా మనం అనుకున్నదంతా జరగదుగా! ఆక్సిడెంటల్‌గా మన ప్రేమ విఫలమయిందనుకొందాము."

"మొదటినుంచి ఉద్యోగం అంటుంటే, నా ఉద్యోగం దొరికాక మారిపోతావనుకొన్నాను. కానీ ఇలా మొండితనంగా నీకూ ఉద్యోగం కావాలని..." బొంగురు పోయిన గొంతుతో అన్నాడు.

"జగత్! ఎందుకో మన ప్రేమకు అనుకూలమైన పరిస్థితులు కలగలేదు. మనం ఇకమీదట మంచి స్నేహితులుగా ఉందాం!" అంటూ చెప్పినా, ఎంత కాదనుకున్నా నా కంటిలో కన్నీరు కారసాగింది.

"ఆకాంక్షా! నీ కన్నీళ్లే నీ మనసులోని నిర్ణయం ఏమిటో చెబుతున్నాయి, మరొక్కసారి ఇంటికెళ్ళి బాగా అలోచించి నీ నిర్ణయం చెప్పు." నా చేతిలో చేయి వేసి మృదువుగా నొక్కుతూ అన్నాడు

★★★

జగత్ పెండ్లికి వెళ్లాను. జగత్ నన్ను చూసి నా దగ్గరకు వచ్చి పలుకరించాడు.

"నీ అందానికి కాస్తయినా ఈడు జోడు అని చెప్పేలా అమ్మాయిని ఎన్నిక చేసి ఉంటారనుకొన్నాను. ఏమాత్రం అందం లేని ఆ అమ్మాయిని మీ తల్లితండ్రులు ఎలా ఎన్నికచేసారో అర్థం కావడం లేదు." అసహనంగా అన్నాను.

"మంచి సాంప్రదాయ కుటుంబం అని మా అమ్మా నాన్నలు..." అన్నాడు.

"ప్చ్" అన్నాను. ఏమాత్రం అందం లేని అమ్మాయిని కోడలుగా ఎన్నిక చేసిన వారిపై నాకు కోపం కలిగింది.

"ఆకాంక్షా, నిన్ను పరిచయం చేస్తాను" అంటూ జగత్ చెప్పినా, కోపంతో వద్దంటూ తలాడించాను.

★★★

జగత్ భార్యతో బెంగళూరులో కాపురం పెట్టినట్లు, ఇక్కడున్న జగత్ తల్లిదండ్రులు ఇల్లు ఖాళీచేసి, బెంగుళూరులో కొడుకుతో పాటు ఉన్నట్లు తెలిసింది.

ఎందుకో జగత్‌కు ఫోన్ చేయాలనిపించలేదు.

మూడు సంవత్సరాలు గడిచాయి.

పట్టువదలని విక్రమార్కుడిలా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఉన్నాను. చెన్నైలో ఒక పెద్ద కంపెనీలో రిటర్న్ టెస్టు తరువాత ఇంటర్వ్యూకు వెళ్లాను.

"ఆకాంక్షా!" అంటూ అక్కడున్న పీ ఏ పిలవగానే నేను లేచి వెళ్ళాను.

"జగత్! నీవా? మీరా ఈ కంపెనీకి..." అంటూ అన్న తరువాత, నేను ఇంటర్వ్యూకు వచ్చిన సంగతి గుర్తుకు వచ్చి "గుడ్ మార్నింగ్ సార్!" అన్నాను.

ఫోన్ ఎత్తి, "రెండు కాఫీలు పంపించండి" అన్నాడు.

"ఆకాంక్షా! బెంగళూరులో పనిగంటలు ఎక్కువతో పాటు ఒత్తిడి ఎక్కువగా కలగడంతో 'జీతం కోసం జీవితం కాదు, జీవితం కోసం జీతం చాలు, తక్కువ జీతమైనా వేరే ఉద్యోగం చూడమంటూ మా ఆవిడ బలవంతం చేసింది. ఆ మాటలు నాకూ సరైనవనిపించాయి. ప్రయత్నించగా ఈ కంపెనీకి వచ్చి హెచ్ ఆర్‌లో చేరాను. ముందుజీతం కన్నా పాతికవేల రూపాయలు తక్కువైనా ఏదో స్వర్గలోకంలో ఉన్నట్లుంది. మనం స్నేహితులంలా ఎప్పటిలా కాఫీ తాగుతూ మాట్లాడుకొందామనిపించి కాఫీ తెమ్మని చెప్పాను. అయినా ఇక్కడ ఎవరూ లేరుగా!" అన్నాడు

"నీకు పిల్లలు..."

"ఒక పాప. రెండేండ్లు!" అంటూ సెల్‌ఫోను తీసుకొని, పాప ఫోటోతో పాటు వీడియో చూపించాడు

"పాప క్యూట్‌గా ఉంది!"

"నీవింకా పెళ్ళి చేసుకోలేదా?" అడిగాడు.

"నా మొదటి షరతు ఉద్యోగం దొరకాలి. ఉద్యోగం దొరికినా... పెళ్ళి విషయంలో నా మనసు అంగీకరించదు అనుకొంటా. నీలాంటి వ్యక్తిని..." ఆ తరువాత చెప్పలేక తలవంచుకొన్నాను.

అప్పుడే ఒకతను రెండు కాఫీలు తీసుకొని వచ్చి టేబుల్ మీద ఉంచి వెళ్ళాడు

ఒక కప్పు నా చేతికిస్తూ, "నన్ను అంతగా ప్రేమించిన దానివి, అప్పుడే మన పెళ్ళికి ఒప్పుకొని ఉంటే బాగుండేది!" అన్నాడు

"అప్పుడు నాకు ఉద్యోగం దొరకలేదుగా!"

"నీ నిర్ణయం తప్పనిపిస్తోంది. నేటి యువతలో చాలామంది జీతం కోసం జీవితం అని భావిస్తూ మంచి జీవితానికి దూరమవుతున్నారు. భార్యాభర్తలు ఉద్యోగస్థులైతే, ఎన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారో చూసాను. ఈ కంపెనీలో ఈ సంవత్సరం ఇరవైమూడు మంది వివాహాలు రద్దు చేసుకొన్నారు."

ఆ విషయమై చర్చించడానికి ఇష్టం లేక, "మీ ఆవిడ ఉద్యోగం చేస్తుందా?" అని అడిగి, కాఫీ తాగసాగాను

"ఇంటర్ వరకు చదివింది, ఆ పైన చదవలేదు. హౌస్‌వైఫ్‌గా ఉంది" అంటూ భార్య గురించి కొంతసేపు చెప్పాడు.

ఎందుకో ఆ మాటలు నా మనసును బాధిస్తున్నట్లనిపించింది.

"మీ అమ్మాయి పేరు?" అంటూ సంభాషణ మళ్లించాను.

"ఆదర్శ."

"నీవు పెట్టిన పేరా?"

"మా ఆవిడ కొన్ని పేర్లు సెలెక్ట్ చేసి ఇచ్చింది. అందులో 'ఆ' అక్షరంతో ఆరంభమయ్యే ఆదర్శ పేరును ఎన్నిక చేసాను."

'జగత్ మనసులో ఇంకా నేనున్నాను' అని బాధగా అనుకొన్నాను. ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయాను.

"ఆకాంక్షా! నేను నిన్ను కోరుకొనే ఒకే ఒక్క కోరిక ఏమిటంటే, ఉద్యోగం దొరికినా, దొరకకపోయినా మీ తల్లితండ్రులు కుదిర్చే సంబంధం చేసుకో. ఇంకా ఇంటర్వ్యూ చేయవలసిన వారున్నారు నీవిక వెళ్ళు."

లేచి నిలబడ్డాను. ఇంటర్వ్యూ లాగా జరగలేదు. జగత్ లేచి నిలబడి నాకు షేక్‌హ్యాండ్ ఇవ్వబోతున్నట్లుగా చేయిజాపాడు. నేను చేయి ఇచ్చాను. జగత్ శరీరంలో ఎటువంటి భావాలు కలిగాయో, ఏమో గానీ నాలో ఒక్కసారిగా శరీరంలో ఏదో పులకింత!

జగత్ ఇంకా నన్ను ప్రేమిస్తున్నాడా? నా జీవితంలో ప్రవేశించడాని కోసం నాకు ఉద్యోగం ఇస్తాడా? ఉద్యోగం దొరికినా, నేను ఏదో సమస్యలో చిక్కుకొంటున్నానేమో అన్న భావన నాలో ప్రవేశించింది. ఉద్యోగం దొరికినా, దొరకకపోయినా మీ తల్లితండ్రులు కుదిర్చే సంబంధం చేసుకో అన్నాడుగా... అంటే ఈ ఉద్యోగంలో నన్ను సెలెక్ట్ చెయ్యడన్న అర్థమా?

నెల రోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం నన్ను ఎన్నిక చేసినట్లు ఈ మెయిల్ ద్వారా తెలిపారు.

ఉద్యోగంలో చేరడానికి వెళ్ళాను. హెచ్ ఆర్ డిపార్టుమెంటుకు వెళ్ళమంటే వెళ్లాను. అదృష్టవశాత్తు జగత్ కనబడలేదు. జగత్ నాతో ఎలా నడచుకొంటాడన్న ప్రశ్న నా ముందు ఒక పెద్ద భూతంలా నిలిచింది. హెచ్ ఆర్ సెక్షన్ వైపు వెళ్ళడం పూర్తిగా మానుకొన్నాను. ఫోను చేస్తాడేమోనన్న ఆందోళన, ఎవరైనా నా ముందు నిలబడితే జగత్ నిలబడ్డాడన్నభావనతో ఉలిక్కిపడేదాన్ని!

మనసు నిలకడలేనిదన్న సంగతి నాలో నిజమైంది. ఎంత వద్దనుకున్నా జగత్ కనబడకపోవడంతో కంప్యూటరునందు మా కంపెనీ లిస్ట్ చూసాను. అందులో జగత్ పేరు కనబడలేదు. ట్రాన్స్ఫర్ల లిస్ట్‌నందు నేను ఉద్యోగంలో చేరడానికి ముందు ఢిల్లీ బ్రాంచ్‌కు వెళ్ళినట్లు తెలిసింది. 'జగత్, నా కోసం ఢిల్లీకి వెళ్ళావని ఇప్పుడు తెలుసుకున్నాను. నీవు కోరినట్లు నేను పెండ్లి చేసుకొంటాను!' బాధగా అనుకొన్నాను.

"మీ కంపెనీలో కొంతమంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, జీతమే జీవితమనుకొని అదే పనిచేసేవారిని పెండ్లి చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు. తొందరలో మీ కంపెనీలో పనిచేసే మంచి అబ్బాయిని చూసి, పెండ్లి చేయాలనుకుంటున్నాను!" నాన్న సంతోషంతో చెప్పారు.

నేను సరేనన్నట్టుగా తల ఆడించాను.

# ఇంతకీ మీరేమంటారు "జెన్ జీ"

అంగర శ్రీనివాస రవిశేఖర్
✆ 9490751275

*నాన్న, నువ్వూ ఇద్దరూ ఆఫీసుకు వెళ్ళేవాళ్లే, కాని నాన్నకు లేట్ అయిపోతుందంటూ, నాన్నమ్మ టిఫిను టేబుల్ మీద పెట్టడం... తాత మన గేటు ముందు ఎవరైనా ఆటోలు, కార్లు అడ్డు పెడుతుంటే, నాన్న బండి తీసేప్పుడు అడ్డు అని... కాపలా నిలబడి, కేకలెయ్యడం... ప్రోటోకాల్ అబ్సర్వ్ చేసేవారు! నువ్వేమో ఆదరాబాదరాగా ఎప్పుడూ లేట్‌గా పరిగెత్తేదానివి! మరి నీదీ ఉద్యోగమే కదా, డబ్బులు సంపాయిస్తున్నావు కదా, పైగా ఇద్దరూ అప్పుడు గుమస్తాలే కదా... ఏంటి తేడా? మీరిద్దరూ ఒకే చోట ఉన్నప్పుడు, మీ వేస్ ఆఫ్ లైఫ్‌కి ఎందుకు తేడా?"*

"అయితే ఇప్పుడేమంటావ్" ఇంచుమించు అరిచినట్టే అడిగింది అను, రిక్లైనర్‌లో కూర్చొన్న తన కాళ్ళనానుకొని, నేల మీద కూర్చొని రిలాక్స్డ్‌గా టీవీ చూస్తున్న ప్రవీణని!

'అను' అని పిలవబడే అన్నపూర్ణ... ఎల్లైసీలో ఆఫీసర్‌గా పనిచేసి, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని, ఇప్పుడు ఇంట్లోనే ఉంటోంది. భర్త శ్రీనివాస్... బ్యాంకులో స్కేల్ ఫోర్ ఆఫీసర్. అతనికి ఇంకా ఓ ఏడాది సర్వీసు ఉంది. ప్రవీణ వాళ్ళకు ఒక్కతే కూతురు. ఐఐటీలో బీటెక్ చేసి, హైదరాబాద్‌లో ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో పని చేస్తోంది. ఇంకో స్టార్ట్ అప్ కంపెనీ కోసం కూడా ఫ్రెండ్స్‌తో కలిసి వర్క్ ఔట్ చేస్తోంది. కూతుర్ని పెళ్ళి చేసుకొమ్మని ఏడాది నుంచి పోరు పెడుతున్నా సరే, తను వినటం లేదు.

ఇప్పుడు కూడా ఆ విషయమే ప్రవీణను అడిగింది అన్నపూర్ణ.

"అమ్మా, అదుగో చూడు, స్కామ్ 1992 వెబ్ సిరీస్‌లో సుచేతా దలాల్ ఎంత పెద్ద స్కామ్ క్రాక్ చేసిందో... ఎంత ఫేమస్ అయ్యిందో! టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఫైనాన్షియల్ ఎడిటర్ ఆమె! ఆ రోజుల్లోనే ఒకసారి ఆమె, ప్రఖ్యాత కార్టూనిస్ట్ ఆర్ కె లక్ష్మణ్‌ని అడిగిందిట.. 'సార్! మీరెందుకు ఎప్పుడూ మీ కార్టూన్లలో కామన్ మేన్‌నే బొమ్మగా వేస్తారు, ఉమెన్ ఎందుకు ఉండరు?' అందుకు అతను, 'ఉమెన్ ఆర్ యునీక్, నాట్ కామన్' అని చెప్పాడుట! అలా నేను కూడా అంతే!"


కూతురు జవాబు వినేసరికి అన్నపూర్ణకి కోపం వచ్చింది. "అంటే యునీక్ ఆడవాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోరా? ఒక్కసారి ఇటు ఆలోచించు... పిల్లాడి తండ్రి పెద్ద సైంటిస్టు! పిల్లాడు ఐ ఐ ఎం లో ఎంబియ్యే చేసాడు. తక్కువ వాళ్ళు కాదు!"

"తక్కువని నేనెక్కడ అన్నాను. నేను డిసైడ్ చేసుకోలేదని అంటున్నాను. నా ఆలోచనలు వేరే ఉన్నాయి! కెరీర్ యాస్పెక్ట్,

పెళ్ళి అనే వ్యవస్థలో అవస్థలు, కిడ్స్... ఇలా చాలా ఉన్నాయి. నేను నీలా త్యాగాలు చెయ్యలేను. ఇలాయితే ఇంక లాంగ్ వీకెండ్ వచ్చినా నేను వైజాగ్ రాను." కోపంగా బదులిచ్చింది ప్రవీణ.

"నేనా? నేనేం త్యాగం చేసాను?"

ప్రవీణ లేచి, చూస్తున్న టీవీని పాజ్‌లో పెట్టి, డైనింగ్‌టేబుల్ ఛైర్ లాక్కొని అన్నపూర్ణ ఎదురుగా కూర్చుని, ఆమె కళ్ళలోకి చూస్తూ, "నువ్వు చాలాకాలం ప్రమోషన్ ఎందుకు తీసుకోలేదు? నాన్న వెంటవెంటనే ప్రమోషన్ల మీద స్కేల్ ఫోర్‌కి వచ్చారు. నువ్వు మాత్రం ఇక్కడ మా కోసం, మామ్మా తాతయ్యలను చూసుకుంటూ ఉండిపోలేదా! నీకు టెన్త్ క్లాస్ లెక్కల్లో ఎన్ని మార్కులొచ్చాయి? కాలేజీలో ఫస్టు రాంకర్‌వి కాదా!" కాస్త నెమ్మదిగానే కన్సర్న్ చూపిస్తూ అన్నది.



వెంటనే కళ్ళు దించేసుకొని, కూతుర్ని వెనక్కి నెట్టి, రిక్లైనర్ లోంచి లేచి, వంటింటి వైపు వెళ్ళిపోయింది అన్నపూర్ణ.

వెనకాలే వెళ్ళి, "నాన్నమ్మ తిడుతున్నా, చిన్నప్పుడు నాకు బాయ్‌కట్ ఎందుకు చేయించావు! పొద్దున్నే టిఫిన్లు అందరికీ చెయ్యాలి. నాన్నకి, నీకు లంచ్ బాక్సులు కట్టుకోడానికి, వంటలు చెయ్యడానికే టైము సరిపోకపోతే, ఇంక నాకు జడలు

వెయ్యడానికి నీకు టైమ్ ఇంకెక్కడుంది? అందుకు..." అంటూ, స్వీట్‌లో వెయ్యడానికి రెడీగా కప్పులో పెట్టిన, నేతిలో వేయించిన జీడిపప్పులు తీసి నోట్లో వేసుకుంటూ, దీర్ఘాలు తీసింది ప్రవీణ.

కూతురు చెయ్యి మీద ఒక్క చరుపు చరుస్తూ, "ఏయ్... ఆగు, స్వీటు దేవుడికి నైవేద్యం పెట్టాలి. అలా ఎంగిలి చేస్తే ఎలా!" కసురుకుంది అను.

"నువ్వు ఓ ధోరణికి ట్యూన్ అయిపోయావు. నువ్వు హోమ్‌మేకర్‌గా, వర్కింగ్ ఉమన్‌గా, కోడలిగా కూతురుగా, తల్లిగా... ఇలా అనేకపాత్రలను పోషించాలనుకున్నావు. ఇదే ధోరణితో నీ కెరీర్‌ను వదిలేసుకున్నావు." గాస్ కట్టేసి హాల్లోకి వస్తున్న అన్నపూర్ణ భుజాల మీద చెయ్యేసి తన పక్కనే నడుస్తూ, "అమ్మా! కెరీర్ మాత్రమే కాదు, నీ ఇష్టాలు... హిల్ స్టేషన్లు, ప్రకృతి, కృష్ణశాస్త్రి తిలక్ సాహిత్యాలు.. అవన్నీ త్యాగం చేసి, మన ట్రిప్పులన్నీ తిరుపతి, కాశీలకే పరిమితం చేసుకున్నావు. అది నీ లక్!" అంటూ తల్లిని డైనింగ్‌టేబుల్ దగ్గర కూర్చోబెట్టి, తను కూడా ఎదురుగా కూర్చుంది ప్రవీణ.

"ఏంలేదు, నేను హాయిగా ఉద్యోగం చెయ్యాలనుకున్నాను గాని, హడావిడిగా కాదు. తనని కని పెంచినందుకు, అమ్మని నాన్నని చూడ్డం నాన్న బాధ్యత! మీ నాన్న బాధ్యతలు నేను పంచుకోవాలి! అదే పెళ్ళి అనే వ్యవస్థలో ఉన్న గొప్పతనం! అది త్యాగం కాదు కన్సర్న్! తోడు అంటే అర్థం అదే. నిన్ను పెంచడం బరువు కాదు, పిల్లల్ని కనడం పెంచడం... ఇదంతా వే ఆఫ్ లైఫ్ ఆడవాళ్ళకి!" వివరించడానికి ప్రయత్నించింది అన్నపూర్ణ.

"అమ్మా! పాత సినిమాల్లో షావుకారు జానకి పాత్రని బాగానే పోషిస్తున్నావు గాని, నువ్వు అంత పాత తరానికి చెందిన దానివి కాదు. చదువుకున్న దానివి. తెలివైన దానివి కూడా. నాకు తెలుసు! నాకు గుర్తే. నాన్న, నువ్వూ ఇద్దరూ ఆఫీసుకు వెళ్ళేవాళ్లే, కాని నాన్నకు లేట్ అయిపోతుందంటూ, నాన్నమ్మ టిఫిను టేబుల్ మీద పెట్టడం... తాత మన గేటు ముందు ఎవరైనా ఆటోలు, కార్లు అడ్డుపెడుతుంటే, నాన్న బండి తీసేప్పుడు అడ్డు అని... కాపలా నిలబడి, కేకలెయ్యడం... ప్రోటోకాల్ అబ్సర్వ్ చేసేవారు! నువ్వేమో ఆదరాబాదరాగా ఎప్పుడూ లేట్‌గా పరిగెత్తేదానివి! మరి నీదీ ఉద్యోగమే కదా, డబ్బులు సంపాయిస్తున్నావు కదా, పైగా ఇద్దరూ అప్పుడు గుమస్తాలే కదా! ఏంటి తేడా? మీరిద్దరూ ఒకేచోట ఉన్నప్పుడు, మీ వేస్ ఆఫ్ లైఫ్‌కి ఎందుకు తేడా!" ప్రవీణ ఖంగుమనే గొంతుతో అరిచినట్టు ప్రశ్నించింది.

"అమ్మో! మబ్బేసింది, ఉండు.. బాల్కనీలో ఎండబెట్టిన ఆవకాయ, ఆరేసిన బట్టలు తేవాలి!" అంటూ పరుగెట్టింది అన్నపూర్ణ.

తల్లి వెనకాలే పరిగెట్టి, బాల్కనీలో దండేలకి ఆరేసిన బట్టల్ని గబగబా లాగేసి, బాల్కనీకి ఆనుకొని ఉన్న బెడ్రూమ్‌లో పడేసి, మళ్ళా బాల్కనీలోకి పరిగెట్టింది ప్రవీణ. బాల్కనీ రైలింగ్ మీద ఆనుకొని, అవతలకి వంగి, అప్పుడే పడుతున్న చినుకులు పట్టుకొని ఎగరేస్తున్నట్టు చేతులు ఆడిస్తూ... ఎక్కడ్నించో వస్తున్న తడిసిన మట్టివాసన ఇష్టంగా పీలుస్తూ, "ఆహా... అమ్మా ఎంత బావుంది!" అనందిస్తూ అంది ప్రవీణ. వెనకాల నిలబడ్డ తల్లిని కూడా తన పక్కకి లాగి, కాసేపు ఇద్దరూ మౌనంగా పెరుగుతున్న వానని చూస్తూ, తడుస్తున్న నేల వాసన పీలుస్తూ ఉండిపోయారు.

మనసు మాత్రం మూగది కాదు కదా... మాట్లాడుతూనే ఉంది మమతల భాషలలో... ఇద్దరిలో!

ఇంకా జల్లు ఎక్కువ అవుతుంటే, బెడ్రూమ్‌లోకి వచ్చి మంచం మీద కూర్చుని, బట్టలు మడత పెడుతూ, ప్రవీణే మళ్లా అంది. "అమ్మా... నువ్వన్నావు కదా... 'వాళ్ళ అమ్మా నాన్నని చూడ్డం నాన్న బాధ్యత' అని, అదో జెంటిల్‌మేన్స్ అగ్రిమెంట్ కదా! మరి... ఇప్పుడు... మీకు... అది ఫుల్‌ఫిల్ చెయ్యడానికి ఎవరున్నారు? నేనే కదా!"

తల్లి ఏం మాట్లాడకపోయేసరికి తనే మళ్ళీ అంది. "పెళ్ళి అనే ప్రయోగంలో ఫెయిలైన నా రూమ్మేట్ సాన్వీ... వాళ్ళ అమ్మానాన్నని చూసుకుంటూ, తనకిష్టమైన పనులు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తోంది. ఓ రెండేళ్ళు తెచ్చిపెట్టుకున్న కష్టం తప్ప... ఇప్పుడంతా హాయిగా నడుస్తోంది తనకి!"

"నిజమే ప్రవీ! నువ్వు నాకంటే ఎక్కువగా... బయట హాస్టల్స్‌లో ఉన్నావు, కాదన్ను! కానీ, ఒక విషయం స్టడీ చేసి, కంక్లూడ్ చెయ్యడానికి ఎన్నో ఉదాహరణలని తీసుకోవాలి! మా అమ్మ చదువుకోలేదు, బహుశా ఆమెకు చెప్పి, ఆమెతో చర్చించి మా తాతగారు తనకు పెళ్ళి చేసి ఉండరు! మా అమ్మ కంటే, నేను ఎక్కువ చదువుకున్నాను. మా నాన్నగారు నాతో చెప్పి, 'చక్కగా మన పక్క ఊర్లోనే ఉద్యోగం చేస్తున్నాడు, ఉద్యోగం చేసే పిల్ల కోసం చూస్తున్నాడని తెలిసింది. కుటుంబం మంచిది, మన రాంబాబు పనిచేస్తున్న బేంకులోనే అతనూ పని చేస్తున్నాడు. నీ జీవితం బావుంటుంది... ఏవంటావ్?' అని కన్విన్స్ చేసి, నా పెళ్ళి చేసారు, నిన్ను ఇప్పుడు మేం కన్విన్స్ చెయ్యడానికి ప్రయత్నించట్లేదు. నువ్వు నా కంటె పెద్ద చదువు చదివావు. నీ లైఫ్‌లో సహచరుణ్ణి నిర్ణయించుకోడానికి తోడ్పాటు అందిస్తున్నాం. తరాలు మారుతూ ఉంటే, వాళ్ళ తరంలో ఉన్న అవలక్షణాలు, నీలాగే ప్రశ్నించడం వల్ల మెరుగుపడతాయి!" ఆవేశపడకుండా మాట్లాడుతోంది అన్నపూర్ణ.

"నేను ఆఫీసులో జాయిన్ అయినప్పుడు, ఆడవాళ్ళకు రెస్ట్‌రూమ్, ప్రెగ్నెంట్స్‌గా ఉన్నప్పుడు రెస్టు తీసుకోడానికి గాని, ఇతర సమయాల్లో గాని... రెస్టు తీసుకోడానికి ఉండేది కాదు. కాని వాటి కోసం... మేం కొట్లాడాం! ఇప్పుడు జాయిన్ అయిన వాళ్ళకి రెడీగా ఉన్నాయి అలాంటి సౌకర్యాలు! ఉద్యోగం చెయ్యడానికి ఆఫీసుకు వచ్చి, కాస్త పలకరింపుగా మాట్లాడితే చాలు అదో ఏక్సిస్, ఇన్విటేషన్‌లా భావించే మగాళ్ళు ఉండేవారు మా ఆఫీసులో! ఇప్పుడు చట్టాలు ఉన్నాయి, ఉమెన్ ప్రొటెక్షన్ కమిటీలు ఉన్నాయి... అంటే ఏవిటి అర్థం?"

"అయితే ఇప్పుడేమంటావ్?" ఈసారి ప్రవీణ అడిగింది, కాస్త మెల్లగా!

"ఇందాక, వర్షం వచ్చినప్పుడు తడిసిన నేలవాసన అనుభవించావు కదా! భూమి సారవంతం అవుతుంది. మన కోసం పంటలు పండుతాయి! అలాగే నువ్వు పుట్టినప్పుడు, నా పక్కలో పడుకోబెట్టినప్పుడు ఓ ఫ్రాగ్రెన్స్ నేను అనుభవించాను. నా తర్వాతి తరం... ఓ అందవైన భవిష్యత్తు కోసం, ఆనందం నింపి సమాజాన్ని సుసంపన్నం చెయ్యడానికి, లోకాన్ని పరిమళింపజేయడానికి, ప్రగతి కోసం మరింత నైపుణ్యం కలిగిన నెక్స్ట్ జెన్.. ప్రవీణ..."

తల్లి మాటలకు అడ్డొచ్చి, ఏదో అనబోతున్న ప్రవీణని మధ్యలో ఆపి, "అలా అని నువ్వు లేవనెత్తిన ప్రశ్నలు తప్పు కాదు, వాటికి మీరు చెబుతున్న సమాధానాలు మాత్రం సరి చూసుకోండి! నువ్వన్నట్టు.. నేను సర్దుకు పోయానేమో... కానీ, నాన్న కెరీర్‌లో ఎదిగారంటే, నాన్నతో పాటు దాని మంచిఫలితాన్ని నువ్వు, నేను కూడా షేర్ చేసుకున్నాం! నువ్వు ఎలా ప్రోగ్రెసివ్‌గా ఆలోచిస్తున్నావో... నీ తరం వాడే, నీలా ఆలోచించే అబ్బాయి కూడా ఉంటాడేమో... సిస్టమ్‌ని అవాయిడ్ చెయ్యడం కాదు, బెటర్ సిస్టమ్ ఎవాల్వ్ చెయ్యాలి! ఆలోచించు. సమాజం జవసత్వాలు ఉడిగిపోకూడదు! యువత బలంగా ఎప్పుడూ

ఉంటూ ఉండాలి కదా! యు ఆర్ యునీక్... నిజంగానే! ఐ మీన్ యూత్!"

అంతలో టంగ్‌మని బెల్ మ్రోగడంతో "అరె, ఏడైంది, ఈయన వచ్చి ఉంటారు" అంటూ వెళ్ళి, తలుపు తీసింది అను.


భర్త శ్రీనివాస్ ఆఫీసు నుంచి వచ్చాడు.. శనివారం అయినా వెళ్ళక తప్పదు, ఆడిట్ నడుస్తోంది కదా! తను తెచ్చిన ఐస్‌క్రీమ్ బాక్సులు ప్రవీణ చేతిలో పెడుతూ "ఫ్రిజ్‌లో పెట్టు, డిన్నర్ అయింతర్వాత తిందాం! అలా తినడం అమ్మకి ఇష్టం. ఇవాళ అమ్మ పుట్టినరోజు కదా!" అంటూ, ఫ్రెష్ అవడానికి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు శ్రీనివాస్.

"అవునా, అందుకేనా స్వీట్ చేసావు, మర్చేపోయాను! హేపీ బర్త్ డే అమ్మా!" మనస్ఫూర్తిగా గ్రీట్ చేసింది ప్రవీణ.

ఐస్‌క్రీమ్ చప్పరిస్తూ, సరదా కబుర్లు, చిన్నప్పటి విశేషాలు, నాన్నమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు... వాళ్ళ అలకలు, ఆపేక్షలు... పలకరింపులు... జ్ఞాపకాలు... అలా రాత్రైపోయింది. ఎవరిపక్కల మీద వాళ్ళు వాలిపోయారు. తల్లి మాటలు గుర్తు చేసుకుంటూంటే, ప్రవీణ కనురెప్పలు బరువుగా వాలిపోయాయి. రేపు లేవాలి కదా కొత్తగా!

---

## కథాపుస్తక పరిచయం




### పూర్ణిమ

నూరుకు పైగా కథలు, మూడు నవలలు, ఇరవైకి పైగా రేడియో నాటికలు వ్రాసిన శ్రీమతి జలంధర గారి 19 కథల సమాహారం ఈ రెండవ కథల సంపుటి. వెల రు.275/-లు. 2024 లో విడుదలైన ఈ సంపుటి కోసం ..

నవోదయ బుక్‌హౌస్,
కాచిగూడ x రోడ్డు,
**హైదరాబాద్ – 500027**
✆ 9000413413
✉ *navodayabookhouse@gmail.com*

# ప్రారబ్ధం

కొయిలాడ రామమోహనరావు
✆ 9849345060

***ఇందాక అన్నావు చూడు, ఎన్ని జన్మలెత్తినా నా రుణం తీర్చుకోలేనని. ఈ జన్మలోనే రుణం తీర్చుకోవచ్చు. నా మాట విని, మీ అమ్మానాన్న చెప్పిన అబ్బాయిని పెళ్ళి చేసుకుంటే నా ఋణం తీర్చేసినట్లే! అవకాశం ఇచ్చావు కదా అని, ఎక్కువగా మాట్లాడాను. ఏమీ అనుకోవద్దు. ఇకనైనా మంచి మార్గంలోకి మారు తల్లీ. నిన్నింతగా బలవంత పెట్టడానికి ఒక బలమయిన కారణం ఉంది.***

రెస్టారెంట్లో కూర్చొని ఉన్న వయసుమళ్ళిన "మెహర్ బాబా", కాస్త దూరంలో కూర్చొని ఉన్న "ఆశ్లేష" అనే యువతి వైపు యథాలాపంగా చూసాడు. ఆమెను చూడగానే ఎందుకో అతని మనసు బాధతో మూలిగింది. ఆ రెస్టారెంట్ మొత్తానికి వాళ్ళిద్దరే కస్టమర్లు. కొద్దిసేపట్లో రెస్టారెంట్‌లో ఒక అనుకోని దుర్ఘటన జరగబోతుందని ఎవరూ ఊహించలేదు అప్పుడు!

కాసేపట్లో రెస్టారెంట్ ముందు ఒక ఖరీదైన కారు ఆగింది. ఆ కారు రెస్టారెంట్ డోర్‌కి దగ్గర్లోనే పార్కు చేస్తుంటే, సెక్యూరిటీ గార్డు అభ్యంతరం చెప్పాడు. కారు దిగిన అందమైన యువకుడు... అతనితో ఏదో మాట్లాడి షేక్‌హ్యాండ్ ఇవ్వడంతో, ఆ గార్డు అతనికి సలాం కొట్టి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. ఇదంతా చూస్తున్న ఆశ్లేష చిన్నగా నవ్వుకొని, "అభి ఎవరినైనా బుట్టలో పడేస్తాడు" అనుకుంది.

అభి, ఆశ్లేష దగ్గరకు వచ్చి కూర్చుంటూ, "సారీ లేటయింది" అన్నాడు అపాలజీ చెబుతూ.

"నో ఇష్యూ. నేను ఎన్నిసార్లు లేట్ చేయలేదు?" అంటూ నవ్వింది.

అతను రావడం చూసిన సప్లయర్ టేబుల్ దగ్గరికి వచ్చి ఆర్డర్ అడిగాడు.

"హాయ్ జోసెఫ్!" అని అతన్ని పలకరించి, "రెండు కోల్డ్‌కాఫీ. అంతే కదా?" అని ఆశ్లేష వైపు చూసాడు. ఆమె నవ్వుతూ తల ఊపడంతో, జోసెఫ్ ఆర్డర్ నోట్ చేసుకొని అక్కణ్నుంచి కదిలాడు. కాసేపయిన తర్వాత వాష్‌రూమ్‌కి వెళ్ళి వస్తానంటూ పైకి లేచాడు అభి. అతను తెచ్చిన అందమైన బొకేలోని పూల వాసనను ఆఘ్రాణిస్తూ తల ఊపింది ఆశ్లేష.

"ఆగు తల్లీ, ఆ కాఫీ తాగకు" అంటూ అరుస్తూ ఆశ్లేష చేతిలోని కోల్డ్‌కాఫీ మగ్గు లాక్కునే ప్రయత్నం చేసాడు మెహర్ బాబా కంగారుగా.

ఆశ్లేష, అభి షాక్ అయ్యారు. అతను ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో అర్థం కాలేదు వాళ్ళిద్దరికీ. సర్వ్ చేయడానికి వచ్చిన జోసెఫ్ గాబరాగా చూడటం మొదలు పెట్టాడు.


"ఎవడ్రా నువ్వు? ఎందుకు ఇలా అడ్డుపడుతున్నావు?" అంటూ మెహర్ బాబా కాలర్ పట్టుకున్నాడు అభి ఉరిమేలా చూస్తూ.

అయినా మెహర్ బాబా తన పట్టు విడవలేదు. అభిని పట్టించుకోకుండా ఆశ్లేష వైపు చూస్తూ, "నీ తండ్రిలాంటి వాడిని! నా మాట విను. అందులో ఏదో కలిపారు. అది తాగవద్దు" అన్నాడు బతిమాలుతున్నట్లు.

"మీకు మతిస్థిమితం లేనట్లుంది. ముందు ఇక్కడినుంచి వెళ్ళండి" అంటూ మగ్గు వదలకుండా గట్టిగా పట్టుకుంది. ఆ పెనుగులాటకు కాఫీ కాస్త ఒలికి ఆమె బట్టల మీద పడటంతో, అభి కోపం తారాస్థాయికి చేరింది.

"బాస్టర్డ్... నిన్నేం చేస్తానో చూడు" అని గట్టిగా అరుస్తూ, మెహర్ బాబాను కొట్టడానికి చేయి పైకెత్తాడు. ఆ గొడవకు అక్కడున్న స్టాఫ్, మేనేజర్ హడావిడిగా పరిగెత్తుకుంటూ వచ్చి, వాళ్ళ చుట్టూ గుమిగూడారు. పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన మెహర్ బాబా, అభిని బలంగా వెనక్కి నెట్టి, ఆశ్లేష చేతిలో ఉన్న మగ్గుని లాక్కుని, కాఫీ అంతా గటగటా తాగేశాడు. దాంతో అందరికీ మతిపోయింది.

"వీడెవడో పిచ్చివాడిలా ఉన్నాడు. జోసెఫ్, నువ్వూ ఓ చేయి వెయ్యి, వీడికిక్కడే దేహశుద్ధి చేద్దాం" అంటూ మెహర్ బాబా మీద దాడి చేయబోతున్న అభి చేయి పట్టుకుని ఆపింది ఆశ్లేష.



"వద్దు. ఆయన్నేమీ చేయొద్దు. ఆయన అలా ప్రవర్తించడానికి ఏదో బలమైన కారణం ఉండే ఉంటుంది. కాసేపు ఆయన్ని అలాగే వదిలేద్దాం. కాస్త సెటిల్ అయ్యాక చూద్దాం" అంటూ వారించింది.

అభి అందుకు అంగీకరించక, "నీకేమీ తెలియదు. నాకు అడ్డు చెప్పకు..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"వద్దు. ఆయన్నేమీ చేయొద్దు. కూల్‌గా కూర్చో" అంటూ సీరియస్‌గా చూసేసరికి. అభి ఏమి చేయలేక భుజాలు ఎగరేసి కూర్చుండిపోయాడు.

కాఫీ తాగేసిన మెహర్ బాబా కాసేపు అలాగే నిలబడిపోయి, ఆ తర్వాత అక్కడున్న కుర్చీలో కూలబడిపోయి, నెమ్మదిగా మెల్లగా మత్తులోకి జారుకున్నాడు. దాంతో ఆశ్లేషకు విషయమంతా అర్థమైపోయింది. జోసెఫ్ వైపు నిప్పులు కక్కుతున్నట్లు కొరకొరా చూసింది. అప్పటికే జోసెఫ్‌కి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. భయంతో వణుకుతున్నాడు.

మేనేజర్ వెంటనే జోసెఫ్ కాలర్ పట్టుకుని, "ఏరా రాస్కెల్... ఆ కాఫీలో ఏం కలిపావు? ఎవరు చేయమంటే ఈ వెధవ పని చేశావు?" అని గద్దించగానే, అభి వైపు చూశాడు జోసెఫ్.

అభి ఎటో చూస్తున్నట్లు నటించడం ఆశ్లేష గమనించింది.

"నీవల్ల మన రెస్టారెంట్‌కి ఎంత చెడ్డపేరు? నిన్నిలా వదిలేస్తే కాదు. పోలీసులకప్పజెప్పాలి" అని మేనేజర్ అంటుంటే, అభి ముఖంలో కనిపించిన కలవరాన్ని కూడా గమనించింది ఆశ్లేష.

"వద్దండి. పోలీసులకు రిపోర్ట్ చేయవద్దు. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగడం, మీడియా దృష్టిలో పడటం నాకు ఇష్టం లేదు" అని ఆశ్లేష దృఢంగా అనేసరికి, మేనేజర్ ఆగిపోయాడు.

"ఈ పెద్దాయన స్పృహలో నుంచి బయటకు వచ్చి నోరు విప్పేటంత వరకు, ఆ నీచుడిని ఏదైనా గదిలో ఉంచి బంధించండి. ఏమంటావు అభీ?" అంటూ అతని కళ్ళలోకి సూటిగా చూసింది.

అభి ఆమె కళ్ళలో కళ్ళు పెట్టి చూడలేకపోతున్నాడు. అతని ముఖంలో గాబరా, కంగారు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"అదే కరెక్ట్. ఐ యామ్ సారీ ఆశ్లేషా. నేను వెళ్ళాలి. మిరకిల్ హాస్పిటల్ ఎమ్‌డితో అపాయింట్మెంట్ ఉంది" అంటూ ఆమె మాటకోసం ఎదురుచూడకుండా పైకి లేచాడు.

ఆశ్లేష అతన్ని ఆపే ప్రయత్నం చేయలేదు. అతన్నే అనుమానంగా చూస్తూ ఉండిపోయింది.

గంట తర్వాత గాని మెహర్ బాబా స్పృహలోంచి బయటకు రాలేకపోయాడు. మగతగా కళ్ళు తెరిచిన మెహర్ బాబా భుజం మీద చేయి వేసి ఆప్యాయంగా నిమురుతూ, "అంకుల్! ఎలా ఉందిప్పుడు?" అంటూ ఆదుర్దాగా ప్రశ్నించింది.

నీరసంగా నవ్వి, "నాకు బాగానే ఉందమ్మా! అమ్మయ్య... నువ్వు క్షేమమే కదా?" అన్నాడు సంతృప్తిగా ఆమెనే చూస్తూ.

"కాఫీలో ఏమి కలిపారో తెలియకుండా ఎలా తాగేసారంకుల్? అందులో విషం ఉంటే?" అంటున్న ఆమె కళ్ళలో భయం స్పష్టమవుతుంది.

“ఆ హడావిడిలో అదేమీ ఆలోచించలేదమ్మా. నా కన్నకూతురే ప్రమాదంలో ఉన్నట్లు అనిపించింది” అనగానే, అతని పట్ల ఆశ్లేషకి అభిమానం పొంగిపొరలింది.

“కాస్త ముఖం కడుక్కొని రండి. వేడి కాఫీ తాగాక అన్ని విషయాలు చెబుతారు గాని” అనగానే తలూపి పైకి లేచాడు మెహర్ బాబా.

“ఇప్పుడు చెప్పండి అంకుల్” అంది కాఫీ అందిస్తూ.

కాఫీ తాగడం పూర్తయ్యాక, చెప్పడం మొదలుపెట్టాడు.

“అభికి అడ్డుపడ్డ సెక్యూరిటీ గార్డుకి షేక్‌హ్యాండ్ ఇచ్చినప్పుడు రహస్యంగా ఐదొందల రూపాయల నోటు, అతని చేతిలో ఉంచడం, నా కంటపడింది. కేవలం ఇరవై అడుగుల దూరంలో ఉన్న పార్కింగ్ ఏరియాలో, కారు పార్క్ చేసి రావడం పెద్ద కష్టం కాదు ఎవరికైనా. కానీ లంచం ఇచ్చి, అభి తన కారుని రెస్టారెంట్‌కు చాలా దగ్గరలోనే ఉంచాలనుకోవడం, నాలో అనుమానం రేకెత్తించింది. ఎందుకో ఇప్పుడు అర్థమౌతోంది. కాఫీ తాగి నువ్వు స్పృహ కోల్పోయిన తర్వాత, నీకు ఒంట్లో బాగోలేదని అందరినీ నమ్మించి, నిన్ను కారులో ఎక్కించడానికి అనువుగా ఉంటుందని, కారు అక్కడ పార్కు చేసాడు! సరే. ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. ఎప్పుడైతే అతని మీద అనుమానం వచ్చిందో, అప్పటినుంచి అతనిమీద దృష్టి పెట్టాను. అభి, వాష్‌రూమ్ లోకి వెళ్ళగానే, చేస్తున్న పని ఆపి జోసెఫ్‌కూడా వాష్‌రూమ్‌లోకి వెళ్ళి, రెండు నిమిషాల్లో తిరిగి రావడం గమనించాను. బహుశా అభి, కాఫీలో కలపమని ఏదో మందు ఇచ్చి ఉంటాడు. అయితే నేనతన్ని గమనిస్తున్నానన్న విషయం జోసెఫ్ పసిగట్టాడు. అయినా బయటపడకుండా బింకంగా ఉండడానికి ప్రయత్నించాడు. కాఫీ ట్రేతో బయలుదేరిన జోసెఫ్ నా టేబుల్‌ని దాటుకునే మీ టేబుల్ దగ్గరికి రావాలి. అతను నా టేబుల్‌ని సమీపించగానే, “ఏయ్ మిస్టర్ ఇలారా!” అంటూ అతన్ని పిలిచేసరికి చాలా కంగారు పడిపోయాడు. తడబడుతూ, “సార్! మీ టేబుల్ దగ్గర సర్వ్ చేయడానికి వేరేవాళ్ళు వస్తారు” అంటూ హడావిడిగా ముందుకు నడవడంతో, నా అనుమానం నిర్ధారణ అయింది. నీకు ఎంత చెప్పినా వినకపోయేసరికి, నేనే నీ కాఫీ తాగాల్సి వచ్చింది. నువ్వు ఏమీ వర్రీ అవ్వకు. ఆ కాఫీ బిల్లు నేనే చెల్లిస్తాను” అంటూ బిగ్గరగా నవ్వడంతో, అంతవరకు ఎంతో గంభీరంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా తేలికైంది. ఆ జోక్‌కి అందరూ హాయిగా నవ్వారు.

“ఎంతో పెద్ద ప్రమాదం నుంచి నన్ను కాపాడారు. ఆ నీచుడు నాకు మత్తిచ్చి, ఏం చేసేవాడో తలుచుకుంటేనే, గుండె గుభేలుమంటుంది. ఎన్ని జన్మలెత్తినా మీరు ఋణం తీర్చుకోలేను” అంటుంటే ఆమె కళ్ళలో తడి తొంగి చూసింది.

“బాగా చదువుకున్నదానిలా ఉన్నావు. వాడి వలలో ఎలా పడిపోయావు? అంతకన్నా మంచివాళ్ళెవరూ నీకు తారసపడలేదా?” అని అడిగాడు.

చిన్న నవ్వు నవ్వి, ”మీ పెద్దవాళ్ళు అంటూ ఉంటారే “ప్రారబ్ధం” అని. నా విషయంలోనూ అదే జరిగింది. రెండేళ్ళ క్రితం అశోక్‌తో ప్రేమలో పడ్డాను. ఇద్దరం ఒకే ఫ్లాట్‌లో ఉన్నాం ఏడాది పాటు. “లివింగ్ టుగెదర్” అంటారే, అలా...” అని చెబుతుంటే, షాక్ తిన్నట్లుగా చూశాడు.

"అంటే సహజీవనమన్న మాట. పెళ్ళి కాకుండానే సంసారం చేసేశారా?" అంటూ విస్తుపోయాడు.

"అయ్యో అంకుల్! అలా షాక్ తిన్నారేమిటి? ఈ రోజుల్లో ఇది చాలా కామన్. మీ తరం వేరు. మా తరం వేరు. మీ తరంలో అయితే అమ్మానాన్న చెప్పిన మాట విని, ఇష్టం ఉన్నా లేకపోయినా, పెళ్ళిచేసుకొని, నిరర్థకమైన జీవితాన్ని గడపాలి."

"సరే. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, కొంతకాలం ఇద్దరూ కలిసి ఉంటారు. ఆ తర్వాత ఇద్దరికీ నచ్చలేదని తెలిస్తే, అప్పుడు ఏం చేస్తారు?" కుతూహలంగా అడిగాడు.

"ఏముంది? బ్రేకప్. మా విషయంలోనూ అదే జరిగింది. అశోక్, నేను విడిపోయాం, ఏడాది తర్వాత!" అంది, అదేదో మామూలు విషయమన్నట్లు.

అయోమయంగా చూసాడు మెహర్ బాబా.

"ఆ తర్వాత మరో ఏడాది పాటు, దేని గురించి ఆలోచించలేదు. రెండునెలల క్రితం ఎవరో ఫ్రెండ్ ద్వారా పరిచయం అయ్యాడు అభి. లివింగ్ టుగెదర్ కాన్సెప్ట్ మీద నమ్మకం పోయాక, అతనితో ప్రేమలోనే ఉన్నాను తప్ప, హద్దులు మీరలేదు. సహజీవనం చేస్తూ, ఇద్దరం కలిసి జీవించే అవకాశం లేదని తెలుసుకున్నాకే, ఈ నాటకం ఆడాడని ఇప్పుడు తెలుస్తుంది!" అంటూ ముగించింది.

"మా తరంలో ఆడపిల్లలకు స్వేచ్ఛ ఉండేది కాదు. దానివల్ల నష్టపోయిన సందర్భాలు చాలా అరుదు. కానీ ఈ తరం యవత స్వేచ్ఛను పూర్తిగా అనుభవిస్తున్నారు. కాదు. కాదు. దుర్వినియోగం చేస్తున్నారు. దానికి నువ్వే ఉదాహరణ! మన భారతీయ సంస్కృతి ఎంతో పవిత్రమైనది. పాశ్చాత్య విష సంస్కృతి పట్ల ఆకర్షించబడి, పెడదారులు తొక్కి, నీలా ఎందరో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పెద్దవాడిగా ఒక సలహా చెప్తాను విను! మీ నాన్నగారితో మాట్లాడి, వారు కుదిర్చిన సంబంధాన్నే చేసుకో! ఇందాక అన్నావు చూడు, ఎన్ని జన్మలెత్తినా నా ఋణం తీర్చుకోలేనని. ఈ జన్మలోనే ఋణం తీర్చుకోవచ్చు. నా మాట విని, మీ అమ్మానాన్న చెప్పిన అబ్బాయిని పెళ్ళిచేసుకుంటే నా ఋణం తీర్చేసినట్లే! అవకాశం ఇచ్చావు కదా అని, ఎక్కువగా మాట్లాడాను. ఏమీ అనుకోవద్దు. ఇకనైనా మంచిమార్గంలోకి మారు తల్లీ. నిన్నింతగా బలవంత పెట్టడానికి ఒక బలమైన కారణముంది" అంటూ పర్సులోంచి ఒక ఫోటో తీసి, ఆమెకందించాడు.

ఆ ఫోటోలో ఉన్న అమ్మాయికి, తనకీ చాలా పోలికలు ఉండడంతో ఆశ్చర్యంగా చూసింది ఆశ్లేష.

"మూడేళ్ళ క్రితం కారు ప్రమాదంలో మరణించిన నా కూతురు, శ్రావణి" అంటూ కన్నీళ్ళు కారుస్తున్న మెహర్ బాబాని చూసి కదిలిపోయి, అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వచ్చింది.

"తప్పకుండా మీరు చెప్పినట్లే చేస్తాను. మీరు నాకు దేవుడి కన్నా ఎక్కువ. నాలో మీ అమ్మాయిని చూసుకుంటున్నారని అర్థమైంది. మీ తృప్తి కన్నా నాకేదీ ఎక్కువ కాదు" అని అనేసరికి, మెహర్ బాబా ముఖం ఆనందంతో వికసించింది.

# బంగారు కిరీటం

బాల కథ

తేజశ్రీ
✆ 89197 73272

***"ప్రభూ! మీరు ధరించిన ఈ కిరీటం మా పులిరాజుది. మా అడవిలో నక్క అనేక మోసాలు, దొంగతనాలు చేయటం వలన పులిరాజు దాన్ని అడవి నుంచి బహిష్కరించాడు. అది వెళ్తూ వెళ్తూ... మా పులిరాజు కిరీటాన్ని దొంగిలించి పారిపోయింది. ఆ కిరీటం మీ వద్ద ఉన్నదని తెలిసి ఇక్కడికి వచ్చాను!"***

ఒక అడవికి రాజు సింహం. దానికి పొగడ్తలంటే చాలా ఇష్టం. సింహాన్ని పొగిడితే చాలు ఎంత కోపంలో ఉన్నా వెంటనే చల్లబడేది.

ఒక నక్క రత్నాలతో పొదగబడిన బంగారు కిరీటాన్ని తీసుకుని సింహం దగ్గరకు వచ్చింది. "ప్రభూ! మీ అంత అందగాడు, బలవంతుడు, తెలివిగలవాడు, ధైర్యశాలి, దయామయుడు. ఈ చుట్టుపక్కల అడవుల్లో ఎక్కడా లేరని విని, పక్క అడవి నుంచి ఇక్కడికి వచ్చాను. నాకు మీ కాళ్ల దగ్గర ఇంత చోటు యిస్తే, మీ సేవకుడిగా ఇక్కడే పడివుంటాను!" అంది నక్క .

పొగడ్తలకు పొంగిపోయిన సింహం, నక్క బుట్టలో పడి, వెంటనే అంగీకరించింది. సింహం తినగా మిగిలిన ఆహారం తింటూ కాలక్షేపం చేయొచ్చని సంబరపడింది నక్క.

మృగరాజు శిరస్సుపై బంగారు కిరీటాన్ని అలంకరిస్తూ "ప్రభూ! దీన్ని మా పులిరాజు కోసం చేయించాను. కానీ, ఈ కిరీటం మీ శిరస్సు మీద ఉంటే ఈ కిరీటానికే అందం. అందుకే దీన్ని మీకు బహూకరిస్తున్నాను! స్వీకరించండి!" అంది.

పక్కనే నీటిలో తన ప్రతిబింబంను చూసుకుని, కిరీటంతో తన అందాన్ని చూసుకుని మురిసిపోయింది సింహం.

నెత్తిన కిరీటం అలంకరించుకోవడంతో జంతువును వేటాడేటప్పుడు అడ్డు వస్తుండేది.

పక్క అడవినుంచి వచ్చిన నక్క, సింహాన్ని పొగిడి సులువుగా తన పరివారంలో చేరటం గమనించాయి అడవి జీవులు. తాము కూడా సింహం బలహీనత మీద కొట్టి తప్పించుకోవచ్చని గ్రహించాయి. ఒకరోజు మృగరాజు జింకను పరిగెత్తించి, పరిగెత్తించి వేటాడసాగాడు.

జింక పరిగెత్తి అలిసిపోయి "ప్రభూ! మీ నెత్తిన కిరీటం ఎంతో హుందాగా ఉంది. ఈ చుట్టుపక్కల అడవుల్లో నేను ఇంతవరకు మీలాంటి గొప్ప రాజును చూడనే లేదు!" అంది. పొంగిపోయిన సింహం జింకను వదిలేసింది.



మరోరోజు అడవిదున్నను వెంబడించి వేటాడసాగింది సింహం. అడవిదున్న సింహం నుంచి తప్పించుకుని అలసట తీర్చుకుంటూ "రాజా! మీరు ధరించిన కిరీటం రాజులకే కాదు... దేవతలకు కూడా లేదు! నాకు దేవుడికే దేవుడిలా కనిపిస్తున్నారు!" అంది.

దాంతో... తబ్బిబ్బైపోయిన సింహం అడవి దున్నను అక్కడే వదిలేసి వెళ్లిపోయింది.

ఇలా ఏ జంతువు పొగిడినా దాన్ని చంపకుండా వదిలేయడంతో నక్కకు ఆహారం దొరకటం కష్టమైంది. సింహం ఆకలైతే తప్ప, ఏ జంతువు జోలికి పోవటం లేదు. పొగడగానే వాటినీ వదిలేస్తుంది.

ఆకలి బాగా ఉన్నప్పుడు, అప్పటికి దొరికినదాన్ని ఆసాంతం తినసాగింది. చివరికి నక్కకు బొచ్చు, బొక్కలే మిగిలేవి. సరైన సమయం చూసి బంగారు కిరీటం అందుకుని, మరో అడవికి పారిపోవాలనుకుంది.

ఒకరోజు పక్క అడవి నుంచి మంత్రి ఏనుగు రావటం నక్క గమనించింది.

మృగరాజును కలిసిన ఏనుగు, "ప్రభూ! మీరు ధరించిన ఈ కిరీటం మా పులిరాజుది. మా అడవిలో నక్క అనేక మోసాలు, దొంగతనాలు చేయటం వలన పులిరాజు దాన్ని అడవి నుంచి బహిష్కరించాడు. అది వెళ్తూ వెళ్తూ... మా పులిరాజు కిరీటాన్ని దొంగిలించి పారిపోయింది. ఆ కిరీటం మీ వద్ద ఉన్నదని తెలిసి ఇక్కడికి వచ్చాను!" అంది ఏనుగు.

ఆ మాటలకు మృగరాజు సింహం ఆశ్చర్యపోయింది.

దొంగ సొమ్ము నెత్తిన పెట్టి, దొంగను చేసిన నక్క కోసం వెతికించాడు మృగరాజు.

కానీ అప్పటికే అడవిని వదిలి, మరో అడివి దిక్కు పరుగు తీసింది.

"మిత్రమా! నన్ను క్షమించు! కొత్తగా వచ్చిన నక్క గురించి ముందూ, వెనుక విచారించకుండా చేరదీయటమే కాకుండా, కానుకను స్వీకరించటం నా తప్పే!" అంటూ, కిరీటాన్ని ఏనుగుకు తిరిగి యిచ్చింది సింహం.

'మనల్ని ఎప్పుడూ పొగిడే వారిపై ఓ కన్నేసి ఉంచాలి. లేకుంటే ఇబ్బందుల్లో పడే ప్రమాదముందని గ్రహించి... పొగడ్తలకు పొంగిపోవటం మానేసింది సింహం!

# జ్ఞానం పంచుకోవాలి

బాల కథ

కంచనపల్లి వేంకట కృష్ణారావు
✆ 9348611445

***"రాజా... ఈయన మహదేవపురం రాజావారి ఆస్థాన వైద్యుడు. ఈయనకి మొండి రోగాలు నయం చేసే అపార జ్ఞానం ఉంది ఈయనతో నాకు పరిచయం ఉంది, అందుకే క్షణాల్లో సేనాధిపతికి వచ్చిన రుగ్మతను గమనించి మంచి మూలికలను సూచించాడు. నాకు తెలియని అనేక వైద్యవిధానాలు, మూలికలు ఆయనకు తెలుసు! ఆయన వద్దనుండి మన రాజ్యంలోని వైద్యులు అనేక విషయాలు తెలుసుకోవాలి.***

మహదేవపురం రాజు ధర్మపాలుడు న్యాయబద్ధంగా పరిపాలిస్తూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నాడు.

తన పొరుగురాజ్యం విదేహపురం రాజు విషోత్తముడు విలాసాల్లో మునిగి తేలుతూ ప్రజల సంక్షేమం గాలికి వదిలేశాడు. అందుకే ఆయనకు ప్రజల్లో చెడ్డపేరు.

మహదేవపురం ధర్మపాలుని పరిపాలనలో రాజ్యం మూడు పువ్వులు ఆరుకాయలుగా అభివృద్ధి చెందతుండటం చూసి విషోత్తముడు, మహదేవపురం ఆక్రమించి ఆ రాజ్య సంపదను కొల్లగొట్టాలని ప్రణాళిక రచింపసాగాడు. చారుల ద్వారా ఈ విషయం ధర్మపాలునికి తెలిసింది. దీనికి ఆయన చాలా బాధపడ్డాడు.

వెంటనే తన మంత్రులతో చర్చించి, శాంతిని వాంఛిస్తూ ఉభయదేశాల మేలు కోరుకుంటూ, ఒక లేఖ తయారు చేయించాడు. యుద్ధం వలన అపార ప్రాణనష్టం, ధననష్టం జరిగి అభివృద్ధి కుంటుపడుతుందని, ఇది రెండు రాజ్యాలకి నష్టం అని విపులంగా ఆ లేఖలో వివరించాడు.

మరి ఆలేఖను విషోత్తముడికి చేర్చాలంటే నమ్మకమైన సుమంతుడు అనే దూతకి అప్పగించాలని ధర్మపాలుడు నిర్ణయించాడు.

అలా మంత్రులతో చర్చించి, సుమంతుడికి వివరించాలని అతడిని పిలవడానికి ఒక భటుణ్ణి సుమంతుని ఇంటికి పంపించాడు.

ఓ గంట తరువాత ఆ భటుడు వచ్చి, సుమంతునికి నలతగా ఉందని ప్రస్తుతం రాలేనని చెప్పాడని చెప్పాడు. ఈ మాట భటుడు చెబుతున్నప్పుడే రాజవైద్యుడు చరకవర్మ అక్కడికి వచ్చాడు. రాజు సుమంతుని నలతను గురించి చెప్పి, అతనికి మంచి మందు ఇవ్వమని చెప్పి చరకవర్మను సుమంతుడి ఇంటికి పంపాడు.

సుమంతుడికి మంచి మందు ఇచ్చి, కొద్దిరోజుల్లోనే కోలుకునేట్టు చేశాడు చరకవర్మ. ఈ విషయం రాజుగారికి వివరించాడు చరకవర్మ.

"ఒక ముఖ్యమయిన విషయాన్ని గురించిన లేఖ... విదేహపురం రాజుకి సుమంతుని ద్వారా పంపాలనుకున్నాను" అన్నాడు రాజు.

"మహారాజా తమరు ఈ విషయం మీద చింతించకండి. ఈ రోజే నేను విదేహపురం వెళ్ళి లేఖ అందించి, ఒకవేళ ఆయన లేఖ ఇచ్చినా, మీకు ఏదైనా విషయం చెప్పమన్నా చెబుతాను!" చెప్పాడు చరకవర్మ.

చరకవర్మ సమర్థత మీద నమ్మకం ఉన్న రాజు, ధర్మపాలుడుకి ఇవ్వవలసిన లేఖను, ఆయనకు ఇచ్చి పంపాడు.

చరకవర్మ విదేహపురం వెళ్ళి, అక్కడి ద్వారపాలకుడికి తాను మహదేవపురం నుండి వచ్చిన దూతనని చెప్పి రాజుగారికి విషయం తెలపమని చెప్పాడు.

దూత కాబట్టి లోపలికి పిలిచాడు విషోత్తముడు, ఆ లేఖను రాజుకి ఇచ్చాడు.



లేఖ చదువుతున్నంతలో... అపుడే అక్కడికి వచ్చిన సేనాధిపతి, ఏదో చెప్పబోతున్నంతలో అతనికి కళ్ళు తిరిగి తూలి పడబోయాడు. వెంటనే రాజు, చరకవర్మ అతనిని పట్టుకుని జాగ్రత్తగా కుర్చీలో కూర్చోబెట్టి రాజవైద్యుడిని వెంటనే పిలవాలని, అక్కడే ఉన్న భటుడికి చెప్పాడు. భటుడు పరుగున వెళ్ళి రాజవైద్యుడిని పిలుచుకు వచ్చాడు.

వచ్చిన రాజవైద్యుడు చరకవర్మను చూసి ఆశ్చర్యంతో నమస్కారం చెప్పాడు. వచ్చిన రాజవైద్యుడికి చరకవర్మ ఓ మూలిక పేరు చెప్పి దానికి కలపాల్సిన మరో మూలిక పేరు చెప్పాడు. అలా చెబుతుండటం చూసి విషోత్తముడు ఆశ్చర్యపోయి “మీకు వైద్యం తెలుసా?” అని ప్రశ్నించాడు.

“రాజా! ఈయన మహదేవపురం రాజావారి ఆస్థాన వైద్యుడు. ఈయనకి మొండి రోగాలు నయం చేసే అపార జ్ఞానం ఉంది. ఈయనతో నాకు పరిచయం ఉంది, అందుకే క్షణాల్లో సేనాధిపతికి వచ్చిన రుగ్మతను గమనించి మంచిమూలికలను సూచించాడు. నాకు తెలియని అనేక వైద్యవిధానాలు, మూలికలు ఆయనకు తెలుసు! ఆయన వద్దనుండి మన రాజ్యంలోని వైద్యులు అనేక విషయాలు తెలుసుకోవాలి!” చెప్పాడు రాజవైద్యుడు.

అతని మాటలు విని, ఎందుకైనా మంచిదని మరొక్కమారు ఆ లేఖ చదివాడు. అతనికి జ్ఞానోదయం అయింది. ‘నిజమే యుద్ధాలతో అపారనష్టం కలిగించే బదులు, ఒకరి జ్ఞానం మరొకరు పంచుకుంటే, జ్ఞానం మరింత పెరుగుతుంది. ఇరు రాజ్యాల ప్రజలు సుఖపడతారు. శాంతి వెల్లివిరుస్తుంది’ అని ఆలోచించి లేఖలోని మంచిని అర్థం చేసుకుని, తాను కూడా శాంతి, సౌభాగ్యం వివరిస్తూ... ఓ లేఖను వ్రాసి లేఖను కొన్ని బహుమతులను చరకవర్మకు ఇచ్చి ధర్మపాలునికి ఇవ్వమని చెప్పాడు.

లేఖ చదివిన ధర్మపాలుడు సంతోషంతో అనేక కృతజ్ఞతలు తెలుపుతూ ఇరు రాజ్యాల మధ్య మరింత అవగాహన, శాంతి పెరుగుతాయని వాంఛిస్తూ మరోలేఖ పంపాడు.

విషోత్తముడి వైఖరిలో ఎంతో మార్పు వచ్చి విదేహపురం ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నాడు.

# నిర్మోహదర్పణం

శ్రీమతి జలంధర
✆ 9962915851

**విశిష్ట అతిథి కథ**

*"నువ్వు నేర్చుకున్నది నిజాయితీగా, నీ అహం పరదాలు వెయ్యకుండా రాసినందుకు ఆశీస్సులు. ఈ నేర్చుకునే స్థితిలోని 'రససిద్ధి' నీకు అనుభవమయినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. నీ కథలో కొన్ని కొన్ని ప్రశ్నలకు సమాధానం వెతుక్కుంటూ ప్రపంచం మీదికి విసిరేశావు. అది మంచి పద్ధతి. నాకు తోచిన జవాబు చెప్తున్నాను విను! మనం ప్రపంచం నుంచి ఏదీ ఆశించకుండా, దూరంగా ఉండి చెయ్యగలిగిన పని చేస్తూ ఉంటే, ప్రపంచం మన పాదాక్రాంతం అవుతుంది. అదే దాస్యవిముక్తి!*

"ఆ చిన్న పారాగ్రాఫ్ తీసేస్తే ఏమిటిట వచ్చిన ముప్పు?" కాలమ్స్ లెక్కకూ, ఎడిటోరియల్ తెలివితేటలకూ అలవాటు పడిన జనార్దన్ ప్రశ్నించాడు విశ్వాన్ని.

తలకాయ ఎత్తి చూశాడు విశ్వం. అది మామూలు చూపు కాదు. ఆ దృక్కు చాలా స్పష్టంగా వుంది. అర్థం చేసుకోనందుకు బాధ కన్న, ఆ నిర్లక్ష్యం చూసి బాధతో పడే కోత వుంది.. దుఃఖం వుంది. అది మాత్రం శబ్దాలకు అర్థం అయ్యే విషయం కాదు.

మాట్లాడకుండా చూపు తిప్పుకున్నాడు జనార్దన్. అంత 'తడి' తెలియని మనసు కాదు అతనిది. అదే అయ్యుంటే.. ఇన్ని బాధలున్న ఈ ఎడిటోరియల్ ఉద్యోగమే అక్కర్లేదు బ్రతకడానికి! కానీ, 'కొలతలలో ఇమిడిపోయి, సుఖంగా బ్రతికే జీవితంలోకి అనవసరమైన ధోరణులు చొప్పించుకుని ఎందుకు బాధపడడం?' అనే అతను.. ఈ దేశంలో పేరుకుపోయిన మేధావి వర్గానికి ప్రతీక!

ఒక మహా రచయిత తెలియచెప్పినట్లు.. ఈ దేశంలో మంచివారు, బుద్ధిమంతులు, కరుణాజీవులు.. వీరందరూ మామూలు మనుష్యులుగా పుట్టి పోతారు. వారు ఏదైనా చెయ్యాలనుకున్నా వారి ఆలోచనలు ఆచరణలో పెట్టలేని స్థితిలో, ఉద్యోగాల్లో వుంటారు. మేధావులు, ఉన్నత స్థానంలో వుంటే, అధికారులూ వీరందరూ సినిక్స్. నిజాయితీ మీద నమ్మకం లేనివారు, సత్ప్రవర్తనమీద, ధర్మం మీద ఏదో పలచటి అభిప్రాయం కలిగినవారు అవుతున్నారు. అందువల్ల వీరు దేశానికీ, వర్తమానానికీ ఉపయోగపడరు. అందుకే ప్రోగ్రసివ్ మీటింగ్స్ మేధావి వర్గం వుండే చోట కూడా బొంబాయిలో 'కాంక్రీట్




జంగిల్' లో వుండే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో అనుభవంలోకి వచ్చే ఏదో ప్రతిష్టంభన. అక్కడ స్వార్థం డామినేట్ చేస్తే, ప్రోగ్రెసివ్ మేధావి వర్గంలో 'అహం' డామినేట్ చేస్తుంది. అందుకే 'రసం' ఎక్కువై నిశ్శబ్దత పలచబడిపోతుంది. ఊహ నిట్టూరుస్తుంది. తపన తమస్సులోకి జారుకుంటుంది.

పక్కనే టైపిస్టు అమ్మాయి వేళ్ళు చేసే ఒక వింత చప్పుడు. క్యూటెక్స్ వేసిన వేళ్లు, నరాలు ఉబ్బిన

ముంజేతులూ, ఏదో ఫెమినిటీకి దూరం చేస్తున్నాయి.

"అలౌకితకు అర్థం ఇంగ్లీషు ఏమిటి సార్?" పొట్టి కురచగా బిగించిన జడతో, పావలా అంత బేసరితో అడుగుతోంది ఒక అమ్మాయి.

"ఇంగ్లీషు అర్థం సంగతి భగవంతుడెరుగు. అసలు దాని అర్థం నువ్వు కాదు, ఆ టైపిస్టు కాదు, మీరందరూ ఉన్న వాతావరణం కాదు" అనాలని వుంది విశ్వానికి. ఒళ్ళు మండిపోతోంది.

ఏనాడో చాలా ఉద్వేగాలతో, ఆదర్శాలతో, సౌందర్య విభ్రాంతులతో జర్నలిజం, రచనా వ్యాసంగంలోకి ప్రవేశించిన అతనికి, ఏ ఫీల్డ్ వాటి ఉత్పత్తికి కారణమో, అందులో బొత్తిగా అవి తీవ్రతని అర్థమయ్యేటప్పటికి కాలాతీతం అయిపోయింది. అందుకే సినీకవిగా మారిపోయాడు ఇంతకాలం.

ఒక కథా సంపుటి ముందు మాటలో వ్యక్తీకరించినట్టు 'రచన కూడా ఒక వ్యాపారం అయ్యాక ఎవరు ఆర్తితో, ఆర్ద్రతతో మనసా స్పందిస్తారో, ఎవరు స్పందనను నటించి లబ్ధి పొందుతున్నారో తేల్చుకోవడం కష్టం..' ఈ విషయం అర్థం అయిన తరువాత, ఈ ముడి పదార్థాల వ్యాపారం ఏమాత్రం నిజాయితీ వున్నవాడి కన్నా విసుగు పుట్టిస్తుంది.

"అందుకే కత్తులకూ, రక్తానికీ, తుపాకీ గుళ్ళకూ.. ఆర్ద్రత, ప్రేమ, స్పందన, మాట్లాడవు. కాబట్టి హాయిగా నిజాయితీగా క్రైం సీరియల్ వేసుకుందాం. ఈ తద్దినం ఎవరు పడతారు?" అనే జనార్ధన్ మాటలు చాలా కరెక్ట్ అనిపించేది.

అందుకే విశ్వం అతి మామూలు రైటర్‌గా, ఎడిటర్‌గా మారాడు. కానీ, మరీ నైచ్యాన్ని భరించవలసి వచ్చినప్పుడు మనిషిలో లౌక్యానికీ, అవసరానికీ, అందమైన భావన బలైపోయినప్పుడు మాత్రం ఏదో అనుభూతుల వంతెన కూలిపోయినట్లు అనిపించేది విశ్వానికి. ఏదో ఉత్తుంగ తరంగంలాంటి అలజడి గుండెల్లో లేచినప్పుడు, కృష్ణ ఒడ్డున పిచ్చిగా పెరిగిన బంతిపూల అరణ్యంలో కూర్చుని ఏ చలం మ్యూజింగ్స్, తిలక్ సౌందర్యాక్షరాలో కుప్పగా పోసుకుని ఆ భావనా వీధిలో ఒళ్ళు తెలియకుండా నిద్ర పోయేవాడు. కానీ, అది ఏ కొద్ది సేపో... మళ్ళీ జీవితం చాలా మామూలు తనం అనే సంకెళ్లు వేసి. బందీని చేసి లాక్కుపోయేది.

తన చుట్టుపక్కల వాతావరణంలో, ఆలోచనలలో ఏదో ప్రతిష్టంభన. వున్నవాడి కళ్లల్లో కక్కుర్తి, లేనివాడి కళ్లల్లో దేబిరింపు... ఇవన్నీ వాతావరణంలో కలిసిపోయి ఏదో ఊపిరాడని తనాన్ని కలిగిస్తోందనిపించేది. తుప్పల మధ్య, ముళ్ల పొదల మధ్య, తడి, చీదరల మధ్య, చీకటి వెలుగుల మధ్య పాకుతూ, మునగదీసుకుంటూ, వీలైనప్పుడు బారుసాగుతూ, మళ్ళీ మెలికలు తిరుగుతూ, ఎవరో తరుముకు వస్తున్నట్లు చరచర గమ్యం లేకుండా సాగుతున్న పసిరిక పాములా వుంది జీవితం.. అని విశ్వం విసుక్కున్నప్పుడల్లా నవ్వి, "అసలు ఆలోచిస్తే కదా ఈ బాధంతా" అనేవాడు జనార్దన్.

అటువంటి విశ్వం.. "మనిషి భావనా బలం, చాలా బలవత్తరమైనప్పుడు, చుట్టూ పంచభూతాత్మకమైన వాతావరణం యొక్క రాపిడిని, వత్తిడిని జయించి, దాని లయతో లయించినప్పుడు, చుట్టూ పరిస్థితిని మార్చుకోగలదు. కొంచెం ఎదిగితే... ఈ భావనను అనుభవించవచ్చును. ఎదటివారితో పంచుకోవచ్చును..." అని ఒక కథకు ముగింపు రాసినప్పుడు... ఏమాత్రం ఆలోచించకుండా అనుకున్నదాని కన్నా కాలం దాటిందని ఈ పారాగ్రాఫ్ కత్తిరించాడు జనార్దన్.

అందుకే "ఈ కాస్త దానికి ఇంత పట్టుదల ఏమిటి?" అని జనార్ధన్ ఆశ్చర్యపోతూ అడిగితే.. ఎలా చెప్తాడు విశ్వం?

ఎంత రాసినా.. అక్షరాలు ఇముడ్చుకోలేని ఉద్వేగత, భావం పొంగి In between the lines వెలుగుతూ కనిపిస్తాయని, వ్యాఖ్యానించలేమని తెలిసిన విశ్వం ఎలా చెపుతాడు. తనలో చలనాన్ని, మార్పునీ, ఉగ్వేగాన్ని!

అందుకే సహనంగా, మెల్లిగా జరిగింది చెప్పడం ప్రారంభించాడు.

★★★

ఒక స్నేహితుడి పుట్టిన రోజుకు మంచి పుస్తకాలు ఇద్దామన్న ప్రయత్నంలో వున్నాడు అతను.

ఆ రోజు, ఎక్కడా బలివాడ కాంతారావు కానీ, ఇచ్ఛాపురపు జగన్నాథరావు కానీ, బుచ్చిబాబు, చలం కానీ.. దొరకరేమో కానీ, కవిత్వం చెప్పడం కూడా కీర్తి కండూతి తీరడానికి ఒక మహత్తర ఆయుధమని భావించే డబ్బున్న కుహనా మేధావుల చేత అచ్చొత్తబడి, విపరీతమైన కమిషను ఇవ్వబడ్డ పుస్తకాలు మాత్రం చాలా దర్శనమిచ్చాయి. పుస్తకాల షాపులో కొన్నేళ్ల తరువాత, అసలు ఈ మహా రచయితలు ఎవరో తెలియకుండా మరుగుపడిపోయి, ఈ సాహిత్యమే తెలుగు సాహిత్యం అనుకునే స్థితే ఇంగ్లీషు మీడియంలో చదువుతూ, బలవంతంగా తెలుగు నుడికారాలు నేర్చుకునే తెలుగు పిల్లలకు గతేమో... అని ఆలోచిస్తూ, విసుక్కుంటూ, ఆఫీసుకు రాగానే.. పత్రిక ఓనరుగారికి ఫ్యూచర్‌లో పనికివచ్చే రాజకీయవేత్త కవి అయ్యాడట. వారిని 'ఇంటర్వ్యూ' చెయ్యమని ఆర్డర్! చిర్రెత్తింది విశ్వానికి.

"జీవి వేరు... జీవితం వేరు..." చేతులో గ్లాసుతో ఖద్దరు బట్టలతో ఉవాచిస్తున్నాడు.. ఈ జన్మలో నిజమైన కవి కాలేని ఆ రాజకీయవేత్త.

"అవును... జీవివేరు... జీవితం వేరు! .రాసుకుంటున్నారా? నేను చెప్పబోయే ఈ కవిత్వంలో మీకు చాలా పాత కవుల ఫెమిలియర్ మాటలు వివబడతాయి. కానీ, వాటిని నా సొంత సహృదయంతో కవిత్వంగా మారుస్తానన్న మాట. ఆహా ఏం చెప్తున్నాను? జీవి వేరు... జీవితం వేరు. ఒకటి మనది.. మరొకటి మనదా? మనలో వుండేదా? ఆలోచించు అనే తత్వం చెబుతుందన్నమాట నా కవిత్వం..."

అంటూండగానే చిర్రెత్తి. "అవును... జోలె మనది, ముష్టి మరొకరిది.. ఆలోచనలు మరొకరివి, అక్షరాలు కత్తిరింపులు మాత్రం మనవి... వేసే వాడికి జోలె మీద క్లైం లేదు. ముష్టి తీసుకునేవాడికి మాత్రం జోలె మీదా, ముష్టి మీదా కూడా క్లైం" అన్నాడు కచ్చగా.

కానీ, విశ్వం రాసే ఇంటర్వ్యూ విలువ తెలిసిన ఆ లౌక్యుడు "ఎంత గొప్ప ఉపమానం చెప్పారండీ..." అంటుంటే దుఃఖం వచ్చి, ఏదో కారణం చెప్పి బయటపడి చేతులో కాగితాలు చించి కృష్ణలో పడేసి, నడుచుకుంటూ పడిపోయాడు ఒడ్డునే.

మొత్తానికి ఆ క్షణంలో ప్రపంచం అంతా చాలా అవకతవకగా, అర్థంకాని ముగ్గులా, ఏదో బ్లాకు మర్చిపోయిన క్రాస్‌వర్డ్ పజిల్లా విసుగు పుట్టిస్తోంది అతనికి!

కాస్త దూరంలో ఏటిపాయకు ఒడ్డున సూర్యం మాష్టారి ఇల్లు.

ఒద్దనుకుంటూనే అడుగులు అటు వేశాడు. ఎందుకో సూర్యం మాష్టార్ని చూడాలంటే జంకు! ఆయన కొన్నాళ్లు స్కూలు మాష్టారు, కొన్నాళ్లు పత్రికలో పనిచేశారు. చెయ్యి తిరిగిన గొప్ప జర్నలిస్టు. మంచి విమర్శలు రాసేవారు. బాధ్యతలకు, అప్పులకు సత్యనారాయణపురంలో ఇల్లు అమ్ముకుని, బంధువులకు, పరామర్శలకు, ఆడంబరాలకు దూరంగా ఇక్కడ బ్రతుకుతున్నారు. ఆయన గురించి ఎవరూ ఆలోచించక పోదురు... అది బాధ్యత అవుతుంది కాబట్టి! కానీ, ఆయన గురించిన ఒక రసవత్తరమైన సబ్జెక్టు ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచగలిగింది. అదే ఆయన రెండవ భార్యగానో మరేదో రకంగానో చలామణి అవుతున్న అందమైన కుమారి.

కొన్ని గొప్పతనాలు చాలా విచిత్రంగా ఉత్సుకత కలిగించే విషయాల మధ్య కప్పడిపోతాయి. విలువలు జనం ఇచ్చేవే మరి.

అందుకే మాష్టారి గొప్పతనం, మంచితనం, విజ్ఞానం, కొంచెం ఆత్మస్థైర్యం, బిడ్డలవల్ల, బాధ్యతలవల్ల కలిగిన, గౌరవించ కలిగిన దుఃఖం మొత్తం ఇదంతా 'కుమారి' అనే ఒక గొప్ప మెరుపుల తుఫాను మధ్య చిక్కడిపోయి గుర్తింపబడవు.

అందుకే మాష్టారంటే ఇష్టమున్న.. చాలా మందికి ఏదో ఇబ్బంది ఆ ఇంట్లో అడుగు పెట్టాలంటే! "అయినా, ఆ మాష్టారుకు బుద్ధిలేదు. ఆ పిల్ల.. జీవితంలో దెబ్బ తినిందనో, మరేదో అయిందనో, ఈ వయస్సులో అంత అందమైన పిల్లను ఆదరించడమేమిటి, కొంగున నిప్పు కట్టుకోవడం కాకపోతే...!" హితులు, మిత్రులు, మాష్టారి ఫాన్స్, ఏదో ఒక వంకన రోజూ ఆయనను ఈరకంగా తల్చుకుంటారు మరి.

ఆలోచిస్తూ, ' ఒద్దు' అనుకుంటూనే అటు అడుగువేశాడు విశ్వం.

వెదురు, రెల్లుతో అల్లిన విశాలమైన పాక. చుట్టూ బంతి, కరివేపాకు, మందారాలు, వాకిట్లో ముగ్గు, లాంతరు దీపం... ఇదంతా కాదు అసలు వర్ణన అంటే... శుభ్రత... ఏదో పరిశుభ్రత! అదీ ఇంట్లో అనిపించేది, కనిపించేది.

"మాష్టారూ!" మెల్లిగా తలుపు తట్టాడు. ఇత్తడి మువ్వలు ఘల్లుమన్నాయి.

"రండి..." నవ్వుతూ బుడ్డిదీపం తుడుస్తూ ఆహ్వానించింది ఆ అమ్మాయి. తళుక్కున మెరిసే కళ్లు, బుగ్గన సొట్ట, పెదవి మీద తేనె రంగు పుట్టు మచ్చ... అలా వుంటే సాముద్రిక శాస్త్రంలో...

"లోపలికి రండి!" హాయి అయిన ఆహ్వానం ఆలోచనలను ఆపేసింది.

'మాష్టారూ...' నసుగుతూ అన్నాడు.

పాత పెట్టెలు వరుసగా పెట్టి, పైన చీరలతో కుట్టిన బొంత పరచి వుంది. అదే సోఫాసెట్టు... హాయిగానే వుంది మరి.

"మాస్టారు స్నానం చేస్తున్నారు. కూర్చోండి..." మజ్జిగ తెచ్చింది.

"సారీ! పాలు లేవు..." చేత్తో కొంగు తుడుచుకుంటూ అన్నది.

'పరవాలేదు...' అన్నట్లు తల సారించాడతను.

పక్కన చిన్న వంటగది. ఈ గది... ఇంతే ఇల్లంతా! ఒక పక్కన మాత్రం మాష్టారి పుస్తకాలు చాలా వున్నాయి.

"పుస్తకాలేనా! ఇవన్నీ పాడైపోతాయని భయమండీ. చంటిబిడ్డల్లా చూడాలి. కెమికల్స్ అంటే మాష్టారికి ఎలర్జీ, అందుకనే కలరా వుండల పొడి, ఏవో మూలికలు పడేస్తాను." చాలా ఏళ్లుగా తెలిసినట్టు మాట్లాడేస్తోంది ఆ అమ్మాయి.

ఇంత మంది పరిచయమే పరాయితనాన్ని హరిస్తుంది.

ఈ స్థలం ఆమెదే! గవర్నమెంటు ఉద్యోగి అయిన ఆమె భర్త కట్నం గొడవల్లో నానా హింసా పెట్టి, ఆమెను వదిలించుకున్నాడు. ఆ తరువాత చాలా చాలా జరిగాయి మాష్టారి దగ్గర హాయిగా ఉంది. నవ్వుతూ చెప్తోంది కుమారి.. మాస్టరు వచ్చేటప్పటికి!

“నాకూ కుమారి ఆదరణ హాయిగానే వుంది విశ్వం. ఒప్పుకోవాలి. జీవితమంతా నా బాధ్యతలు, బరువులు, బాధలు గుర్తు చేసే జనమే కానీ, నా కోసరం, నా గురించి ఆలోచించొచ్చు అన్న ఆలోచనే లేదయ్యా నాకూ! నా వారికీ ఉందా? అది తెలియడానికి కుమారి కావాల్సి వచ్చింది. ఇంత జీవిని అనుకునే నాకు..” నవ్వారు మాష్టరు బట్టతల తుడుచుకుంటూ.

ఏదో రమ్యత, ఆ వాతావరణంలో ఇది అని చెప్పలేనిది! చాలా మాట్లాడారు మాష్టారు. ఆయనకు పెన్షన్ వస్తోంది. కుమారి నగలు అమ్మి బ్యాంకులో వేసింది.

“అవసరాలు తగ్గించుకుంటే బాధలు కూడా తగ్గుతాయేమోనండీ. పరాయివాళ్ళతో పోటీ పడి, మనం మన జీవితం చాలా గొప్పది అని మర్చిపోతాం. నా పాత సంసారంలో అది ఎంతో అనుభవం నాకు. ఇవ్వాళ రేషన్ బియ్యం బావుండవనిపిస్తే రవ్వ పట్టించి, దిబ్బరొట్టి కాల్చుకుని, తలా ఒక ముక్క తినేస్తాం. సజ్జ రొట్టి, రాగి గంజి గొప్ప ఆహారం.. సరి పెట్టుకో కలిగితే!”

“మరి ఆరోగ్యం అవీ..” విశ్వం భార్య కల్తీ వస్తువుల మీద, విటమిన్లు, బలమైన ఆహారం మీద, ఇచ్చే లెక్చర్లు గుర్తుకు తెచ్చుకుంటూ అన్నాడు.

“అనారోగ్యమా! అది సహం వాతావరణం మీద ఆధారపడుతుంది. మిగత సహం తోచక కొందరూ, లగ్జరీ అని కొందరూ తెచ్చుకుంటారు. మన శరీరం మనం చెప్పిన మాట వినాలయ్యా! అది మన లోపలి వ్యక్తికి ఒక ఆయుధం అంతే! అరవై మూడేళ్ళు ఎలా వున్నాను నేనూ” గలగలా నవ్వారు మాష్టారు.

వెన్నెల్లో చంద్ర కాంతలు ఆరుబయట తెల్ల దుప్పటి వేసిన మంచం మీద నేనూ, మాస్టారూ. ఆవిడ ఎదురుగా గుమ్మానికి ఆనుకుని కొసరి కొసరి ఉల్లికారంతో సజ్జరొట్టెలు వడ్డిస్తూ, తన జీవితకథ చాలా చెప్పింది. ప్రపంచం ఆమె విషయంలో అసహ్యంగా చిత్రీకరించిన ప్రతి మలుపూ ఆమె భాషలో మరొక రకంగా రూపు దిద్దుకుంది.

“జీవితంలో మాష్టారుతో ఇలా బ్రతికే అవకాశం ఉంటుందంటే మరిన్ని బాధలు భరించే దాన్నేమో విశ్వంగారూ!” అంటూ మజ్జిగ తేవడానికి లోపలికి వెళ్లిన ఆమెను చూస్తూ, “ఇదయ్యా జీవితం! చాలా పుస్తకాల మీద, జీవితాల మీద విమర్శలు, పరామర్శలు రాశాను నేను. కానీ, నేను నేర్చుకున్నది ఇప్పుడే. జీవితం... దీనికి కామా, ఫుల్‌స్టాపు, కొటేషన్, ఏదీ లేదు. తీరం లేని సముద్రం. దానిమీద కామెంటరీ లేదు, విశ్లేషణా లేదు, విమర్శా లేదు.”

విశ్వానికి ఏదో గుండెంతా నిండి పోయిన అనుభూతి తృప్తి..!

కానీ విశ్వంలో విమర్శకుడికి ఇంకా సహజత్వం పోలేదు. అందుకే పది మందీ అనుకునే మాట

ఆమె ఒక వేళ వెళ్ళిపోతే..? అన్న ఆలోచన బయటపెట్టాడు.

“ఇది ఒకరకమైన దగ్గర తనం ఇచ్చిన స్నేహం. మనది అని ఏ వస్తువునన్నా, మనిషిని అన్నా.. అనుకోవడంలో ఏదో దాస్యం ఉందయ్యా. తెల్లవారితే, కుమారి నాకు కనబడకుండా ఇంత కన్న గొప్ప జీవితాన్ని వెతుక్కుంటూ పోతుందేమోనన్న భయం నాకు బంధనం, తద్వారా ఆమెను బంధించి అట్టే పెట్టాలన్న భయం, ఇదంతా భరించలేం. ఏమాత్రం జీవితం గురించి

తెలిసినా, మాటలకు, సంకెళ్ళకు, మంత్రాలకు, నైతికమైన రూల్సుకు అందని ఏదో అద్భుతం మమ్మల్ని కలిపి వుంచుతోంది అంతే" తేల్చి చెప్పేశారు.

ఆవిడ సౌందర్యం, స్నేహం, ఆవిడ నవ్వితే ముత్యాలహారం తెగినట్టు అనిపించడం, ఇవన్నీ స్వాప్నిక సందర్శనంలా ఉంది. బైట అనుభూతికి, భావనలో ఏదో గుండెంతా నిండిపోయిన పరిమళం తియ్యదనం, హాయి అది. వాతావరణం ట్రాన్స్మిట్ చేస్తోంది. "ఈ మనిషి ఆలోచనలతో వాతావరణాన్ని కంట్రోల్ చేస్తోందా!"

అడిగాడు ఆశ్చర్యంగా.

"నిజం... ఆదేనేమో జరుగుతోంది. నేనూ అన్నీ తెలిసిన దాన్నేం కాదు విశ్వం గారూ! స్వార్థం, నాదన్నగోల చాలా చాలా అనుభవించి, పోరాడి, అరిచి చాలా బాధలు పడ్డాను. కానీ నా బాధలకు కారణం.. నాకు అవగాహన లేకపోవడం అని ఎప్పుడూ అర్థం అవలేదు. మాస్టారి పరిచయంలో ప్రపంచంలో చల్లదనం, హాయి, ప్రశాంతత ఉన్నాయి ఇంకా.. అనిపించింది. వాటిని కుంచుపోయిన మనస్సు దాని ముడతల మధ్య ఇముడ్చుకోలేదేమోననిపించింది. ఇవన్నీ చుట్టూ వాతావరణం నుంచి గ్రహించుకునే రిసీవర్ మనసు వుంటే, చుట్టూ వాతావరణం నుంచి సెన్సిటివ్‌గా తయారై ఏది పొందామో, అది చుట్టూ ఉండే వాతావరణంలోకి ట్రాన్సిమిట్ చెయ్యొచ్చు అనిపించింది. బహుశ చదివితే ఒకప్పుడు అర్థం కాని వేదాంతాలు 'యద్భావం తద్భవతి' అంటే ఇదేనేమోనని పిస్తున్నాయి."

ఆ అమ్మాయి మాట్లాడుతూ ఉంది. ఆ మాటకన్నా నవ్వుతూ తృప్తిగా కూర్చున్న మాష్టారు ఆమెలో తన మేధస్సు విచ్చుకుని అక్షరాల తొడుగుతో, విహంగాలవడం చూసి ఆనందిస్తున్నారంటే.. అది నిజం అవుతుంది.

చీకటిలో కీచురాళ్ళ రొదలో గుడ్డి దీపం వెలుగులో చమ్మలో, ఈదురుగాలి, వర్షంలో. ఇవేవీ తెలియనట్టుగా గడిచి పోయింది కాలం.

ప్రపంచం వాళ్లిద్దరికీ అంటగట్టిన వ్యామోహం అనే జీవసమాధిలో, నిర్మోహత్వాన్ని.. తద్వారా నిశ్చలత్వాన్ని పొంది, తాము పొందే హాయిని అందరకీ పంచగల తపస్సులు వాళ్ళిద్దరు అనిపించింది విశ్వానికి.

"మహత్తరమైన అనుభవం సంభవించినప్పుడు తార్కిక జ్ఞానం విమర్శనా బుద్ధి పని చెయ్యదు., భావోద్వేగంతో నిమగ్నుడై చైతన్య ప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తి, ఒక్కసారి మెరుపులా ఛేదించి మరో అవతారం దాలుస్తాడు. చచ్చి బ్రతకడంలాంటిది.. ఆ అనుభవం" అన్న మహా రచయిత బుచ్చిబాబు మాటలకు అర్థం, అక్షరాల సందర్శించాడు విశ్వం.

అందుకే ఆ కథ రాశాడు. ఆ వ్యాఖ్యలు ముక్తాయింపుగా వాడుకున్నాడు.

జరిగినదంతా విని ఆశ్చర్య పోయాడు జనార్ధన్,

మేధావి కనుక విశ్వం అక్షరాల్లో అనుసరిస్తున్న ప్రక్రియను అందిపుచ్చుకో గలిగాడు.

ఆ కథన అక్షరం బీరుపోకుండా అచ్చు వేశారు.

'కథ అద్భుతం...' అని కొన్ని వందల ఉత్తరాల మధ్య పునర్జన్మ ఎత్తినట్టున్న విశ్వానికి..

"నువ్వు నేర్చుకున్నది నిజాయితీగా, నీ అహం పరదాలు వెయ్యకుండా రాసినందుకు ఆశీస్సులు. ఈ నేర్చుకునే స్థితిలోని 'రససిద్ధి' నీకు అనుభవమయినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. నీ కథలో కొన్ని కొన్ని ప్రశ్నలకు సమాధానం వెతుక్కుంటూ ప్రపంచం మీదికి విసిరేశావు. ఆది మంచి పద్ధతి. నాకు తోచిన జవాబు చెప్తున్నాను విను! మనం ప్రపంచం నుంచి ఏదీ ఆశించకుండా, దూరంగా ఉండి చెయ్యగలిగిన పని చేస్తూ ఉంటే, ప్రపంచం మన పాదాక్రాంతం అవుతుంది. అదే దాస్యవిముక్తి! మన నుంచి, మన ఆశలు కోరికలు కక్కుర్తుల నుంచీ, మనని మనం రక్షించుకున్నప్పుడు ప్రతి వ్యక్తిలో మనని మనం దర్శించుకుంటాం. అప్పుడు తేడాలు, బాధ్యతలు, అసహ్యతలు ఉండవు. ఇది నేను చెప్పగలిగిన జవాబు. ఈ నిర్మోహ దర్పణంలో భ్రాంతి నుంచి కాంతిని విడిచేసి చూడగల శక్తి, శాంతిని ఇస్తుంది.

కుమారి చాలా సంతోషంగా వుంది. నీ కథ చదివి ఆలోచించే ఏ ఒక్క పాఠకుడు దొరికినా, ఆనందం నాతో పంచుకోవడానికి వస్తావని ఆశిస్తూ, ఆశీర్వచనాలతో..

నీ సూర్యం మాస్టారు.

ఆ ఉత్తరం చదివి తలెత్తి చూశాడు జనార్ధన్ విశ్వం వంక. ఎన్నాళ్లైంది, అతని కన్నుల్లో నీరు ఘనీభవించి! ఎన్ని రోజులైంది ఆర్తిగా అది చెంపల్ని తాకి?!

ఆ అక్షరాల్లో నించి ఏదో శాంతి పరిమళం?

అక్కడి వాతావరణంలోకి ట్రాన్స్మిట్ అయిందా అనిపించింది ఆ ఇద్దరికీ.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 1990 దీపావళి ప్రత్యేక సంచిక నుంచి పునర్ముద్రణ)*

# మురికి కాలువ .. మనిషి మనసు

## కీ. శే. మాడపాటి హనుమంతరావు

**కథా మార్గదర్శి కథ**

***ఆ బజార్లో ధైర్యం చేసి, షావుకారుగారి గల్లపెట్టెని చూసే ధైర్యం ఎవరికీ లేదు. అంతా శారీరకంగా, మానసికంగా బలహీనులు. ఆయన ఖాతాదారులు. ఏదో విధంగా ఆయన గుప్పిట్లో ఉన్నవారు. అందుకనే ఎవరూ ముందుకి రాలేదు. మూకీ సినిమాలా కొద్దిక్షణాలు గడిచాయి.***

***మల్లయ్య నోటమాట పెగలడం లేదు. ఒళ్ళు చల్లబడుతున్నది. తాను అబద్ధం చెపుదామనుకొని, నిజం ఎలా చెప్పాడు? 'బ్రహ్మదేవుడా, నాకిటువంటి బుద్ధి ఎందుకిచ్చావయ్యా' అంటూ వాపోతున్నాడు.***


ఆ సందులో నడిచేవాళ్లు నమ్రతతో నమ్మకమైన నౌకర్లవలే తలలు వంచి, తమ మొహభంగిమలు బయటకు కనబడనివ్వకుండా ఊపిరి బిగబట్టి నడుస్తూ ఉంటారు. అది వారి స్వభావం కాదు, వారి గొప్పదనమూ కాదు.. ఆ సందులో సజీవంగా ప్రవహించే మురికికాలవే కారణం. ఆ సందులోని వాళ్ళ మురికిని మోయలేక భారంగా, మందకొడిగా ప్రవహిస్తూ, అప్పుడప్పుడూ మానవుల కరడుగట్టిన కల్మషం అడ్డురాగా పొంగి, పొరలి మట్టిరోడ్డుని రొంపి చేస్తూ, నడిచేవాళ్ళ ఒళ్ళు దగ్గర పెట్టుకొని నడిచేలా చేస్తున్నదా మురికికాలవ! దానికి మనుషులంటే కసీ, కోపం. వాళ్ళు తమ మాలిన్యమంతా తనకంటగట్టి, ఎందుకు తన్నింత హేయంగా, హీనంగా చేస్తున్నారో దానికి అర్థం కావడంలేదు. అందుకే తనను చూసి దూరం దూరంగా, భయం భయంగా పోతున్న వాళ్ళ వంక చూస్తూ "అరేయ్ అరేయ్, ఎందుకురా అలా ముక్కులు మూసుకుని అసహ్యించుకుంటారు? నేనెవర్ని రా? మీ శారీరక మురికిని, మలినాన్ని! నన్ను శుభ్రపరచండిరా! అరేయ్ ఎందుకు రా నన్ను ఈసడించుకుంటారు? మిమ్మల్ని మీరే దగా చేసుకుంటున్నార్రా! భౌతికంగా మీ ఒంటిమీద మట్టినీ, కంపునీ తొలగించుకున్నా మీ మనసుల్లోని చీకటిని రూపు మాపలేకపోతున్నారు. మీకన్నా పశుపక్ష్యాదులు నయం' అంటూ ఉక్రోషంగా తన దరి చేరిన ఈగల్నీ, దోమల్నీ, పురుగుల్నీ, కాకుల్నీ, కుక్కల్నీ, పందుల్నీ ఆప్యాయంగా ఆహ్వానించసాగింది.

చైత్రమాసపు సూర్యుడు చిరచిరలాడుతూ ఆఫీసుకి ఆలస్యంగా వచ్చిన నౌకర్ని దండిస్తున్న అధికారిలా ఉన్నాడు. దుర్గంధపు గాలి ఆ సందులో వాళ్ళ చెంపల్ని వాయిస్తున్నట్టు వీస్తుంది. "వెంకడు ఇంకా చావలేదు. వెధవ పదిపైసల కోసం పదిసార్లు

తిరుగుతాడు. పండగనాడు ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తాడు" అంటూ, మురికికాలవ బాగుచేసే వెంకడ్ని దీవిస్తూ వీధిగుమ్మం లోనుంచి చెత్తబుట్టని వీధిలోకి గుమ్మరించిందో ఇల్లాలు. ఎదురింటి ఇల్లాలు యధాశక్తి తుక్కుని సైడుకాలవలో దిమ్మరించింది. మేడ మీది మీనాక్షమ్మ తన వాటా అరటితొక్కల్ని అవలీలగా కిందికి విసిరి కొట్టింది.

ఆ సందు మొదట్లో ఒక చెత్తకుండీ, పెంటదిబ్బా ఉన్నట్టు కనబడుతున్నాయి. అది చెత్తకుండీ కాదు. పవ్వళించిన వరహాల గుంపు. దాని పక్కనున్నది పెంటదిబ్బ కాదు. చతికిలపడి కూర్చున్న వెంకడు. ఎఱ్రని తలగుడ్డ, బనీనులాంటి చొక్కా వేసుకున్నాడు. లాగు లాంటిది ఉన్నట్టు కనబడుతుంది. ఎంగిలి బీడీని సీరియస్గా తాగుతూ మధ్య మధ్య నోరు చప్పరిస్తున్నాడు వాడు. ఏదో తెలియని బాధతో, భయంతో, అసహ్యంతో వణికిపోతున్నాడు. ఉడికిపోతున్నాడు. గత రెండు రోజులుగా వాడి దగ్గర డబ్బులు లేవు. వాడు ప్రభుత్వం వారి సారాయి రుచి చూసి ఇరవై గంటలైంది. తేనెటీగల్లా ముసురుతున్న ఈగల్నీ, దోమల్నీ తోలుతూ వెంకటమ్మ అమ్మే నాలుగు రోజులనాటి పకోడీలు తిని, రెండు రోజులైంది. చీకట్లో అరవై పైసల సుబ్బిని తడిమి చాలా రోజులైంది. ఇవన్నీ అతనికి బాధగా లేవు. వెంకి రాత్రి సంపాదనతో గత రాత్రి ముష్టివాడిలా తిన్న మాంసం.. అతని కడుపులో తిప్పుతున్నది.

"ఛా, ఎదవ బతుకు, ఆలికి కూడెట్టలేని బతుకు. పోదూ--- పోతాది. పది పైసలెవడిస్తే వాడితోనే పోతాది. ఛా, ఎదవ జనమ" అంటూ బీడీ కింద పడేశాడు.



"ఎంత గొంతు సించుకున్నా పదిపైసలు ఇదల్చలేదు. ఈ సందులో వాళ్ళంతా సదువుకున్నోల్లు. ఉద్యోగస్తులు. గంగమ్మ తల్లొంటి, బూదేవంత గరబంతో బంగారం ఉంటుందంటారు. రెండు దినాలకాడ్నించీ ఎంత ఎతికినా నయాపైసా కూడా దొరకలేదు, ఎదవ జన్మ" అని విసుక్కుంటూ, పట్టు వదలని విక్రమార్కుడిలా చింకి చేటా, మొండి చీపురూ ఒకచేత్తో, చిన్న రేకులడబ్బా ఇంకో చేత్తో పట్టుకొని, మురికికాలవని పరిశీలించుకుంటూ పోతూ, ఉప్పెనగా పొంగిన చోట ఆగి, అక్కడ ముందు కాలవలో చేతులు జొనిపి, ఆత్రంగా మట్టిని చేటలో వెయ్యసాగాడు. తరవాత మురికినీటిని డబ్బాతో మట్టి మీద పోస్తూ, మొండి చీపురుతో మట్టిని కలియదిప్పి, ఆదుర్దాగా వెతికాడు. మట్టినంతా కెలికాడు. ఫలితం శూన్యం. 'లెగ్గానే ఒవుడి ముకం చూసినానో' అని విసుక్కుంటూ, ఆ మట్టిని రోడ్డు పక్కన పోసి, మళ్ళీ ఇంకో చోట ప్రయత్నించాడు. అతని కళ్ళు మిలమిల మెరిసాయి. నల్లటి మట్టి మధ్య తెల్లని వెండిరూపాయి బిళ్ళ. పావురాన్ని మీటినట్టు ఆప్యాయంగా దాన్ని నిమిరాడు. సుబ్బి శరీరాన్ని నలిపినట్టు పిడికిట్లో దాన్ని బంధించి, రోడ్డు వైపు తేరిపార చూసి, గబుక్కున లేచి నుంచున్నాడు. సైడుకాలవ పక్కనున్న భవనం వేపు చూశాడు.

కొన్ని వందల సీతాకోకచిలుకలు వాలిన మొక్కల్లా ఉన్నాయి రంగురంగుల పూలమొక్కలు. ఆ ఇంటివారి పచ్చదనం చాటుతున్నాయి. లాన్ చుట్టూ పెరిగిన చెట్లు, లాన్ వెనకాల రేకులతో కట్టబడిన కట్టడం వలే చూపరులకి మధురమైన ఆలోచనలు కలిగించే అందమైన మేడ ఉంది. ఆ మేడ ముందు పోర్టికోలో ఆగిన ఫారిన్ వైట్ కలర్ కారు.. పావురాల గుంపులా ఉంది. విరబూసిన మల్లె పందిరిలా ఉంది. ఆ ఇంటి మెయిన్ హాల్లో కూర్చున్న ఆనందరావుగారు సానబెట్టిన వజ్రంలా మెరుస్తున్నారు. ఆయన చేతిలోని లాటరీ టికెట్లు స్వర్గానికి ఇచ్చిన ఫ్రీ పాసుల్లా రెపరెపలాడుతున్నాయి.

ఆయన ఆదుర్దాగా పేపర్లో లాటరీ రిజల్ట్స్ చూస్తున్నారు. అంతలో ఆయనగారి శ్రీమతి షోకేసులో బొమ్మలా ఆయన ముందు నిలుచొని, "నిన్న పాపకిచ్చిన పదిరూపాయలు తీసుకున్నారా?" అని అడిగింది.

"పాపేమిటి? పదిరూపాయలేమిటి?" అన్నారు ఆదుర్దాగా తల పైకెత్తి ఆనందరావుగారు. డబ్బు పేరెత్తగానే, పడగ విప్పిన పాములా మారిపోతారు.

"నిన్న పది రూపాయల బిళ్ళ."

"ఏదీ, వెండిది. గాంధీగారిది. పారేసిందా?" అన్నారు చురుగ్గా, భార్య మాటలకు అడ్డు వస్తూ.

"నిన్న సాయంకాలం తీసుకుంది. లాన్లో ఆడుకుంది." ఆవిడ ఏదో ఆలోచిస్తూ ఆగింది.

"రాత్రంతా ఏం చేస్తున్నావ్? అయినా దానికెందుకిచ్చావ్" అన్నారాయన కోపంగా.

"నిన్న సాయంకాలం మిసెస్ రంగనాథం, మిస్ సుధా వచ్చారు. వాళ్ళతో ఎంగేజై, మారాం చేస్తూ ఉంటే ఇచ్చాను. అది ఆడుకోవడానికి వెళ్ళినప్పుడు.. యెస్, యెస్.. మల్లయ్య.. మల్లయ్య తోటపని చేస్తున్నాడు" అంటూ మాటలు త్రుంచి, త్రుంచి అంది.

అంతే! తుపాకి పేల్చినట్టు కేకలు వేశారు ఆనందరావు గారు.. "మల్లయ్యా.. మల్లయ్యా.."

“వస్తున్నాను బాబూ, వస్తున్నాను” అంటూ, తలగుడ్డ చుట్టుకుంటూ వచ్చాడు మల్లయ్య. కాయకష్టం చేసుకునే కర్షకుడి, కార్మికుడి నుదుటను మెరిసే చెమట బింధువులా ఉన్నాడు. నలభై సంవత్సరాలు నిండకపోయినా, అరవై నిండిన వాడిలా కనబడుతున్నాడు.

“పాప దగ్గర తీసుకున్న పదిరూపాయలేవి రా?”

“పాపగారి దగ్గరా?” అన్నాడు మల్లయ్య ఆశ్చర్యంగా.

“అదేరా, పదిరూపాయల బిళ్ళ. గాంధీగారిది.”

“పదిరూపాయలా? గాంధీగారిదా?”

“నీకేం తెలీదూ? చెప్పరా నిజం, ఇడియట్.” ఆయన ఆఫీసర్.

“నాకేం తెలియదండీ.” మల్లయ్య ప్యూన్. వంగిపోతున్నాడు.

“నిన్న సాయంత్రం నువ్వు తోటపని చేస్తున్నావు. పాప రూపాయిబిళ్ళతో ఆడుకుంటున్నది...”

ఆయన మాటలకి అడ్డొస్తూ వినయంగా అన్నాడు మల్లయ్య. ”పాపగారు బంతితో ఆడుకోడం చూశానండీ. పెద్దమ్మగారు లోపలికి పిలిస్తే వెళ్ళడం చూశానండీ.”

“అవును, అప్పుడది మరచిపోయి జారవిడిచిన పదిరూపాయల బిళ్ళ కాజేశావు. మర్యాదగా ఇవ్వు.”

“అదేంటి బాబూ అలా అంటారు? నేనలాంటివాణ్ని కాదు బాబూ. నాకేం తెలీదు” అన్నాడు మల్లయ్య రోదనాపూరిత స్వరంతో.

“రాస్కెల్, దొంగవేషాలు వేయకు, నాకంతా తెలుసు.”

“అమ్మాయిగారు పొరపాటున సైడుకాలవలో పారేశారేమో” అంటూ సాలోచనగా ఆగాడు మల్లయ్య.

వెంటనే అందుకున్నారు ఆనందరావుగారు. ”నీ బుర్రలో పడిన ఆలోచన చాలా చక్కగా ఉందిరా. సైడుకాలవలో పడిందో లేక నీ చొక్కా జేబులో పడిందో నాకు తెలియదు. నా పదిరూపాయలూ ఒక గంటలో తీసుకురావాలి. నీకేదో పిచ్చి పట్టింది, లేకపోతే పదిరూపాయలు కాజేస్తావా? నీకింకా సెలక్షన్ గ్రేడ్ ప్యూన్ పోస్టు ఇప్పిద్దామనుకున్నానే! పిచ్చిపిచ్చి వేషాలు వేసావంటే పోలీసుల్ని పిలుస్తాను” ఆఫీసరుగారు అరుస్తున్నారు.

మల్లయ్య నోట మాట రావడం లేదు. ఆఫీసరుగారు డబ్బు మనిషని తెలుసు. డబ్బుకోసం ఎటువంటి గడ్డైనా కరుస్తారని తెలుసు. తాను పదిరూపాయలు తెచ్చివ్వక పోతే, ఉద్యోగం పోతుందేమోనని భయం పట్టుకుంది అతనికి. ఏడుస్తున్నాడు, ప్రాధేయపడుతున్నాడు. ఫలితం శూన్యం!

“అరేయ్ మల్లయ్యా ఎందుకురా దొంగ ఏడుపులు? పదిరూపాయల వెండిబిళ్ళ కాజేసి, తినేసి, ఎందుకీ దొంగవేషాలు?

అయ్యగారు మంచివారు గాబట్టి సరిపోయింది. ఇంకోళ్లైతే ఈపాటికి పోలీసులను పిలిచేవారు. వెంటనే పదిరూపాయలు తీసుకురా, నీకూ మాకూ మంచిది" అని, లోపలికి వెళ్లింది ఇంటి ఇల్లాలు.

★★★

"మీరు తప్ప నాకింకెవరూ దిక్కు లేరండి, మీరే నన్ను రక్షించాల" ప్రాధేయపూర్వకంగా అన్నాడు మల్లయ్య.

"ఏమిట్రా, శుక్రవారం పొద్దున్నే ఏడుపు? నిన్నేగా పదిరూపాయలు తీసుకున్నావు?" అంటూ షావుకారు పానకాలు విసుక్కున్నాడు.

వృత్తం గీయాలని, లేఖిని సమంగా పట్టుకోలేని విద్యార్థి గీసిన అస్తవ్యస్తపు వృత్తంలా ఉంటుంది పానకాలు మొహం! తలకి రోజూ చవకైన మడ్డి ఆముదం పట్టించడం వల్ల, జుత్తు నాని, నాని చాలా భాగం ఊడిపోయి, నల్లటి బట్టతలపై కొద్దిపాటి తెల్లని వెంట్రుకలు విచిత్రంగా మెరుస్తున్నాయి. ఎండలో మెరుస్తున్న తారురంగులో మెరిసిపోతున్న మొహంపై పెట్టిన కుంకుమబొట్టు మాంత్రికుడ్ని కూడా మసి చేస్తుంది. భారీ అయిన అతని శరీరాన్నీ, తలనీ కలపడానికి మెడ లేదనుకోడానికి వీల్లేదు. ఏనుగు తొండానికి తగిలించిన ఒంటిపేట గొలుసులా, అతని మెడలో కూడా బంగారపు గొలుసు ఉంది. అతని ఎడమచేతికి విక్టోరియా మహారాణీ కాలం నాటి రిస్టువాచీ ఉంది. పాతబడిన బూజు భావాలు అతని మనసులో ఉన్నాయి. కుడిచేతి చూపుడువేలికి పెట్టిన బంగారు ఉంగరంలో వేంకటేశ్వరస్వామి ఉన్నాడు. ఆ ఊరిలో పెద్ద వ్యాపారి. చిల్లర, ఫేన్సీ, మెడికల్, బట్టల షాపులే కాక, వడ్డీ వ్యాపారం కూడా చేస్తూ ఉంటాడు. ఊరిలో పెద్దమనుషుల్లో ఒకడి కింద లెక్క. పది పైసల కోసం పచ్చగడ్డి తినే రకం!

"అది సరేలే, పన్నెండు రూపాయలెందుకురా?" మాటలు సాగదీస్తూ ప్రశ్నించాడు పానకాలు.

"మీరిచ్చేది పదిరూపాయలేగా? రెండురూపాయలు వడ్డీ కింద పట్టుకుంటారుగా" అన్నాడు మల్లయ్య అమాయకంగా, కోపంగా.

"ఏడిసావులే! ఈ కాయితం మీద కెలుకు నీ ఏడుపు" అంటూ తెల్లకాయితం ఇచ్చాడు పానకాలు. అంతలో కొనుగోలుదారులు వచ్చారు.

"కిలో బెల్లం", "అరకిలో మిర్చీ", "అర్ధణా వెల్లుల్లి".. గుమాస్తా చంద్రం వస్తువులు తూచి ఇస్తున్నాడు. షావుకారు ఆజ్ఞలననుసరించి, ఇద్దరు పిల్లగుమస్తాలు లోపల్నుండి సామాన్లు తెచ్చి, చంద్రానికి అందిస్తున్నారు. కొనుగోలుదారులు అంతకంతకీ పెరుగుతున్నారు. పన్నెండు రూపాయలు ముట్టినట్టు రాసి, సంతకం చేసి ఇచ్చాడు మల్లయ్య. పానకాలు అది అందుకుని, చదువుకుని, సొరంగంలాంటి చొక్కా జేబులో కూరుకున్నాడు. అంతలో హడావిడిగా కొంపలంటుకుపోతున్నట్టు.. "కిలో ముతక బియ్యం ఇప్పించండి దొరా" అంటూ పదిరూపాయల వెండిబిళ్ళని పానకాలు చేతికిచ్చాడు వెంకడు.

ఉలిక్కిపడ్డాడు మల్లయ్య. రూపాయిబిళ్ళ అందుకుంటూనే, దాన్ని ప్రేమగా నిమురుతూ గల్లాపెట్టెలో పడేశాడు పానకాలు. మిగతా కొనుగోలుదార్ల హడావిడిలో పడ్డాడు, వెంకడి వంక చూడకుండా! పది నిమిషాలకి హడావిడి తగ్గింది. అందరూ

వెళ్ళిపోయారు. మల్లయ్య మౌనంగా నించున్నాడు. షావుకారుని తొందర చేసి ప్రయోజనం లేదని తెలుసు. పుచ్చుకునేవాడు ఇచ్చేవాడికి లోకువని పూర్వానుభవం వల్ల, పానకాలుని ఎటువంటి హెచ్చరికలూ చేయకుండా మౌనంగా ఊరుకున్నాడు.

"బేగి బియ్యమిప్పించండి దొరా" అన్నాడు వెంకడు.

"అరేయ్ చిన్నోడా కిలో బియ్యం కొలు" అంటూ హుకుం జారీ చేశాడు పానకాలు. "పట్టు" అంటూ, ఒక కొలతపాత్ర లాంటి డబ్బాతో బియ్యం తెచ్చి, వెంకడి తువ్వాలులో పోసాడు చిన్నాడు.

"సిల్లరిప్పించ్చండి దొరా, ఎల్లాల" అన్నాడు వెంకడు.

"చిల్లరేంటి రా, తొంభయ్యైదు పైసలిచ్చి కదులు."

"ఏంటి దొరా, ముందుగానే ఇస్తిని రూపాయ."

"రూపాయా?" నొసలు చిట్లించాడు పానకాలు.

"నానిస్తిని దొరా, పదిరూపాయల ఎండి బిళ్ళ. గాంధీగారిది" అన్నాడు వెంకడు అమాయకంగా.

"గాంధీగారిదా? గుర్రమెక్కి వచ్చావా బికారి వెధవా, నా దగ్గర నీ వేషాలు పనికిరావు. డబ్బులిచ్చి కదులు బికారి నాయాలా!"

ఇంతలో ఇద్దరు కొనుగోలుదారులు వచ్చారు.

"ఏసికాలేస్తున్నది నువ్వా నానా?" అన్నాడు వెంకడు కోపంగా.

"మర్యాదగా మాట్లాడు. నీలాంటి వాళ్ళను రోజూ చూస్తూనే ఉంటాను. పిచ్చిపిచ్చిగా వాగకుండా మర్యాదగా డబ్బులిచ్చి కదులు."

పానకాలు గట్టిగా మాట్లాడుతూనే ఉన్నాడు. అతని గుమస్తాలు వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటూనే ఉన్నారు. వాళ్ళు నిజంగా ఏం జరిగిందీ చూడలేదు. వాళ్ళు ఆయన బానిసలు. జీవచ్ఛవాలు. పీనుగులు.

"మరియాదగా మాటాడండి" అన్నాడు వెంకడు తిరిగి.

"ఏం కొడతావా? కొడతావా?" అంటూ లేవబోయాడు పానకాలు.

ఆయన లేవడం అంత సులభం కాదని ఆ రోడ్డుమీద వారందరికీ తెలుసు. జనం కొట్టు ముందు మూగుతున్నారు. అంతలో ఎవరో అడిగారు అసలు ఏం జరిగిందని.

"కిలో బియ్యం తీసుకుని, డబ్బులిమ్మంటే ఇచ్చానంటాడు. గదమాయిస్తే, పదిరూపాయల వెండిబిళ్ళ ఇచ్చానంటాడు. కలికాలమండీ, బికారివాళ్ళకి కూడా పెద్దపెద్ద మాటలు" అన్నాడు పానకాలు బిగ్గరగా.

"సత్తెపెమానకంగా సెప్తున్నాను, ఈయన కూడా ఉన్నారు" అంటూ మల్లయ్య వంక చూపించాడు వెంకడు.

"అయితే నేను దొంగనట్రా? పెద్దంతరం, చిన్నంతరం లేకుండా ఏంట్రా కూతలు కూస్తున్నావు. అరేయ్ మల్లయ్యా, చెప్పరా, వాడిచ్చాడా?" అంటూ పానకాలు కుడిచెయ్యి జేబులోనికి పోనిచ్చాడు.

పచ్చివెలక్కాయ నోట్లో పడినట్టైంది మల్లయ్యకి. నీళ్ళు నములుతూ నించున్నాడు.

"సత్తెం చెప్పాలి దొరా, అగ్గురారంలో చీమంతుల స్టీటులో మురిక్కాలవలో దొరికిందీ ఎండి రూపాయ. ఓరిదో నాకు తెల్దు. పదిరూపాయలు" అన్నాడు వెంకడు ఒత్తిఒత్తి పలుకుతూ.

మల్లయ్య కళ్ళు పెద్దవి చేసి అన్నాడు "నిజంగానా."

వెంకడు ఏమంటున్నాడో మల్లయ్యకి వినబడడం లేదు. అతని మెదడు చురుగ్గా పనిచేస్తున్నది. నిజం చెప్పినా ప్రయోజనం లేదని తెలుసు. షావుకారు అబద్ధాలు మంచినీళ్ళ ప్రాయంగా చెప్తాడు. పైసా కోసం పెంట తినే రకం. తానిప్పుడు వెంకడ్ని వెనకేసుకొస్తే అప్పివ్వడు. డబ్బివ్వకపోతే ఆఫీసరుగారు తన ఉద్యోగానికి ఉద్వాసన ఇప్పిస్తారు. అంతటి సమర్థులే ఆయనగారు. కానీ వెంకడు.. ఏ పాపం ఎరగని వెంకడు అన్యాయమైపోతాడు. తానేం చెయ్యాలి?

"సెప్పండి.. సావుకార్ని చూసి భయపడమోకండి" వెంకయ్య.. మల్లన్నకి ధైర్యం అందిస్తున్నాడు.

"వాడు చూశాడో లేదో. ఒరేయ్ మల్లయ్యా నువ్వు చూడకపోతే చూడలేదని చెప్పు. నేనున్నానుగా, నీకేం భయం లేదు" అంటూ సాక్షికి పాయింట్ అందించే లాయర్లా ఉన్నాడు పానకాలు.

"చెప్పవయ్యా చూసావో లేదో" అన్నారెవరో.

మల్లయ్య శరీరం తేలికైపోతున్నది. చెమటలు పడుతున్నాయి. మనసు గట్టిగా అంది. 'నువ్వు చూడలేదు.. చూడలేదు.' పెదిమల్ని తడుపుకుంటూ, వణికిపోతూ వెంకడి వంక చూసి, అనాలోచితంగా, గబగబ అన్నాడు "చూశాను. నేను చూశాను. వెంకడు పదిరూపాయల బిళ్ళ షావుకారుగారి కివ్వడం చూశాను."

"పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో గాని పోవట. ఆ పోరంబోకు నాయాల ఇచ్చాడట. ఈ తాగుబోతు నాయాల చూశాడట. నేనే అబద్ధాలకోరుని! చూడండయ్యా గల్లాపెట్టె! పదిరూపాయల బిళ్ళుంటే ఎడం కాలి చెప్పుతో కొట్టండి" అంటూ గల్లాపెట్టె సగం తెరిచాడు పానకాలు.

ఆ బజార్లో ధైర్యం చేసి, షావుకారుగారి గల్లపెట్టెని చూసే ధైర్యం ఎవరికీ లేదు. అంతా శారీరకంగా, మానసికంగా బలహీనులు. ఆయన ఖాతాదారులు. ఏదో విధంగా ఆయన గుప్పిట్లో ఉన్నవారు. అందుకనే ఎవరూ ముందుకి రాలేదు. మూకీ సినిమాలా కొద్దిక్షణాలు గడిచాయి.

మల్లయ్య నోటమాట పెగలడం లేదు. ఒళ్ళు చల్లబడుతున్నది. తాను అబద్ధం చెపుదామనుకొని, నిజం ఎలా చెప్పాడు? 'బ్రహ్మదేవుడా, నాకిటువంటి బుద్ధి ఎందుకిచ్చావయ్యా' అంటూ వాపోతున్నాడు.

"సావుకారూ మరియాదగా మాట్లాడు. అగ్గితో సెలగాటాలాడకు. ఇచ్చెయ్.. మిగతా పైసలిచ్చేయ్" అంటూ అగ్గి మీద గుగ్గిలంలా ఉన్నాడు వెంకడు.

"ఏమిట్రోయ్ మీదిమీదికి వస్తున్నావ్? కొడతావా, కొట్టు చూద్దాం. పట్టపగలు కంట్లో కారం కొడదామనుకుంటున్నావా?"

"పానకాలుగారూ" అంటూ మల్లయ్య ఏదో చెప్పబోయాడు.

"నువ్వూ వాడితో కలిసి దొంగనాటకం ఆడుతున్నావా? ఇద్దరూ కలిసి దొమ్మీ చెయ్యడానికి వచ్చారు. ఈ నక్సలైట్ చేష్టలు నా దగ్గర సాగవు" పానకాలు ఆవేశంతో వణికిపోతున్నాడు.

"ఏంటయ్యో గోల చేస్తున్నావు? డబ్బులు ఇస్తావా, ఇవ్వవా?" అంటూ కొంచెం ముందుకు వచ్చాడు వెంకడు. మల్లయ్య వాడ్ని వెనక్కు లాగాడు.

పానకాలు శివం ఎత్తినట్టు ఊగిపోతూ "కొట్టండిరా. కొట్టుని లూటీ చెయ్యండి రా" అంటూ ఊగిపోతున్నాడు.

అంతలో ఆ రూటు 'బీట్ కానిస్టేబుల్' ఫుట్ పాత్ వ్యాపారుల్ని పలకరించుకుంటూ, పానకాలు కొట్టు ముందు అలజడి చూసి అక్కడికి వచ్చాడు.

"వచ్చారా, మీ కోసం కబురు పంపుదామనుకుంటున్నాను" అన్నాడు పానకాలు రొప్పుతూ, ఆయాసపడుతూ.

"ఏం, పంచదార గాని వచ్చిందా?" అడిగాడు పోలీస్ మామూలుగా.

"నీ పంచదార బంగారంగానూ.. ఈ మల్లయ్యా, ఆ వెంకడూ నా కొట్టు దొమ్మీ చెయ్యడానికి వచ్చారు. నన్ను కొట్టడానికి వచ్చారు!" అంటూ ఉన్నవీ, లేనివీ కల్పించి చెప్పసాగాడు పానకాలు.

"పదండి స్టేషన్‌కి" అన్నాడు కానిస్టేబులు.

"మేం టేసనుకెందుకండీ" అన్నాడు వెంకడు.

"మేం ఏం చెయ్యలేదండీ" అన్నాడు మల్లయ్య.

"అవన్నీ స్టేషనులో చెప్దురు గాని, ముందు పదండి" అంటూ లాఠీకర్ర ఆడించాడు పోలీస్.

"పంచదార రాగానే కబురంపుతాను లెండి" అంటున్నాడు పానకాలు.

అది రోడ్డు. జనం ఉన్నారు. సినిమా చివర 'శుభం' రాగానే వెళ్ళిపోయిన ప్రేక్షకుల్లా కదిలి వెళ్ళిపోయారు.

"మురికి కాలవనెవరో కెలికినట్టున్నారు, వెలిగించండిరా ఆగరొత్తులు" అని అరిచాడు పానకాలు. అప్పటికే మల్లయ్యనీ, వెంకడినీ వెంటబెట్టుకొని వెళ్లిపోయాడు పోలీసు.

*(ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక 08.11.1972 నుంచి పునర్ముద్రణ)*

ఎటువంటి లాభాపేక్ష లేకుండా,
తెలుగు కథ ప్రాచుర్యమే ధ్యేయంగా
నడుపబడుచున్న పత్రిక .. మన
**కథామంజరి.**
సాధారణంగా ఏ పత్రికనైనా,
చందా చెల్లింపు ద్వారానే పొందగలం.
కాని కథామంజరి విషయంలో
చందా అనేది ఐచ్ఛికం మాత్రమే.
చందా చెల్లించినా, లేకున్నా..
అందరూ అందుకునే పత్రిక ఒకటే!
తెలుగు కథను
చదవండి .. చదివించండి!

వార్షిక చందా రూ.200/-

ఉచిత సంచిక కోసం